21-7Pg1exHMNWJQE.qxdo/p:21-7Pg1exHMNWJQE.qxd 1/1/02 7:01 AM Page 1

పాయింట్ గత వారంరోజుల్లో విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

21-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 171 పేజీలు: 16 వెల: 6.50

అయోధ్య సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి: సుప్రీంకోర్టు

డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ

5లో



పోలీసుల లాఠీచార్జ్



ఢిల్లీలో పోటెత్తిన సిజెపి కార్యకర్తలు





ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

## కాక్రోచ్ పార్టీ ర్యాలీ ఉద్రిక్తం

# అట్టుడికిన ఢిల్లీ

ఆందోళనకారులపై లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం

కార్యకర్తలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

సిజెపి ప్రతినిధులతో జెపి నడ్డా చర్చలు

దీక్షలు విరమించిన వాంగ్‌చుక్, అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 20:** పరీక్షల సంస్కరణలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలో నిర్వహించిన సంసద్ చలో ర్యాలీ ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. దాదాపు 20వేలమందికిపైగా వచ్చారని చెపుతున్న ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు స్పష్టంచేసారు. అంతేకాకుండా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీ తీసారని పోలీసులు లాఠీ ఛార్జిచేయడంతో ఎక్కడికక్కడ ఆందోళన కారులు చెల్లాచెదురయ్యారు. మరోవైపు పార్లమెంటు స్ట్రీట్‌లోకి >>2

## ఉభయసభల్లో రభస

చర్చలు లేకుండానే నేటికి వాయిదా

నీట్ లీకేజ్, అయోధ్య విరాళాల చోరీపై విపక్ష సభ్యుల నిరసనలు



**న్యూఢిల్లీ,జులై 20:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజున ఉభయసభల్లో విపక్షాల నిరవధిక నిరసనలతో మారుమోగాయి. నీటిలీకేజిలపై సిజెపి నిరసనలు, అయోధ్య విరాళాల చోరీ వంటి వాటిపై ప్రత్యేక చర్చ జరపాలంటూ విపక్షాలు పట్టుబడుతూ రావడంతో పదేపదే వాయిదా పడుతూ వచ్చాయి. విపక్ష >>2

## ఉత్తరాంధ్ర మణిహారం భోగాపురం ఎయిర్‌పోర్టు

1న విమానాశ్రయంతోపాటు ఏవియేషన్ హబ్ వర్సిటీ, ఎడ్యుసిటీని ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ఏర్పాట్లపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ. జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆగస్టు 1 తేదీన ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు ప్రధానిమోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను తెలుపుతూ థింసా, సవర, కొమ్ము కోయ తదితర సంప్రదాయ నృత్య రూపాలతో ఘనస్వాగతం పలకాలని తెలిపారు. ఆగస్టు 1తేదీన విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్ యూనివర్సిటీతోపాటు జీఎంఆర్‌మాన్సాస్ ఎడ్యుసిటీలను ప్రధాని మోదీ లాంఛనంగా ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర మణి హారంగా నిలవనున్న ఈ విమానాశ్రయం లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక గేమ్ చేంజర్‌లా మారుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి లాంటి సదుపాయాలు కల్పించాలన్నారు. రేపటి నుంచి జూలై 31 తేదీ వరకూ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్ కూడా వేదికగా దీనిని మలచాలని సూచించారు. >>2

# 'ఆక్వా కల్చర్'ను ఆదుకోండి

సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి

అమరావతిలో ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం అవసరం

ప్రాసెస్ చేయని పొగాకుపై జిఎస్టీ తగ్గించాలి

ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా సిఎం చంద్రబాబు లేఖలు



**విజయవాడ, జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య,పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా , యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్ షాప్ లో అమరావతిలో ఎన్ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణకేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగు మతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. >>2



## త్రిపుర డిజిపి ఆత్మహత్య

తన ఛాంబర్‌లోనే తుపాకీతో కాల్చుకున్న వైనం

**అగర్తలా,జులై 20:** త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే,ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరు కుని పరిస్థితిని సమీక్షించారు. >>2

గర్భిణులు, నవజాత శిశువుల కోసం

# తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

అన్ని సౌకర్యాలతో త్వరలో 500 వాహనాలు రెడీ, యేటా దాదాపు 2.75 లక్షల మందికి ప్రయోజనం



సోమవారం తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ నూతన వాహనాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు,తల్లి-శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500ప్రత్యేక ఎస్ఎవి/ఎంయువి వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ:** వాహనాల్లో తల్లీ-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు >>2

## మునికూడలికి మోడల్ పుష్కర్ పంచాయతీ హంగులు: డి.సిఎం పవన్




**విజయవాడ.జులై20.ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛగోదావరి -పవిత్ర పుష్కరాలు అనే థీమ్‌తో గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం పరిధిలోని మునికూడలిని మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.7 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డీసీఎం పవన్ కల్యాణ్ నిరంతర పర్యవేక్షణలో ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మునికూడలి గ్రామం మరియు సప్త ఋషి ఘాట్‌ను పర్యావరణహితంగా, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. మునికూడలి మోడల్ పుష్కర్ పంచాయతీ పనుల పురోగతిపై సోమవారం >>2

ట్రైనీ ఐపిఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో

## ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



జాతీయ పోలీసు అకాడెమీ నుంచి సస్పెన్షన్

అతడు సూసైడ్‌కు యత్నించలేదని వైద్యుల నివేదిక

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో ట్విస్ట్ నెలకొంది. ఈ ఘటన వెలుగు చూసిన తరువాత అవమాన భారంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతని సోదరుడు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో కోలుకుంటున్నాడు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర శిక్షణ వ్యవహారాల శాఖ (డిఓపిటి) దీని పై జాతీయ పోలీసు అకాడమి నుంచి అత్యవసరంగా నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఎన్‌పిఎ అధికారులు ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీనిపై డిఓపిటికి వెంటనే నివేదిక పంపారని తెలిసింది. ఇంకోవైపు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ ద్వారా ఒక లేఖ విడుదల చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మహిళా అధికారిణిని తాను వేధించలేదని, ఆమె తన గదికి వచ్చిందని, తనను ఇబ్బంది పెట్టిందని, దీనిపై తన వద్ద అన్ని ఆధారాలు వున్నాయని, ఈ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, నిజాలు నిలకడగా బయటకు వస్తాయని అందులో వుంది. కాగా ఈ వాట్సాప్ లేఖపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దేశ వ్యాప్తం గా సంచలనం రేపిన జాతీయ పోలీసు అకాడమిలో ట్రైనీ >>2

## మద్యం టెండర్లలో రూ.192కోట్ల దోపిడి: సిట్

**విజయవాడ.జులై20.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్లలో రూ.192 కోట్ల దోపిడీ జరిగిందని వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే పక్కా ప్రణాళికతో టెండర్ల విధానాన్ని మార్చారని తెలిపింది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు బినామీ కంపెనీలను తెరపైకి తెచ్చారని వివరించింది. రవాణా ఛార్జీని కిలోమీటరుకు రూ.19.68 నుంచి రూ.35కు పెంచారని పేర్కొంది. టెండర్లు లేకుండానే సిగ్మా గడువును నాలుగుసార్లు పొడిగించారని, అప్పటి డిప్యూటీ సీఎం అభ్యంతరాలను కూడా బేఖాతరు చేశారని సిట్ వెల్లడించింది. షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించారని, వాసుదేవరెడ్డి బావమరిదికి చెందిన మిల్క్ కంపెనీకి అక్రమ సొమ్ము బదిలీ అయిందని తెలిపింది. దీనికి సంబంధించిన డిజిటల్, కాల్ డేటా ఆధారాలను సేకరించినట్లు వివరించింది.

# భోగాపురం విమానాశ్రయం.. కౌంట్‌డౌన్!

- విమానయాన రంగంలో సరికొత్త మైలురాయి • ఆగస్టు 1న అందుబాటులోకి అత్యాధునిక విమానాశ్రయం
- యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు • మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి



**విజయనగరం, జులై 20 ప్రభాతవార్త:** అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరుపెట్టిన సరికొత్త విశాఖ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 1 ఆగస్టు 2026న జాతికి అంకితం చేసేందుకు సిద్ధం కావడంతో, విశాఖ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అధికారికంగా సమయం దగ్గర పడుతోంది. ఈ ప్రారంభోత్సవం భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వైమానిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకదాని పరిపూర్ణతను సూచిస్తుంది. ఉత్తర కోస్తా ఆంధ్రకు అనుసంధానం, ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధిలో మెరుగైన ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని పెరుగుతున్న ఈ ప్రాంత విమాన యాన అవసరాలు తీర్చే విధంగా రూపొందించింది. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణీకులు (ఎంపీపీఏ) ప్రయాణించే సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ విమానాశ్రయం భవిష్యత్తులో దశల వారీగా 4 కోట్ల ఎంపీపీఏలకు పైగా వీలు కల్పిస్తుంది. విమానాశ్రయంలో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే, ఆధునిక ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్, ప్రత్యేక కార్గో సౌకర్యాలు, ఆధునిక విమానయాన ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించగల సామర్థ్యం వీటికి ఉంటుంది. వాణిజ్య కార్యకలాపాలకు సంసిద్ధతను ప్రదర్శిస్తూ, ఈ విమానాశ్రయం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నుంచి భద్రతా మదింపు పరిశీలన ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐసీపీ)గా నోటిఫికేషన్, కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 8 కింద కస్టమ్స్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి దీన్ని నిర్వహించడానికి అనుమతి (సీటీఓ)తో పాటు, సంబంధిత నియంత్రణ అధికారుల నుంచి ఇతర తప్పనిసరి కార్యాచరణ ఆమోదాలతో సహా అన్ని ప్రధాన చట్టబద్ధమైన, నియంత్రణ అనుమతులను పొందింది. ఈ ఆమోదాల వల్ల ప్రారంభోత్సవం జరిగిన వెంటనే షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. విశాఖ సమీపంలో భోగాపురం దగ్గరున్న విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలోని పొరుగు జిల్లాలకు ప్రాథమిక విమానయాన మార్గంగా ఉంటుంది. ప్రధాన దేశీయ, అంతర్జాతీయ గమ్యాలను చేరుకోవడంలో చెప్పుకోదగిన మెరుగుదల తీసుకువస్తుంది. పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్, తయారీ, పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్తర కోస్తా ఆంధ్రలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం, దాని సమీప జిల్లాలతో విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను వేగవంతం చేశాయి. ఏడు అప్రోచ్ రోడ్లు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచాయి. హైవే కనెక్టివిటీ విమానాశ్రయానికి ప్రయాణీకులు వచ్చిపోయేందుకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అత్యంత సౌకర్యంగా ఉంటుంది. ప్రయాణీకులకు కనెక్టివిటీ కల్పించడమే కాకుండా, ఈ విమానాశ్రయం దీర్ఘకాలంలో ఆర్థిక అభివృద్ధికి ప్రేరకంగా పనిచేస్తుందని ఆశిస్తున్నారు. కార్గో ప్రాథమిక సౌకర్యాలు, పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలో ఉండడం, లాజిస్టిక్స్ సామర్థ్యం మెరుగుగా ఉండడంతో, సమాచార సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సముద్ర ఆహార ఎగుమతులు, ఆధునిక తయారీ వంటి ఎదుగుతున్న రంగాలకు మద్దతుగా ఉంటుంది. సమర్థవంతమైన, సుస్థిరమైన, భవిష్యత్తుకు సన్నద్ధంగా ఉండే కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే విధంగా, పునరుత్పాదక శక్తి, వర్షపు నీటి సేకరణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణ బాధ్యతాయుత మౌలిక సదుపాయాలను పొందుపరుస్తూ, సుస్థిరతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఈ విమానాశ్రయం అభివృద్ధి చేయడం జరిగింది. తుది సన్నాహాలు చివరి దశకు చేరుకోవడంతో, విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని, కార్యకలాపాల నిర్వహణ ప్రారంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు, విమానాశ్రయ భాగస్వాములు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో కృషి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ విమానయాన ప్రస్థానంలో చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది ప్రయాణీకులకు, వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు నూతన అవకాశాలను సృష్టించడంతోపాటు, విశాఖపట్నంను "తూర్పు ముఖద్వారం"గా, తూర్పు భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మరింత



బలోపేతం చేస్తుంది.

**మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి:** భారత విమానయాన రంగం మరో కీలక అడుగుకు రంగం సిద్ధమయ్యింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలు, వాణిజ్య రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో అత్యాధునిక హంగులతో భోగాపురంలో సరికొత్త అంతర్జాతీయ విమానాశ్రయం తన కార్యకలాపాలకు సంసిద్ధమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆధునిక హంగులతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్ట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేయనుంది.

**రికార్డు స్థాయి సౌకర్యాలు:** భోగాపురం విమానాశ్రయం సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో రూ. 4,592 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఇక్కడ అన్ని రకాల వసతులను కల్పించారు.

**అంతర్జాతీయ స్థాయి రన్‌వే:** 3,800 మీటర్ల పొడవైన కోడ్ ఇ రన్‌వేను నిర్మించారు. ఇది భారీ వైడ్‌బాడీ అంతర్జాతీయ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు, టేకాఫ్ చేసేందుకు వీలు కల్పిస్తుంది.

**వాణిజ్యానికి ఊతం:** ఎగుమతులు, దిగుమతులను వేగవంతం చేసేందుకు 5,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక కార్గో టెర్మినల్‌ను అందుబాటులోకి రానుంది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, సమాంతర టాక్సీ వేలు, ఫ్యూయల్ హైడ్రెంట్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతిక వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

**దశలవారీగా భారీ విస్తరణ:** ప్రస్తుతానికి ఈ విమానాశ్రయం ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా సిద్ధమైంది. అయితే, భవిష్యత్తులో విమాన ప్రయాణికుల రద్దీని ఊహించి, దశలవారీగా దీనిని ఏటా 4 కోట్ల మందికి పైగా ప్రయాణికులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం వరకు విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి, దానికి అనుగుణంగా మొదటి దశ పనులను పూర్తి చేశారు.

**ఆర్థికాభివృద్ధికి బాటలు:** ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణాలకే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వనుంది. రాకపోకలు సులభతరం కావడంతో పెట్టుబడులు పెరగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా భారీగా మెరుగుపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఇదొక మేలి మలుపుగా పేర్కొనవచ్చు.

**ఆగస్టు 1న జాతికి అంకితం:** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిఎంఆర్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.



## యుకెకు తిరుపతి మామిడి గుజ్జు ఎగుమతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తిరుపతి నుండి మామిడి గుజ్జు తొలిసారిగా ఎగుమతి జరిగింది. తిరుపతికి చెందిన వర్ష ఫుడ్స్ సంస్థ యూకేకు తొలి మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) ఎగుమతి కంటైనర్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎపిడిఎ ప్రాంతీయ ఎజిఎం ఆర్. పి. నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఫణి కిరణ్, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి, తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి మాట్లాడుతూ భారత్–యూకే ఎఫ్‌టీఏ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఉత్పత్తులకు కొత్త ఎగుమతి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తిరుపతి నుంచి తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఎగుమతులు పెరగడం వల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు, ప్రాసెసింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఉద్యాన శాఖ అందిస్తుందని, రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు సమన్వయంతో పనిచేస్తే రాష్ట్ర ఉద్యాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు.

## దొంగ ఓట్లు పూర్తిగా తొలగిస్తాం

- జగన్‌కు మతిభ్రమించింది: రాష్ట్రమంత్రి అనగాని



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో దొంగ ఓట్లను పూర్తిగా తొలగిస్తామని, ఎన్నికల సవరణ (సర్)ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. దొంగ ఓట్ల తొలగింపుతో వైఎస్ జగన్‌కు మతి భ్రమించిందని, ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడం ఆయనకు అస్సలు ఇష్టం లేదని మంత్రి విమర్శించారు. రామాయపట్నం పోర్టు విషయంలో జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో మాజీ ఐపిఎస్ అధికారి ఎవి వెంకటేశ్వరరావు వ్యాఖ్యలపై కూడా మంత్రి విరుచుకుపడ్డారు. ఆయనో పెద్ద మేధావిలా ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదంటూ ఘాటుగా స్పందించారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా నిర్మించబోతున్నామని మంత్రి చెప్పారు.

## ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ విజేతగా సాయి నచికేత్

### జూనియర్ ఛాంపియన్‌గా తొలి భారతీయుడుగా ఖ్యాతి




**నెల్లిమర్ల, జులై 20 ప్రభాతవార్త:** ఇంగ్లాండులోని బర్మింగ్ హామ్ నగరంలో ఈ నెల 17 నుంచి జరుగుతున్న ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ (అండర్ 19) పోటీల్లో విజయనగరానికి చెందిన భట్రాజు సాయి నచికేత్ బంగారు పతకం సాధించాడు. ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయుడుగా చరిత్ర సృష్టించాడు. ఆరేళ్ల వయసు నుంచే బ్యాడ్మింటన్ ఆటపై ఆసక్తిని పెంచుకొని తొలి కోచ్ భాస్కర బాబు వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ప్రస్తుతం ప్రఖ్యాత చేతన ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేతన్ ఆనంద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి విజయనగరంలోని పిఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి చెందినవారు. తండ్రి ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. నచికేత్ ఇప్పటికే మలేషియా, ఇండోనేషియా, సైప్రస్, బంగ్లాదేశ్, స్వీడన్, బల్గేరియా దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు సాధించాడు. 2025 ఆగస్టులో శ్రీలంకలో జరిగిన శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో పాల్గొని తృతీయ బహుమతి సాధించాడు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో నచికేత్ ప్రస్తుతం 12వ ర్యాంకులో ఉన్నాడు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్‌లో 56వ ర్యాంకులో ఉన్నాడు. నచికేత్ సోదరుడు సాయి హృషికేత్ కూడా బ్యాడ్మింటన్ క్రీడాకారిడే. ఆయన కూడా చేతన్ ఆనంద్ అకాడమీ లోనే శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి సీనియర్ వాలీబాల్ క్రీడాకారిణి. ఆమె విజయనగరంలో వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆంధ్ర యూనివర్సిటీ మహిళా వాలీబాల్ టీంకు నాయకత్వం వహించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో పాల్గొని ప్రతిభ చూపించారు. నచికేత్ సాధించిన విజయం పట్ల వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరానికి చెందిన టివి భగవాన్ దాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, కెవిఎన్ రాజు(చిన్నారి) నచికేత్‌ను, తల్లి నాగమణిని అభినందించారు.

# విజయాలకు వేదికగా షైనింగ్ స్టార్స్

- విద్యా సంస్కరణలకు నిదర్శనం: మంత్రి అనగాని సత్యప్రసాద్ • 258 మంది విద్యార్థులకు రాష్ట్ర స్థాయి గౌరవం • ఒక్కొక్కరికి రూ.20 వేల ప్రోత్సాహకం



**తిరుపతి(విద్య), జులై 20 ప్రభాతవార్త:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్స్–2026 పురస్కారాలతో ఘనంగా సత్కరించింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం విద్యార్థుల విజయోత్సాహంతో పండుగ వాతావరణాన్ని తలపించింది. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రిజిస్ట్రేషన్- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, జ్ఞాపికలతో పాటు ఒక్కొక్కరికి రూ. 20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారానే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అవకాశాల కల్పన లక్ష్యంగా అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యా రంగానికి కొత్త ఊపునిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రతిభా పురస్కారాలు పరిమిత సంఖ్యలోనే అందించేవారని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం ద్వారా ప్రతిభకు తగిన గుర్తింపు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. మార్కులు మాత్రమే విజయానికి కొలమానం కాదని, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, సామాజిక బాధ్యత కూడా సమానంగా అవసరమని సూచించారు. విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా పెద్ద కలలు కని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్ఐఓ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలను అభినందించిన అతిథులు, వారు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

## విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

### అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి




**మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త:** విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్, రోడ్లు భవనాల మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా షైనింగ్ స్టార్స్–2026, మై స్కూల్–మైఫ్రెండ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిధులుగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో పోటీ తత్వాన్ని పెంపొందిచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాను విద్యా ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు. రాయలసీమలో జిల్లా ప్రథమ స్థానం, రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోరని వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన అందుకొన్న పురస్కారం జీవితాంతం గుర్తు ఉండేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఒక విద్యార్థి విజయం మరొకరికి స్ఫూర్తిగా మారాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీరింగ్, డాక్టర్లు కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తుని, విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు లబ్దిపొందుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే అన్నమయ్య జిల్లా భవిష్యత్తుకు బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ. 20వేలు ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 188మంది విద్యార్థులకు రూ. 37,60లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయడం సంతోషకరమన్నారు. తల్లికి వందనంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా నాణ్యమైనదిగా వడ్డించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సుబ్రమణ్యం, డైరెక్టర్ అనూరాధ, ఇంటర్ మీడియట్ జిల్లా అధికారి రవి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తిరుపతి పోలీస్ కమిషనరేట్ దిశగా వేగంగా అడుగులు!

- పుణ్యక్షేత్రం ప్రాధాన్యతతో భద్రత మరింత కట్టుదిట్టం

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన హిందువుల పుణ్యక్షేత్రం... యాత్రాస్థలం తిరుపతి నగరం త్వరలో పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా మార్పుకానుంది. ఇందుకోసం అవసరమైన కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర పోలీస్ బాస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్త నుండి నివేదికలు, ప్రతిపాదనలతో కూడిన డాటాను పంపాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రముఖ యాత్రాస్థలంగా కూడా ఖ్యాతిచెందిన తిరుపతి జిల్లాలో తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి ఇటీవల ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొత్త కమిషనరేట్‌గా మార్చాలని ప్రాథమిక ప్రక్రియలో పేర్కొంది. తిరుపతి జిల్లాలో ప్రధానంగా తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి కాళహస్తీశ్వర స్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, పెద్దపారిశ్రామికవాడ సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ ఉండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం, ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది. ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉన్న చిత్తూరు జిల్లాను పోలీస్‌శాఖాపరంగా విభజించి తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాగా 2010లో నెలకొల్పారు. అప్పటివరకు ఎస్పీతో నడిచిన పోలీస్‌శాఖ ఐపిఎస్ అధికారి హోదాలో ఎస్పీ క్రిందకు పోలీసుశాఖ తీసుకువచ్చారు. అప్పటి నుండి అర్బన్ జిల్లాకు బాలారిష్టాలు తప్పలేదు. కనీస మౌళిక వసతులు కూడా కరువయ్యాయి. ఆ తరువాత 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2022లో జిల్లాల పునర్విభజనలో పరిపాలన పరంగా చిత్తూరు జిల్లాను విడగొట్టి తిరుపతి జిల్లాగా ఏర్పాటుచేశారు. ఈ జిల్లాలో నెల్లూరు జిల్లా నుండి కొంతభాగం, రెవెన్యూ డివిజన్లను తిరుపతిలో కలిపారు. పరిపాలన పరంగా అస్తవ్యస్థ విభజనతో జనం ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తిరుపతి పోలీస్ జిల్లాతోనే పాలన సాగించారు. 2024లో రాష్ట్రంలో మళ్ళీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లా కూడా కావడంతో ఇక్కడ పరిపాలన పరంగా, పోలీస్ శాఖను మరింత బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయం నుండి కమిషనరేట్ దిశగా:** తిరుపతి జిల్లా ఏర్పాటైన తరువాత కూడా జిల్లాకు ప్రత్యేకంగా ఐపిఎస్ అధికారినే ఎస్పీ హోదాలో పాలన సాగిస్తున్నారు. పెరిగిన విస్తీర్ణం, కొత్తగా ఏర్పాటైన సబ్‌డివిజన్లు, పోలీస్ సర్కిళ్ళతో పరిపాలన మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో తిరుపతి నగరం జనాభా అనూహ్యంగా పెరిగింది. జనాభా 6లక్షల వరకు చేరగా ఓటర్లు 3లక్షల మంది ఉన్నారు. ఇదేగాక తిరుపతి నగరపాలక సంస్థ గ్రేటర్‌గా రూపుదిద్దుకోనున్న తరుణంలో పరిసరాల్లోని గ్రామాలు, కాలనీలు, పంచాయతీలు తిరుపతి గ్రేటర్ కార్పొరేషన్ క్రిందకు చేరనున్నాయి. దీంతో జనాభా కూడా మరింతగా అధికం కానుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాతోబాటు తిరుపతి మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తిరుపతిని పోలీస్



కమిషనరేట్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాను పూర్తి స్థాయి పోలీస్ కమిషనరేట్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు అవసరమైన కార్యాచరణ, ప్రతిపాదనలు, నూతన సబ్‌డివిజన్లు, నగరంలో ట్రాఫిక్, క్రైమ్, శాంతిభద్రతల విభాగాలకు ఎస్పీలు రానున్నారు. కమిషనరేట్‌కు ఐజి హోదాలో పోలీస్ కమిషనర్ నియామకం కానున్నారు. ఆయన నేతృత్వంలో ముగ్గురు నలుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు (ఎసిపిలు, డిసిపిలు)గా మారనున్నారు.

తిరుపతి అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రం కావడం, పర్యాటకుల రద్దీ పెరగడం, పెరుగుతున్న నేరాల నియంత్రణకు నగర స్థాయి పోలీసు వ్యవస్థ అవసరమని ప్రభుత్వం భావించింది ఇప్పటికే తిరుపతి నగరాన్ని పరిపాలన పరంగా రెండు ప్రధాన సబ్‌డివిజన్లుగా విభజించారు.

తిరుపతి సబ్‌డివిజన్ నగరం పరిధిలో తిరుపతి తూర్పు, అలిపిరి, తిరుపతి పడమర, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పోలీసు స్టేషన్లు, ట్రాఫిక్, క్రైమ్ సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇదేగాక చంద్రగిరి సబ్‌డివిజన్ కింద ఎం.ఆర్.పల్లి (తిరుపతి రూరల్), తిరుచానూరు, రామచంద్రాపురం, పాకాల, యర్రావారిపాలెం, భాకరాపేట, చంద్రగిరి పోలీసు స్టేషన్లు ఉన్నాయి. తిరుమల సబ్‌డివిజన్‌లో తిరుమల 1, 2 టౌన్, తిరుమల ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఇదేగాక రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు సబ్‌డివిజన్లు ఉన్నాయి. తిరుపతి నగరం కమిషనరేట్‌గా మారితే కొత్త పరిపాలనా జోన్లు, పోలీస్ సర్కిళ్ల విభజన కానుంది. కొత్తగా పాకాల, పూతలపట్టు వరకు కమిషనరేట్ క్రిందకు వచ్చే సూచనలున్నాయి. పోలీసు పునర్వ్యవస్థీకరణలో తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ చేయడానికి నగర విస్తరణ, జనాభా పెరుగుదల ఆధారంగా శాంతిభద్రతలను పర్యవేక్షి ంచడానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. త్వరలోనే కమిషనరేట్ క్రిందకు సరిహద్దులను ఖరారు చేయడం, ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించేందుకు పూర్తి స్థాయి రూపురేఖలు హద్దులకు సంబంధించిన జియోగ్రాఫికల్ నోటిఫికేషన్లు అధికారికంగా నివేదికలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

## మెట్ల పై నుండి పడి టెన్నీస్ కోచ్ మృతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర్ నగర్ లో సోమవారం మధ్యాహ్నం మెట్లపై నుండి జారిపడి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాళహస్తికి చెందిన భాస్కర్ (28) తిరుపతి లింగేశ్వర్‌నగర్ ఆంధ్ర బ్యాంకు కాలనీ లో టెన్నిస్ అసిస్టెంట్ కోచ్ గా ఉంటున్నాడు. సోమవారం లింగేశ్వర్ నగర్ లోని ఓ ఇంటిలో స్నేహితునితో కలిసి భాస్కర్ గదిలో ఉంటున్నాడు. స్నేహితుడు ఊరికి వెళ్లగా ఒంటరిగా ఉన్న భాస్కర్ మద్యం మత్తులో మొదటి అంతస్తు నుండి దిగుతూ బోర్లపడ్డాడు. భాస్కర్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీ కి తరలించారు. భాస్కర్ తల్లి ధనలక్ష్మి ి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య ఆచారి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No. 05/A-12024/1/2026-AC-II/2nd call Dt: 20/07/2026
E PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: APCRDA - "RFP for Selection of Agency for Providing Strategic Resource Augmentation and Knowledge Support Services to APCRDA on Requirement Basis".
The bid can be downloaded on AP e-procurement portal from 21.07.2026 to 29.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 29.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 29.07.2026 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Addl. Commissioner, APCRDA, Amaravati

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ● కేంద్ర మంత్రి లాలన్ సింగ్‌తో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ



**శ్రీకాకుళం, జులై 20 ప్రభాతవార్త:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, వీరాంజనేయ స్వామి, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజుతో కూడిన ప్రతినిధి బృందం కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి లాలన్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎన్డీఏ ఎంపీలతో కలిసి ఫిష్ ఫీడ్ ధరలు గణనీయంగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫీడ్ ధరలను నియంత్రించడంతో పాటు మత్స్యకారులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.

ప్రతినిధి బృందం విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి లాలన్ సింగ్, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులపై ఫీడ్ వ్యయ భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతతో చేపల ఉత్పత్తులు ఎగుమతి చేస్తూ రాష్ట్రానికీ, దేశానికీ కీర్తి తీసుకొస్తున్న మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి లాలన్ సింగ్‌కు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు భాష, సంస్కృతి వైభవానికి 2 ప్రతిష్టాత్మక ఉత్సవాలు

## ● 25-26న ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం ● ఆగస్టు 8-9న అమరావతి చిత్రకళా వీధి

## ● కళాకారులు, రచయితలు భాగస్వాములు కావాలి: రాష్ట్ర సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్



**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య, సంగీత కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జూలై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవంను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో సూర్యోదయ సుప్రభాతం, సంగీత కార్యక్రమం, ఆమె మాట – అక్షర బాట, కవి సమ్మేళనాలు, అమ్మమ్మ కథల ముచ్చట్లు నెక్స్ట్ జెన్ తెలుగు యువతతో చర్చలు, నవస్వరం ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో అమరావతి చిత్రకళా వీధి పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి 800స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. జూలై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.

# ప్రైవేటు పారిశ్రామికవాడలలో బలహీనవర్గాలకు భాగస్వామ్యం కల్పించాలి

## రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల్లో బిజెపి వినతిపత్రాల సమర్పణ

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావడం స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, ఆ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరేలా ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వం ఇటీవల ఎనిమిది ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు 4,196.55 ఎకరాల భూమిని కేటాయించడం, సుమారు ..1,720.88 కోట్ల పెట్టుబడులతో 1.72 లక్షలకుపైగా ఉపాధి అవకాశాలు కల్పించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పి.వి.ఎన్ మాధవ్ పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం ఇప్పటికే ఉన్న భూములకు అదనంగా మరింత భూసేకరణ చేపట్టాలనే ప్రభుత్వ ఆలోచన కూడా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.ప్రభుత్వం కేటాయిస్తున్న భూములు ప్రజల ఆస్తి కాబట్టి, ఆ భూములపై ఏర్పడే పరిశ్రమల ద్వారా కలిగే ప్రయోజనాలు కూడా అన్ని వర్గాలకు సమానంగా అందేలా ప్రత్యేక విధానాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బి.సి., ఎస్సీ, ఎస్టీ వర్గాలు పారిశ్రామిక యాజమాన్యం, పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనలో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మూలధనం కొరత, బ్యాంకు రుణాల లభ్యతలో సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం, భూమి, మార్కెట్ అవకాశాల కొరత వంటి కారణాల వల్ల ఈ వర్గాలు పారిశ్రామిక రంగంలో వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్టాండ్‌అప్ ఇండియా, పి.ఎం.ఇ.జి.పి., ఎం.ఎస్.ఎం.ఇ ప్రోత్సాహకాలు, మూలధన సబ్సిడీలు, వడ్డీ రాయితీలు, ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వంటి పథకాలను మరింత సమర్థంగా అనుసంధానిస్తూ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో సామాజిక భాగస్వామ్యానికి స్పష్టమైన విధానాలు తీసుకురావాలని కోరారు.ప్రతి ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులో బి.సి., ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు,షెడ్లు కేటాయించే ప్రత్యేక విధానం రూపొందించాలని,ప్రభుత్వ రాయితీలు పొందే పార్కులు సామాజిక భాగస్వామ్య లక్ష్యాలు సాధించినప్పుడే పూర్తి ప్రోత్సాహకాలు అందేలా ఒప్పందాల్లో నిబంధనలు చేర్చాలని సూచించారు.

# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త లక్ష్యం

## ● మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా: మంత్రి నారాయణ



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 20 ప్రభాతవార్త:** ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక మహిళా పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి చంద్ర బాబు లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారా యణ అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మెప్మా అధికారు లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు), మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మెప్మా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల పురోగతి, లావాదేవీలపై ఆరా తీశారు. జీవనోపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు పలు సూచనలు చేశారు. పట్టణ పేదరిక నిర్మూ లనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, లైవ్లీహుడ్ యూనిట్ల ద్వారా మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వ్యాపారాల్లో మహిళలపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పాచిపని చేసుకునే మహిళ కూడా నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగి కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తోందని పేర్కొంటూ, మెప్మా మహిళలందరూ అలాంటి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారాల్లో రాజకీయాలను చొప్పించవద్దని, రిసోర్స్ పర్సన్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని సూచించారు. చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. మెప్మా మహిళల్లో అత్యధికులు నిరుపేదలేనని, వారి కష్టాలు తనకు తెలుసని, వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూనే ఉంటానన్నారు. వారి పిల్లలకు విద్యనే నిజమైన ఆస్తిగా అందించాలనే ఉద్దేశంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10 వేల సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మెప్మా ఏఎండి వెంకటేశ్వర్లు, పీడీ కిరణ్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు కాలువకు 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలి : ప్రభుత్వ విప్



నీటిపారుదల సలహామండలి సమావేశంలో కలెక్టర్ బాలాజీ, ప్రజాప్రతినిధులు

**గన్నవరం(కృష్ణా), జులై 20 ప్రభాతవార్త:** ప్రస్తుత తీవ్రవర్షాభావ పరిస్థితుల్లో ఏలూరు కాలువ ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోతున్నందున కాలువకు పూర్తిసామర్థ్యంతో నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధికారులను కోరారు. కృష్ణాజిల్లా నీటిపారుదల సలహామండలి సమావేశం సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకలెక్టర్ డి.కె.బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో పాల్గొన్న యార్లగడ్డ మాట్లాడుతూ ఏలూరు కాలువ ఆయకట్టులో సింహభాగం గన్నవరం నియోజకవర్గంలోనే ఉందని, ప్రస్తుతం నారుమళ్ళు, నాటిన వరిపైరు నీరులేక ఎండిపోతున్న సంగతిని సమావేశం దృష్టికి తెచ్చారు. ఏలూరు కాలువలో 1650 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు వీలుగా కాలువ నిర్మాణం జరిగిందని, ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయటం వల్ల పంటకాలువలకు నీరు అందటంలేదన్నారు. గరిష్ట సామర్థ్యంతో నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. ఒక్క గన్నవరం నియోజకవర్గంలోనే కాకుండా కాలువ చివరి ప్రాంతాలైన ఏలూరు జిల్లాలోని పెదపాడు, ఏలూరు మండలాల్లో సైతం పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని యార్లగడ్డ ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణం ఏలూరు కాలువకు కనీసం 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు వినియోగించుకోండి: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్



పదిలో మెరిసిన విద్యార్థినికి షైనింగ్‌స్టార్ పురస్కారం అందిస్తున్న అతిథులు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త:** విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, విద్యార్ధులకు పలు ప్రోత్సాహకాలు అందిసు ందని ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్ధులు సది ్వనియోగం చేసుకుని రాణించాలని ఎన్‌టిఆర్ కలెక్టర డాక్టర్ లక్ష్మీ ్మశా పిలుపునిచ్చారు. జిల్లాలో 10 వతరగతి, ఇంటర్‌మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్ధినీవిద్యార్ధులను సోమవారం విజయవాడ మారిస్‌స్టెల్లా కళాశాల ఆవరణలో జరిగిన ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో సత్కరించారు. ఈసందర్భంగా 10వతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 135 మందిని, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన 40 మంది, విద్యార్ధులు రూ.20వేల నగదు బహుమతి, పతకం, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం, అభివృద్ధి కారో ్పరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్, జిల్లాగ్రంధాలయ సంస్థ చైర్మన్ యం.యస్.బేగ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

**పిజిఆర్‌ఎస్‌లో అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి:** ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండి వస్తున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. సోమవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# నేనున్నాంటూ.. బాధితులకు మంత్రి నారాయణ భరోసా

## ● యనమలవారి వీధిలో కూలిన పాత ఇంటి స్లాబు ● ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసిన రెస్క్యూ బృందం ● ఘటనాస్థలాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ



**నెల్లూరు(వైద్యం), జులై 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 ఏళ్ల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, కోక్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు, రేవతి, ముజీబ్, గౌస్, మస్తానమ్మ, షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో ఎపి గణనీయ వృద్ధి

## ● విశాఖలో ఆదాయపు పన్ను శాఖకు నూతన క్వార్టర్లు

## ● ఆదాయపు పన్ను శాఖ (ఎపి అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని



**విశాఖపట్నం, జులై 20 ప్రభాతవార్త:** విశాఖపట్నం ఎండాడ, సాగర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన "సాగర్ సమీరం" ఆదాయపు పన్ను శాఖ నివాస సముదాయాన్ని సోమవారం ఆదాయపు పన్ను శాఖ (ఏపీ అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని ప్రారంభించారు. ఈ నివాస సముదాయంలో 5 టైప్5, 8 టైప్4 క్వార్టర్లను ఉద్యోగుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా, హైదరాబాద్ చీఫ్ కమిషనర్ సునీత బిల్లా, విశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బొట్ట శ్రీనివాస్, కమిషనర్ సరీష్ ఇరుకుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎప్పుడూ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విశాఖలో ప్రారంభమైన ఈ నూతన క్వార్టర్లు ఉద్యోగుల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని చెప్పారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోందని వెల్లడించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 28.70 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండగా, రిటర్నుల సంఖ్య 26.98 లక్షలకు చేరిందని తెలిపారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లలోనూ రాష్ట్రం గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. 202627 ఆర్థిక సంవత్సరంలో జూలై 17 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,043.54 కోట్ల స్థూల పన్ను వసూళ్లు, రూ.6,607.53 కోట్ల నికర పన్ను వసూళ్లు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే 17 శాతం వృద్ధి సాధించినట్లు వివరించారు. కార్పొరేట్ పన్ను, ఆదాయపు పన్ను వసూళ్లలోనూ రాష్ట్రం స్థిరమైన పురోగతిని కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు పన్ను సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఆదాయపు పన్ను శాఖ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# నెల్లూరు సంతపేటలో ప్రమాదం

## ● పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతో తప్పిన ప్రమాదం

**నెల్లూరు(క్రైమ్), జులై 20 ప్రభాతవార్త:** సంతపేటలోని యనమలవారివీధిలో సోమవారం పెనుప్రమాదం తప్పింది. రెండంతస్తుల భవనం మొదటి అంతస్థు వరండా శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోవడంతో, కింది భాగంలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు శిథిలాల మధ్య చిక్కుకున్నారు. అయితే, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తక్షణమే స్పందించి సాహసోపేతంగా వారిని ప్రాణాలతో కాపాడారు. యనమలవారివీధిలోని ఒక రెండంతస్తుల భవనంలో మొత్తం నాలుగు కుటుంబాలు (మొదటి అంతస్థులో రెండు, కింది అంతస్థులో రెండు) నివాసం ఉంటున్నాయి. కింది పోర్షన్‌లో కరిముల్లా, రేష్మ దంపతులు తమ ముగ్గురు కుమార్తెలతో కలిసి జీవిస్తున్నారు. సోమవారం ఉదయం పెద్ద కుమార్తె ఉద్యోగానికి, రెండో కుమార్తె పాఠశాలకు వెళ్లగా దంపతులు తమ చిన్న కుమార్తెతో కలిసి ఇంట్లోనే ఉన్నారు. ఈ క్రమంలో మొదటి అంతస్థు వరండా శ్లాబ్ పెను శబ్దంతో కూలిపోయింది. ఈ ప్రమాదంలో కరిముల్లా దంపతులు, వారి చిన్న కుమార్తె శిథిలాల కింద చిక్కుకుపోయారు.

**సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్:** స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భవనం ముందు నుంచి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో, సిబ్బంది వెనుకవైపు ఉన్న కిటికీని తొలగించి అత్యంత సాహసంతో శిథిలాల మధ్య చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు వెలికి తీశారు. సమయానికి తగినట్లుగా స్పందించి ప్రాణాపాయం తప్పించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

**అధికారుల పరిశీలన:** ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఏఎస్పీ సిహెచ్ సౌజన్య సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. క్షతగాత్రులకు అందిన సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ రక్షణ ఆపరేషన్‌లో సంతపేట



ఇన్‌స్పెక్టర్ వై.వి. సోమయ్య, ఏడిఎఫ్ఓ రాజా, ఎస్ఐ బాలకృష్ణ సిబ్బంది అత్యంత చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. ప్రమాదకరంగా మారిన శిథిలావస్థ భవనాలపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళపై అత్యాచార యత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలకు కఠినకారాగార శిక్ష

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు చిత్తూరు 6వ అదనపు జిల్లా జడ్జి 3 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార శిక్షతో బాటు ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. తిరుపతి పట్టణం ఎర్రమిట్ట ప్రాంతానికి చెందిన ఆర్. రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె కుమార్తె భవాని (24)పై 2017 మేనెలలో సాయంత్రం సమయంలో తిరుపతిలోని రుయా ఆసుపత్రి నుండి ఇస్కాన్ టెంపుల్ వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. కత్తితో బెదిరించి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇనుప రాడ్‌తో దాడి చేసి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు యత్నించినట్లు ఫిర్యాదు నమోదైంది. అప్పటి అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. అనంతరం ఈ కేసు 348/2017గా చిత్తూరు 6వఅదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. నిందితులు శివజ్యోతి నగర్ అయ్యప్ప కాలనీకి చెందిన ఏ. వెంకటేష్ అనే కుక్కలోడు (31), తిరుపతి కేటీ రోడ్డు సూరయ్యకట్టకు చెందిన టీ. శశికుమార్ అనే కుమార్ రాజా (40) పై నేరం రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో ఇద్దరు నిందితులకు 3 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు వారాల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.




# డిజిపి ఆనంద్‌తో క్రికెటర్ సిరాజుద్దీన్ భేటీ

## డిజిపికి జెర్సీ బహూకరించిన మియాభాయ్

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** టీమిండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజుద్దీన్ సోమవారం డిజిపి సి.వి. ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీసు శాఖలో డిఎస్‌పిగా పనిచేస్తున్న సిరాజుద్దీన్ టీమిండియాలో తన పేరిట వున్న జెర్సీని ఈ సందర్భంగా డిజిపి ఆనంద్‌కు బహుకరించారు. టీమిండియాలో సిరాజుద్దీన్ మరింత ఉన్నతంగా రాణించాలని డిజిపి ఆశాభావం వ్యక్తం చేయ డంతో పాటు సిరాజుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో పోలీసు క్రీడలు, పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్, డిఎస్‌పి రమణరావు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయి పనిలేదు.. సగం జీతమే ఇవ్వండి!

## విధుల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంది.. యుపి ప్రభుత్వానికి ఓ ఐఎఎస్ లేఖ



**జలౌన్(యుపి), జులై 20:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ యువ ఐఎఎస్ అధికారి రాసిన లేఖ తీవ్రచర్చకు దారి తీసింది. తనకు పూర్తిస్థాయిలో పని లేక పోవడంతో సగం జీతమే చెల్లించాలని, లేదంటే నిబంధనల ప్రకారం పనిచేసే అవకాశమున్న చోటుకు బదలీ చేయాలని కోరుతూ రాష్ట్ర నియామక, సిబ్బంది శాఖకు ఐదు పేజీల లేఖ పంపారు. ప్రస్తుతం ఎస్‌డీఎం (జ్యుడీషియల్)గా పని చేస్తున్న 2023 బ్యాచ్ ఐఎఎస్ అధికారి రింకూసింగ్ రాహీ ఈ విజ్ఞప్తి చేశారు. ఇపుడు తన బాధ్య తల్లో రోజుకు నాలుగు గంటల పనిమాత్రమే ఉంటోందని రాహీ లేఖలో పేర్కొన్నారు. అందుకే ఈ పోస్టులోనే కొనసాగిస్తే సగం జీతం చెల్లించినా అభ్యంతరం లేదని తెలిపారు. అదే సమయంలో పరిపాలనా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని ఆరోపిస్తూ మంత్రి స్వతంత్రదేవ్‌సింగ్, బీజేపీ ఎమ్మెల్యే గౌరీశంకర్‌వర్మ పేర్లను కూడా ప్రస్తావించారు. జలౌన్‌లో ఎస్‌డీఎంగా పనిచేసే సమయంలో అక్రమ భూకబ్జాలు, ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాల్లో చర్యలు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ తనకు ఆదేశించారని రాహీ ఆరోపించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గౌరీ శంకర్‌వర్మ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన జనతా దర్శన్ కార్యక్రమం కేవలం పేరుకే జరుగు తోందని, మూల సమస్యలను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందని విమర్శించారు. నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా పని చేసే అవకాశం ఉన్న మరో తహసీల్‌కు లేదా మరో జిల్లాకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని రాహీ కోరారు. అది సాధ్యం కాకపోతే మరో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై పంపాలని కూడా విజ్ఞప్తి చేశారు.

21-7Pg5exN.qxd:21-7Pg5exN.qxd 1/1/02 6:47 AM Page 1



# సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి



## ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచించిన సుప్రీంకోర్టు

## రామమందిర విరాళాల వివాదం

**న్యూఢిల్లీ, జులై 20:** శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందిన విరాళాలు, కానుకల నిర్వహణలో జరిగినట్లు ఆరోపించబడిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను పునర్వ్యవస్థీకరించడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ దర్యాప్తునకు ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వం వహించాలని, దానిని 'తార్కిక ముగింపు'కు తీసుకువెళ్లాలని కూడా పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని హెచ్చరించింది. ఒక నేరం జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు, దానిపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడటమే న్యాయస్థానాల బాధ్యత అని వ్యాఖ్యానించింది.

విచారణ సందర్భంగా, కేంద్రం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఒక సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలియజేశారు. 'దర్యాప్తు కొనసాగుతోంది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ దశలో ఎక్కువ వివరాలు వెల్లడించలేం' అని ఎస్‌జి మెహతా తెలిపారు.

దర్యాప్తు బృందం కూర్పు వివరాలను సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కోరగా, ఆరోపణల వాస్తవికతను నిర్ధారించడానికి మాత్రమే గతంలో సిట్‌ను ఏర్పాటు చేశారని, అదే స్వయంగా నేర దర్యాప్తు చేపట్టడం లేదని ఎస్జి మెహతా స్పష్టం చేశారు. 'ఇప్పుడు ఎవరు దర్యాప్తు చేస్తున్నారు? దర్యాప్తు అధికారులు ఎవరు?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో సంబంధిత పోలీసు అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారని ఎస్జి మెహతా తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సిట్‌లో ఇద్దరు ఐఏఎస్ అధికారులు, ఒక సీనియర్ ఐపి ఎస్ అధికారితో సహా సీనియర్ అధికారులు ఉన్నారని సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కొనసాగుతున్న దర్యాప్తును, ఈ విషయంపై ఇప్పటికే అవగాహన ఉన్న ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో పునర్వ్యవస్థీకరించిన సిట్‌కు అప్పగించాలని సూచించింది. 'కొనసాగుతున్న దర్యాప్తు కోసం ఒక సిట్‌ను ఏర్పాటు చేయండి. ఈ అధికారికి ఈ విషయంపై అవగాహన ఉండి ఉంటే, ఆయనే దానికి నేతృత్వం వహించవచ్చు. ప్రభుత్వంతో మాట్లాడి, సిట్ ను పునర్వ్యవస్థీకరించండి. ఏవైనా అదనపు ఆదేశాలు అవసరమైతే, తాము వాటిని జారీ చేస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. సిట్ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై స్టేటస్ రిపోర్ట్, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను పరిశీలించిన తర్వాత, వచ్చే సోమవారం ఈ విషయాన్ని మళ్లీ విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు సూచించింది. 'తాము కేవలం హెచ్చరిస్తున్నాము, ఈవిషయాన్ని రాజకీయం చేయవద్దు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగి, తార్కిక ముగింపునకు చేరాల్సిఅని సీజేఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, 'కోర్టులు రాజకీయాలకు వేదిక కాద్దు' అని కూడా పేర్కొంది.

# భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు



## అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, జులై 20:** అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ 'అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హార్ముజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్య ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తోపాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, దాన్ని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదు' అని తెలిపారు. ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్న ప్పటికీ దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచు కోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.

**చుక్క చమురు కూడా హార్ముజ్ దాటదు: ఇరాన్**

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ హెచ్చరికలను ఖాతరు చేయకుండా హార్ముజ్ మీదుగా వెళ్తోన్న రెండు నౌకలను ఐఆర్‌జిసి టార్గెట్ చేసింది. వాటిలో పేలుడు సంభవించిందని, అవి కదల్లేని స్థితిలో ఉన్నాయని వెల్లడించింది. అమెరికా దురాక్రమణ కొనసాగుతున్నంతకాలం ఒక్క చుక్క చమురు కూడా సురక్షితంగా హార్ముజ్‌ను దాటదని ఐఆర్‌జిసి హెచ్చరించింది. ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉండాలని



అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సోమవారం తెల్లవారుజామున అగ్రరాజ్యం మరోసారి దాడులు చేపట్టింది. తమ సైనికుల మరణాలకు ప్రతీకారం తీర్చుకున్నామని, శక్తిమంతమైన దాడులు చేశామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం మొదలైన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు అమెరికాకు ప్రాణనష్టం 17కు పెరిగింది. ఇదిలా ఉండగా పశ్చిమాసియా దద్దరిల్లుతుండటంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరింది.

**కువైట్ ప్లాంట్స్‌లో చెలరేగిన మంటలు..**

అమెరికా-ఇరాన్ ఘర్షణలతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కువైట్‌లోని అల్ సుబియా పవర్ జనరేషన్, వాటర్ డీసాలినేషన్ ప్లాంట్‌పై టెహ్రాన్ దాడులు చేసింది. దాంతో భారీగా మంటలు చెలరేగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు వెరల్ అవుతున్నాయి.

# హైకోర్టు జడ్జిలకు ఒకే విధానం

## అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయండి

## 3 నెలల్లోగా సిఫారసుల నివేదికివ్వండి

## కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 20:** దేశంలోని పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు సౌకర్యాల కల్పనలో ఏకరూప విధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు లభించే భద్రత, ఇతర పదవీ విరమణానంతర సౌకర్యాలకు సంబంధించి పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. తమ ముందు లేవనెత్తిన ఆందోళనలను విన్న సిజెఐ, 'రాష్ట్రానికి రాష్ట్రానికి ఇటువంటి సౌకర్యాలు మారడానికి ఎటువంటి కారణం లేదుకాబట్టి, ఈ సౌకర్యాలను ఏకరూప ప్రాతిపదికన నిర్ధారించాలనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ దృక్కోణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏకరూప మార్గదర్శకాలను, అలాగే ఆర్థిక సహాయం అందించే విధానం, యంత్రాంగాన్ని నిర్దేశించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తాము భారత కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము' అని అన్నారు. దీని ప్రకారం, ఏర్పాటు చేసిన కమిటీ, అది ఏర్పడిన తేదీ నుండి మూడు నెలలలోపు తన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, అలాగే వాటిని కోర్టు ముందు కూడా ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది.

# 'అపార్ట్ ఐడి నిర్బంధం కాదు, ఐచ్ఛికమే!

## డేటా రక్షణ ఆందోళనలు పరిశీలించాలి

## సిబిఎస్ఇకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జులై 20:** 'అపార్ట్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడిల జారీ కోసం ఇచ్చే సమ్మతి పత్రంలో స్పష్టమైన "ఆప్ట్ అవుట్" ఎంపికను తప్పనిసరి చేస్తూ ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఎపిఎఎఆర్ (అపార్) పథకం స్వచ్ఛందంగా ఉండేలా, తల్లిదండ్రుల సమ్మతి పత్రాలలో సమ్మతిని నిరాకరించడానికి స్పష్టమైన అవకాశం ఉండేలా తగిన ఆదేశాలు జారీ చేస్తామని సూచించింది. 'ఒడిశా హైకోర్టు ఉత్తర్వును అంగీకరించినందున... ఈ తీర్పును పాన్‌ఇండియా ప్రాతిపదికన అమలు చేయాలి. ఈ సమస్యలను కూడా పరిశీలించాలని తాము సిబిఎస్ఇని ఆదేశిస్తున్నాము," అని విచారణ సందర్భంగా సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిబిఎస్ఇ సర్క్యులర్లు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం, 2023తో సహా అమలులో ఉన్న చట్టానికి లోబడి ఉంటాయని, ఈ పథకాన్ని ప్రస్తుత చట్టపరమైన చట్రానికి అనుగుణంగా అమలు చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'అపార్ట్ ఐడి పథకం రాజ్యాంగ బద్ధతను, బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం 'అపార్ట్ ఐడిలను తప్పనిసరి చేయాలన్న సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపి ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

# 400 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్

**క్కీవ్,జులై 20:** రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రతికార దాడులను తీవ్రతరం చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున ఒకేసారి 400 కంటే ఎక్కువ డ్రోన్లతో మాస్కోపై విరుచుకుపడింది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు ఇతర నగరాలపై రష్యా జరిపిన తీవ్ర బాలిస్టిక్ క్షిపణి దాడులకు నిరసనగా ఉక్రెయిన్ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ మీడియా స్పష్టం చేసింది. మాస్కో దిశగా వచ్చిన అత్యధిక డ్రోన్లను రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. మాస్కో పరిసరాల్లో దాదాపు 85 డ్రోన్లను అడ్డుకున్నట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. మాస్కో పరిసర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 10 మంది గాయపడినట్లు



సమాచారం. పడోల్స్క్‌లోని ఒక ఆయిల్ డిపోతో పాటు, మాస్కో సమీపంలోని యుజ్నే వ్రాతా ఇండస్ట్రియల్ పార్క్‌లో తీవ్ర అగ్నిప్రమాదాలు సంభవించాయి. పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ వైమానిక రక్షణ లోపాలను అనుకూలంగా మార్చుకునేందుకు రష్యా ఇటీవల బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాన్ని గణనీయంగా పెంచింది. ఆదివారం రష్యా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌లో ఆరుగురు ప్రాణా లు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడినట్లు తెలిసింది.

# హిందూ వివాహం ఒక ఒప్పందం కాదు

## భార్యపై ఆసక్తి పోయిందంటే కుదరదు: కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

## విడాకుల అభ్యర్థనను కొట్టివేసిన కోర్టు



**బెంగళూరు, జులై 20:** కేవలం తన జీవిత భాగస్వామిపై ఆసక్తి పోయిందన్న కారణంతో ఒక వ్యక్తి వివాహబంధం నుండి వైదొలగడం లేదా విడాకులు కోరడం కుదరదని కర్ణాటక హైకోర్టు విస్పష్ట తీర్పునిచ్చింది. న్యాయమూర్తులు డి.కె.సింగ్, టి.ఎం.నాదాఫ్‌లతో కూడిన ధర్మాసనం, హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం అని, అది కేవలం ఒక ఒప్పందం కాదని నొక్కి చెప్పింది.కాబట్టి, వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం కొనసాగుతుందని పేర్కొంది. 'హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం, అది ఒప్పందం కాదు. వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం ఉంటుంది. అవతలి వ్యక్తిపై ఆసక్తి లేదన్న కారణంతో ఎవరూ ఆ వివాహ బంధం నుండి వైదొలగలేర్ను అని ధర్మాసనం తీర్పునిచ్చింది. హిందూ వివాహ చట్టం, 1955లోని సెక్షన్ 13(1ఎ) కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసే క్రమంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు దాదాపు వయోజనురాలైన కుమార్తెకు తండ్రి అయిన భర్త, కేవలం వివాహంపై ఆసక్తి కోల్పోయానని చెబుతూ కోర్టును ఆశ్రయించడం ద్వారా తన తప్పును తానే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని హైకోర్టు గమనించింది. హిందూ చట్టం ప్రకారం వివాహం ఒక సంస్కారం, ఒప్పందం కాదని, ఆసక్తి లేదనే కారణంతో ఒక పక్షం దాని నుండి వైదొలగలేదని కోర్టు పునరుద్ఘాటించింది. అందువల్ల, ఫ్యామిలీ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించక పోవడంతో, అప్పీల్‌ను కొట్టివేసింది.

# సుప్రీం జడ్జిల పెంపు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 20:** సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచు కోవచ్చు. దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురా వాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది.

# చర్చలు అర్థవంతంగా, వాస్తవాల ఆధారంగా సాగాలి

## పార్లమెంటు సమావేశాల సందర్భంగా విపక్షాలకు మోడీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,జులై 20:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా సాగాలని అన్నారు. వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదు. వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదని ప్రధాని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ రుతుపవనాలు ఎంత ముఖ్యమో, వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రుతుపవనాలు చురుకుగా ఉండి రైతులకు మేలు చేయడంతో పాటు, పార్లమెంట్ సమావేశాలు కూడా సజావుగా జరిగి దేశ ప్రయోజనాలకు దోహదపడాలని కోరుకున్నారు. దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రధాని వివరించారు. ఇటీవల రాజస్థాన్లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్తో నడిచే రైలు ప్రారంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. ప్రపంచంలో కొద్ది దేశాలకు మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇప్పుడు భారత్లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు ప్రధాని మోడీ. గత నెలలో భారత్ సాధించిన పలు విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇటీవల ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిని చేరుకోవడం దేశానికి గర్వకారణమని అన్నారు. గత ఏడాది భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండగా, ఇప్పుడు భారత యువత అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇది యువత సామర్థ్యం, ఆశయాలు అపరిమితమని



ప్రపంచానికి చాటి చెబుతోందని అన్నారు మోడీ. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజుల వ్యవధిలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో మొత్తం 19 సమావేశాలు జరగనున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, సంప్రదింపులు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు ప్రధాని నరేంద్ర మోడీ.

# హమాస్ కొత్త అధినేతగా ఖలీల్ అల్‌హయ్యా



**గాజాసిటీ,జులై 20:** తీవ్రవాద సంస్థ హమాస్‌కు కొత్త నాయకుడు ఎన్నిక య్యారు. ఖలీల్ అల్-హ య్యాను తమ అధిపతిగా ఎన్నుకున్నట్లు హమాస్ ప్రకటించింది. గతంలో గాజాలోని హమాస్ రాజకీయ విభాగానికి నాయకత్వం వహించిన అల్‌హయ్యా ఇప్పుడు సంస్థకు అత్యున్నత స్థాయి నాయకుడిగా బాధ్యతలు చేపట్టను న్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ దాడి అనంతరం ప్రారంభమైన యుద్ధంలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించిన చర్చల్లో ఖలీల్ అల్‌హయ్యా కీలక పాత్ర పోషించారు. హమాస్ ప్రధాన సంధానకర్తగా కూడా ఆయన వ్యవహ రించారు. హమాస్ మాజీ నాయకులు యహ్యా సిన్వార్, ఇస్మాయిల్ హనియే మరణాల తర్వాత గత రెండేళ్లుగా ఐదుగురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి సంస్థను నడిపించింది. తాజాగా జరిగిన అంతర్గత ఎన్నికల్లో అల్‌హయ్యా కొత్త నాయకుడిగా ఎంపికయ్యారు. గాజా స్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ అల్‌హయ్యా తన జీవితంలో ఎక్కువ భాగాన్ని అక్కడే గడిపారు. 2023 అక్టోబర్ దాడులకు కొద్దికాలం ముందు గాజా నుంచి ఖతార్‌కు వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ



**న్యూఢిల్లీ,జులై 20:** వర్షాకాలం ప్రారంభమైతే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు వేగంగా పెరుగుతుంటాయి. ప్రతి ఏడాది వేలాది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో భారతదేశానికి ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో తొలిసారిగా డెంగ్యూ నివారణ కోసం క్యూడెంగా వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఈ వ్యాక్సిన్ ప్రత్యేకత ఏమిటంటే, టీకా తీసుకునే ముందు డెంగ్యూ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో డెంగ్యూ వచ్చినవారు అయినా, ఎప్పుడూ డెంగ్యూ రాకపోయినా ఈ టీకాను తీసుకోవచ్చు. దీంతో డెంగ్యూ నివారణలో ఇది ఒక కీలక ముందడుగుగా వైద్య నిపుణులు భావిస్తున్నారు. క్యూడెంగా వ్యాక్సిన్‌ను రెండు డోసులుగా ఇస్తారు. మొదటి డోస్ తీసుకున్న మూడు నెలల తర్వాత రెండో డోస్ వేయించుకోవాలి.

ఈ టీకాను చర్మం కింద (సబ్‌క్యూటేనియస్) ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకేడా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 4 నుంచి 60 సంవత్స రాల వయస్సు గల వారికి వినియోగించేందుకు అనుమతించారు. ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యే దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ డెంగ్యూ భారంలో దాదాపు మూడింట ఒక వంతు కేసులు భారతదేశంలోనే నమోదవుతున్నట్లు అంచనా. గత రెండు దశాబ్దాల్లో దేశంలో డెంగ్యూ కేసులు దాదాపు 11 రెట్లు పెరిగినట్లు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత ఏడాదిలోనే లక్షకు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే అసలు సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా. డెంగ్యూ వైరస్‌కు నాలుగు రకాల (సెరోటైప్స్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేలా క్యూడెంగాను రూపొందించారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ వ్యాక్సిన్‌పై 28 వేల మందికి పైగా క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. రెండో డోస్ తర్వాత 12 నెలలకు డెంగ్యూ నివారణలో 80.2 శాతం ప్రభావవంతంగా, డెంగ్యూ కారణంగా ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని 90.4 శాతం వరకు తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేసిందని అధ్యయనాలు సూచించాయి. దీర్ఘకాలిక పరిశోధనల్లో కూడా 4.5 సంవత్సరాల తర్వాత ఆసుపత్రి చికిత్స అవసరాన్ని 84.1 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు.

ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సిఫార్సు చేసింది. నాణ్యత, భద్రత, ప్రభావం వంటి అంతర్జాతీయ ప్రమాణాలను ఇది అందుకుందని డబ్ల్యుహెచ్ఓ ప్రీక్వాలిఫికేషన్ కూడా పొందింది. ప్రస్తుతం భారత్‌తో పాటు 43 దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 3.2 కోట్లకు పైగా డోసులు పంపిణీ అయ్యాయి. బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియా వంటి దేశాల్లో ప్రజారోగ్య టీకా కార్యక్రమాల్లో దీనిని వినియోగిస్తున్నారు.

# సంక్షిప్త వార్తలు

## ఎబోలా వైరస్: కాంగోలో 930కి పెరిగిన మృతుల సంఖ్య




**బునియా, జులై 20:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మే15నుంచి శనివారంనాటికి దేశ వ్యాప్తంగా 2,344 కేసులు నమోదు కాగా దాదాపు 930 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటల వ్యవధిలో 37మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే. ఈ తరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేవు.

## నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన ఉషావాన్స్



**వాషింగ్టన్, జులై 20:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ శుభవార్త పంచుకున్నారు. ఆయన సతీమణి ఉషావాన్స్ ఆదివారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. అతనికి అలెక్ నీల్ వాన్స్ అని పేరు పెట్టామని చెప్పారు. తల్లి, బిడ్డఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారంటూ జెడి వాన్స్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ ముగ్గురు పిల్లలు తమ్ముడిని చూసి సంతోషిస్తున్నారని తెలిపారు. 2014లో ఉష, జెడివాన్స్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు కుమారులు ఇవాన్(9),వివేక్(6), కుమార్తె మిరాబెల్ (4)ఉన్నారు. ఇప్పుడు నాలుగో సంతానానికి జన్మనిచ్చారు. ఉషావాన్స్ తెలుగు మూలాలున్న వ్యక్తి అన్న సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే తమ చిన్న కుమారుడి పేరులో 'నీల్' అని చేర్చడం ఆసక్తికరంగా మారింది.

## భారీ వర్షాలతో చార్‌ధామ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్



**డెహ్రాడూన్,జులై 20:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతా వరణశాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రను సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు. కుండపోత వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గఢ్వాల్ కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం యాత్ర మార్గంలో ఉన్న భక్తులను సురక్షిత ప్రాంతాల్లో వసతి కల్పించాలని, రహదారులు పూర్తిగా సురక్షితమని అధికారులు ప్రకటించిన తర్వాతే యాత్రను తిరిగి కొనసాగించేందుకు అనుమతించాలని సూచించారు.

## అయోధ్య కానుకల లెక్కింపునకు ఎస్‌బిఐ పర్యవేక్షణ



**న్యూఢిల్లీ, జులై 20:** అయోధ్య రామమందిరానికి భక్తుల నుంచి అందుతున్న విరాళాల లెక్కింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయ విరాళాల (కానుకల) లెక్కింపు బాధ్యతలను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించనుంది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడం, అందుకు అనుగుణంగా కానుకల రూపంలో వస్తున్న నగదు, బంగారు, వెండి కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించడం ట్రస్ట్ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది.

## సిఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు.. డిఎంకె ఎమ్మెల్యే అరెస్టు



**చెన్నై,జులై 20:** ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌పై బహిరంగ సభలో బెదిరింపు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో డీఎంకే ఎమ్మెల్యే మార్కండేయన్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. కోవిల్‌పట్టిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయగా, రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగింది.మార్కండేయన్ అరెస్టు నేపథ్యంలో విలాతికుళంలోని ఆయన నివాసం వద్ద డీఎంకే కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసన చేపట్టారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి, రోడ్డును ఖాళీ చేయించి ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

21-7Pg6exHMNWJQE.qxd:21-7Pg6exHMNWJQE.qxd 1/1/02 6:42 AM Page 1



# విపత్తు ఎప్పుడు, ఎంత తీవ్రతతో సంభవిస్తుందో ఖచ్చితంగా అంచనా వేయడమే కీలకం

● ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాల నుండి విముక్తి: పరిశ్రమలు, వాణిజ్యం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తు ఎప్పుడు సంభవిస్తుంది, ఎంతసేపు కొనసాగుతుంది, దాని తీవ్రత ఎంత ఉంటుందో ముందుగానే ఖచ్చితంగా అంచనా వేయడం సమర్థవంతమైన విపత్తు నిర్వహణకు మూలాధారం. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గిస్తుంది" అని పరిశ్రమలు, వాణిజ్యం (చేనేత, జౌళి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా పేర్కొన్నారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్ఆర్డీఐ)లో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు విపత్తు నిర్వహణ అంశంపై ఆయన సోమవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగానే అవసరమైన సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని సమీకరించేందుకు కార్యాచరణ సిద్ధంగా ఉండాలని సిసోడియా సూచించారు. ప్రమాద సూచనలు అందిన వెంటనే ప్రజలకు వేగంగా సమాచారం చేరవేయడం, ప్రమాద ప్రాంతాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయడం, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు అత్యంత కీలకమని తెలిపారు.

విపత్తు సంభవించిన అనంతరం సహాయక చర్యలు, పునరావాసం, మౌలిక వసతుల పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని పేర్కొ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్య మవుతాయని సిసోడియా అన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆధునిక టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు,



డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల ముందస్తు అంచనా, పరిస్థితుల పర్యవేక్షణ, నష్టం అంచనా, సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వివిధ ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను ప్రస్తావిస్తూ ఇటీవల సంభవించిన విజయవాడ వరదల నిర్వహణపై ప్రత్యేకంగా వివరించారు.

అలాగే రాష్ట్రాన్ని తరచూ ప్రభావితం చేసే తుఫాన్లు, వరదలు, కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక అధికారిగా పనిచేసిన అనుభవాన్ని కూడా ఆయన శిక్షణార్థులతో పంచుకున్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే భారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలంటే ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, వనరుల సమర్థ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. ఏపీహెచ్ఆర్డీఐ నిర్వహిస్తున్న 12 వారాల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉపన్యాసం జరిగింది. ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

# జియో స్పేషియల్ సాంకేతిక పరిజ్ఞానం సమాజాభివృద్ధికి ఎంతో అవసరం

● తిరుపతి ఐఐటిలో వర్క్ షాప్‌లో వక్తలు



తిరుపతి ఐఐటిలో మూడు రోజుల వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ దేశాల అతిథులు

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలో ఏర్పడిన తిరుపతి ఐఐటిలో బ్రిక్స్ దేశాలతో మూడు రోజుల వర్క్ షాప్‌ను నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన ఈ వర్క్ షాప్‌కు తిరుపతి ఐఐటి ఆతిథ్యమిచ్చింది. ఈ కార్యక్రమాలకు హాజరైన జియో స్పేషియల్ టెక్నాలజీలు, దాని అనువర్తనాలపై 5వ బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఐఐటి తిరుపతి ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ దేశాలలో జియో స్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు నొక్కి చెప్పారు. సమావేశానికి వివిధ దేశాల అతిథులను ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సారథ్యంలో స్వాగతం పలికారు.

అసోసియేట్ ప్రొఫెసర్ నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో జియో స్పేషియల్ టెక్నాలజీల పరివర్తనాత్మక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకార పరిశోధన, సామర్థ్య నిర్మాణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సుస్థిర అభివృద్ధి, వాతావరణ స్థితిస్థాపకత కోసం భౌగోళిక మౌలిక సదుపాయాలు, పొజిషనింగ్, నావిగేషన్, టైమింగ్ సాంకేతికతల గురించి వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, శాస్త్ర, సాంకేతిక శాఖ అండర్ సెక్రటరీ గౌతమ్ గోవింద్, జాతీయ జియో స్పేషియల్ ప్రోగ్రామ్ డివిజన్ హెడ్ డాక్టర్ మనోరంజన్ మొహంతి, సైంటిస్ట్ డాక్టర్ శుభా పాండే, డాక్టర్ అరిందమ్ భట్టాచార్య హాజరయ్యారు. బ్రిక్స్ దేశాలలో జియోస్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు వివరించారు.

# మరింత వేగవంతంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు

- డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండిలో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గులు, సోలార్ బిల్లింగ్, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పిడి, తదితర సమస్యలను సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారులకు విన్నవించారని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# యువతిపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సత్యనారాయణపురంలో ఒక యువతిపై గురువు లాంటి వ్యక్తి లైంగికదాడికి దాడికి పాల్పడ్డాడు. నగరంలో శారీరక వ్యాయమం, పిట్‌నెస్ కోసం ఒక యువతి జిమ్ ట్రైనింగ్ సెంటర్లో చేరింది. అక్కడ ఆమెపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమెకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసి, నగ్న ఫోటోలు తీసినట్లు వేదింపులకు గురిచేస్తున్నాడు. దాంతో ఆ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్‌పై కేసు నమోదు చేసారు. ఫిర్యాదు చేసిన యువతి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్. లావుగా ఉన్న తనను స్లిమ్‌గా మార్చేందుకు జిమ్ సలహాలు ఇస్తూ పరిచయం పెంచుకున్నాడు. ప్రైవేట్ హోటల్‌కు తీసుకువెళ్ళి బరువు తగ్గడానికి షేక్ తాగాలంటూ మత్తు మందు ఇచ్చాడని యువతి ఆరోపిస్తుంది. మత్తు ఇచ్చి అత్యాచారం చేశాడని సత్యనారాయణపురం పోలీసులను ఇచ్చిన ఫిర్యాదులో యువతి అభియోగించింది. కేసు నమోదు చేసి యువతిని వైద్య పరీక్షల కోసం పోలీసులు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

# సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్ రికార్డ్

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు దర్యాప్తును సిట్ మరింత వేగవంతం చేసింది. అందులో భాగంగా సోమవారం విజయవాడలోని సాయికృష్ణ నివాసానికి సిట్ అధికారులు చేరుకున్నారు. అతడి తల్లి విజయలక్షి ్మ స్టేట్‌మెంట్‌ను వారు రికార్డ్ చేశారు. ఈ లాకప్ డెత్ వెనుక ఉన్న కారణాలు ఏమిటనే అంశంపై ఆమెను ప్రశ్నించారు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ వివరాలు కూడా సిట్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సీఐ నాగరాజు, కృష్ణలంక పోలీసులపై విజయలక్ష్మి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను ఆమెను అడిగిన తెలుసుకున్నారు. ఈ కేసులో కృష్ణలంక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రమేయానికి సంబంధించిన అంశాలను విజయలక్ష్మి నుంచి సిట్ అధికారులు సేకరించారు. ఇక ఈ కేసులో తనకు తెలిసిన అన్ని వివరాలను ఈ సందర్భంగా సిట్ అధికారులకు విజయలక్ష్మి వివరించారు.

# ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై అవనిగడ్డ కరకట్టపై యువకుడి దాడి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై కరకట్టపై ఓ యువకుడి దాడి భయాందోళనకు గురిచేసింది. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు వద్ద ద్విచక్ర వాహనంతో అడ్డగించి మరీ వారిద్దరిపై యువకుడు దాడికి తెగబడ్డాడు. బస్సు ఆపలేదనే కారణంతో డ్రైవర్ సురేష్, కండక్టర్ లీలాప్రసాద్‌పై దాడి చేశాడు. అడ్డొచ్చిన ప్రయాణికులనూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అతడిని స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో కరకట్టపై గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. యువకుడి వీరంగం దాదాపు 94 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని పి.కృష్ణప్రసాద్‌గా గుర్తించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిషోర్ వెల్లడించారు.

# ఏజెన్సీలో అశాంతిని సృష్టించొద్దు

## ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విజ్ఞప్తి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదివాసీల దీర్ఘకాలిక హక్కులకి భంగం వాటిల్లుతున్న నేపథ్యంలో 1/70 చట్టాన్ని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ అంతటా ప్రదర్శనలు, సభలు జరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నేడు రంపచోడవరంలో జరుగుతున్న ర్యాలీ, సభపై పోలీసులు తీవ్రమైన ఆంక్షలు పెట్టి జనం రాకుండా నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సిపిఐ(ఎం) దీన్నీ తీవ్రంగా ఖండిస్తున్నది. రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ఆదివాసి ప్రజలు ప్రత్యేకించి యువతి యువకులు ప్రశాంతంగా వస్తున్న సందర్భంలో వారిని దారి మధ్యలో ఆటంకపరిచి రెచ్చగొట్టడం ద్వారా ఏజెన్సీలో అశాంతి పరిస్థితినీ ప్రభుత్వమే సృష్టిస్తున్నది. ఆదివాసి యువత అసంతృప్తికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. వారు చెప్పేది విని 24వ తేదీ ముఖ్యమంత్రి రంపచోడవరం వస్తున్న సందర్భంగా వాటిపై స్పందించి పరిష్కరిస్తే యువతలో ఆందోళన పరిష్కారం అవుతుంది. అందుకు బదులుగా నిర్బంధ పద్ధతుల ద్వారా అడుకోవాలనుకోవడం అవివేకం. 24న ముఖ్యమంత్రి సభకు కూడా ఇదే మాదిరి జనాన్ని రాకుండా ఆటంకపరుస్తారా అని ప్రశ్నిస్తున్నాము. అధికార పార్టీకి పోలీసు యంత్రాంగం అన్ని రకాల అండదండలు ఇస్తూ ఆదివాసీల సంఘాలపై నిర్బంధం ప్రయోగించడం దారుణం. వెంటనే హోం మంత్రి, డీజీపీ జోక్యం చేసుకొని రంపచోడవరం సభ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నానన్నారు.

# నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని సీతారామ్ భూకబ్జా

## - విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకరు తమ్మినేని సీతారామ్ సహా ఆయన కుటుంబ ఖరీదైన భూకబ్జా లక్ష్యంగా పలు అక్రమాలకు పాల్పడిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. సోమవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని కుటుంబ సభ్యులు రూ.4 కోట్ల భూమి కబ్జా చేశారని ఆరోపించారు. బతికున్న వ్యక్తిని కాగితాల్లో మృతుడిగా చూపించారని ఆయన టీడీపీ ఎంపీ వివరించారు. శ్రీకాకుళం దావులపేరంలో 922 గజాల భూమి లక్ష్యంగా ఈ కుట్ర జరిగిందని వెల్లడించారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ సృష్టించి ఈ రిజిస్ట్రేషన్ చేశారని ఎంపి కలిశెట్టి పేర్కొన్నారు. తమ్మినేని సీతారాం కుమారుడి పేరిట 2023లో ఈ భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. నకిలీ ఆధార్ కార్డులు, క్రిమినల్ ముఠాల సహకారంతో ఈ దందా జరిగిందని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు తమ్మినేని సీతారాం కాలేజీ సిబ్బందిని సాక్షులుగా ఉపయోగించారని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని విజయనగరం ఎంపీ అన్నారు. విచారణ తప్పించుకునేందుకు హైకోర్టు నుంచి స్టే తీసుకొచ్చే ప్రయత్నం చేశారంటూ తమ్మినేని సీతారాంతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. తమ్మినేని కుటుంబ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేసి దోషులపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ఉత్సవంగా మండలి కృష్ణారావు జయంతి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వపు విద్యామంత్రి దివంగత మండలి కృష్ణారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 4న మండలి వెంకట కృష్ణారావు జయంతిని జరపాలని ఉత్తర్వులు జారీ చేశారు. దివిసీమ గాంధీగా పేరొందిన మండలి తొలి తెలుగు ప్రపంచ మహాసభల నిర్వహణకు నాందిగా నిలిచారు. దివిసీమ ఉప్పెన సమయంలో అందించిన సేవలు అజరామరం. అవనిగడ్డలో గాంధీ క్షేత్రం ఏర్పాటు చేసి ఎందరికో అండగా నిలిచారు. ఆయన సేవలకుగాను ఏపీ ప్రభుత్వం అధికారభాషా సంఘానికి ఆయన పేరు పెట్టింది. మండలి జయంతిని అధికారికంగా నిర్వహించాలని పలు ఏపీ రచయితల సంఘం, పంచాయతీరాజ్ ఉద్యమ నాయకుడు జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం మండలి జయంతిని అధికారికంగా నిర్వహిస్తుంది.

# తిరుమల సమాచారం



## టిటిడి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు దాతలు తమవంతు విరాళాలు అందిస్తున్నారు. దాతలకు కల్పించే సదుపాయాలు కోత విధించినా దాతలు నుండి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం ఉదయం విజయవాడకు చెందిన అన్ బ్లిక్స్ క్లౌడ్ డేటా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ తిరుమల కుమార్ కనకమేడల వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డిడిలను అందజేశారు.

## తిరుమలలో మహారాష్ట్ర భక్తుడు అదృశ్యం



**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలేశుని దర్శనార్థం వచ్చి కొండపై మహారాష్ట్ర భక్తుడు తప్పిపోయాడు. సోమవారం అతని కుటుంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. మహారాష్ట్ర పుణె జిల్లాకు చెందిన హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ (40) తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం ఈనెల 15వతేదీ తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లో క్యూలైన్‌లో ప్రవేశించారు. ఆరోజు రాత్రి 8గంటలకు కంపార్ట్‌మెంట్-4 వద్ద కుటుంబ సభ్యుల నుండి విడిపోయి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిసిటివి ఫుటేజీని పరిశీలించగా, హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ బాలాజీనగర్ వైపు కాలినడకన వెళ్ళి, ఆ తరువాత కనిపించకుండా పోయాడు. అతని భార్య అర్చనా రోహిదాస్ రోకడే తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వాళ్ళు సమీప పోలీస్ స్టేషన్‌కు, తిరుమల 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని స్టేషన్ రైటర్ మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిస్తే 94407 96771, 94407 96769, 0877- 2289027 నంబర్లకు తెలపాలని కోరారు.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవాలపై టిటిడి ఫోకస్!

● సిద్ధమవుతున్న ఏడుకొండలు ● ఈ యేడాది సాలకట్ల, నవరాత్రి ఉత్సవాలు

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు ముఖ్యం. సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగ వైభవంగా "బ్రహ్మోత్సవాలు" ఈ ఏడాది రెండు సార్లు జరిపించనున్నారు. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ తేదీలను ఇప్పటికే టిటిడి ఆగమ సలహా మండలి పండితులు ఖరారుచేశారు. దేవదేవుని బ్రహ్మోత్సవాలకు శేషాచలకొండల్లోని సప్తగిరులు సిద్ధమవుతున్నాయి. ఈఏడాది ఉత్సవాలపై ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఇటీవల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాచరణ రూపొందించి ఆ దిశగా పనులు చేపట్టాలని ఆదేశించారు. తిరుమల ఆలయం పరిసరాలు, మాఢవీధులు సుందరంగా తీర్చిదిద్దాలని, రంగురంగుల రంగవల్లులు, భక్తులకు సాఫీగా గ్యాలరీలు, అదనపు తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. మాఢవీధులు పూర్తిగా గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, వర్షానికి, ఎండకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.



ఈ ఏడాది సెప్టెంబర్ 14నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 14వ తేదీ అంకురార్పణ, 15న ధ్వజారోహణం, పెద్దశేషవాహనం, తొలిరోజే సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించే ఘట్టాలు జరగనున్నాయి. ఆ తరువాత బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవ సెప్టెంబర్ 19న రాత్రి నిర్వహిస్తారు. 20న సాయంత్రం బంగారురథం, 22న ఉదయం రథోత్సవం, 23న చక్రస్నానంతో పరిసమాప్తమవుతాయి.

ఆ తరువాత రెండు వారాల వ్యవధిలో అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మో త్సవాలు జరిపిస్తారు. అక్టోబర్ 11నుండి 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో 17న పుష్పపల్లకీ సేవ, 16వ తేదీ రాత్రి గరుడవాహనం ప్రధానమైన ఘట్టాలు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు మొదలవుతాయి. దేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగ వైభవంగా జరిగే 'బ్రహ్మోత్సవాలు'కు దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహన సేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిది రోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకార భూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు.

సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిది రోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సారథ్యంలో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

# దేవుని దర్శనం సులభతరం చేయండి: మాజీ సైనికోద్యోగులు

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సేవలో, దేశ భద్రతలో అహర్నిశలు ప్రాణాలు కూడా లెక్కచేయకుండా సేవ చేసిన మాకు తిరుమలేశుని దర్శనం సులభతరంగా కల్పించాలని మాజీ సైనికోద్యోగులు విజ్ఞప్తి చేశారు. తాము అనేక రకాల ఆరోగ్య సమస్యలు సైతం లెక్కచేయకుండా దేశసేవ చేశామన్నారు. సోమవారం ఉదయం పలు డిమాండ్లతో తిరుపతి టిటిడి పరిపాలన భవనం వద్దకు మాజీ సైనికులు చేరుకున్నారు. దేశ సేవ చేసిన మాజీ సైనికులకు దర్శన భాగ్యం కల్పించాలని టిటిడి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేశ సేవ చేసి రిటైర్డ్ అయిన 1.10లక్షల మంది మంది మాజీ సైనికులు ఉన్నారన్నారు. మాజీ సైనికులకు టిటిడిలో మరింత ప్రాధాన్యత నివ్వాలని కోరారు.





# కన్నుల పండువగా ద్రౌపదీ దేవి గ్రామోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ సమేత శ్రీకృష్ణుడు, అర్జునుని విగ్రహాలనుకన్నుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఉత్సవానికి ఆలయ పూజారి పురుషోత్తం వారి సహాయకులు చక్కగా అమ్మవారిని అలంకరించారు. సప్పరంలో ప్రతిష్టించి చెన్నై రోడ్డు మీదు నుంచి పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావు వీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా ఉత్సవం సాగింది, ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో సాగింది.

# ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ఉన్న ఫిజికల్ సర్వీసు రికార్డుల స్థానంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్‌ను వినియోగించనున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఈఎస్ఆర్ 2.0 అప్లికేషన్‌ను అమలు చేస్తోంది. ఈ నూతన డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు వివరాల నమోదు, నిర్వహణ మరింత సులభతరం కానుంది. పారదర్శకత కూడా పెరుగుతుంది.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
మంగళవారం 21, జూలై 2026




# నెలాఖరి నాటికి ప్రధాన రహదారులు సిద్ధం చేయాలి

- జాతీయ రహదారులు కలిసే చోట సూచికలు ఏర్పాటు చేయాలి
- డివైడర్ల పై పచ్చదనం పెంపొందించాలి



**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో వీఎంఆర్‌డిఏ చేపడుతున్న ప్రధాన రహదారుల పనులు వేగవంతం చేసి, నెలాఖరి నాటికి సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంఆర్‌డిఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం ఉదయం అడవివరం-శొంఠ్యాం, వేపగుంట-పినగాడి రహదారుల అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్‌తో కలిసి పరిశీలించారు. ప్రధాన రహదారుల నిర్మాణం దాదాపుగా పూర్తి కావొచ్చాయని, ఐతే విమాన ప్రయాణికులు ఈ రహదారుల్లో సుల భతరంగా విమానాశ్రయానికి సకాలంలో చేరుకునేలా జాతీయ రహదారులను కలిసే ప్రాంతాల్లో సైన్ (తరువాయి 8వ పేజీలో)

# పార్లమెంట్‌లో చింతకాయల విజయ్

## 271వ రాజ్యసభ సమావేశాలకు హాజరు



**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

రాజ్యసభ 271వ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పాల్గొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా వివిధ శాసన, ప్రజా ప్రయోజన అంశాలపై జరిగే చర్చలను (తరువాయి 8వ పేజీలో)

# అనంతుడు పరబ్రహ్మ స్వరూపుడు: చాగంటి




8లో

# పీఎం పాలెంలో ఎలైట్ క్రికెట్ లీగ్

## జెర్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు




**గాజువాక,జులై 20,ప్రభాతవార్త :**

చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో విశాఖపట్నంలోని పీఎం పాలెం స్టేడియంలో 'ఎలైట్ క్రికెట్ లీగ్' పోటీలను నిర్వహించనున్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఈ లీగ్ జెర్సీని గాజువాక ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు (తరువాయి 8వ పేజీలో)

# విశాఖపట్నం పోర్టును సందర్శించిన శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులు



**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ కు చెందిన ఇద్దరు విదేశీ అధికారులతో పాటు 22 మంది శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులు, తమ శిక్షణలో భాగంగా మారిటైమ్ సెక్యూరిటీ మాడ్యూల్ పై అవగాహన కొరకు సోమవారం విశాఖపట్నం పోర్టు (తరువాయి 8వ పేజీలో)

# మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి

## విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో బ్యానర్ పై సంతకాల సేకరణ



**విశాఖపట్నం,జులై 20ప్రభాత వార్త :**

మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద (తరువాయి 8వ పేజీలో)

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

## విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన

## ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వీసీసీఎస్‌సీ ప్రత్యేక సదస్సులు



**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

యువతలో సైబర్ భద్రత, మహిళలు-చిన్నారుల రక్షణపై అవగాహన పెంపొందించేందుకు విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వీసీసీఎస్‌సీ) ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, పోక్సో (పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షణ) చట్టంపై (తరువాయి 8వ పేజీలో)

## ఘనంగా ప్రారంభం కానున్న

# అంతర్జాతీయ విమానాశ్రయం

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం వద్ద ప్రారంభించనున్నారు



**విశాఖపట్నం, జూలై 20 ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని నామకరణం తో సరికొత్త విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 1న జాతికి అంకితం చేయనున్నారు. ఈ ప్రారంభోత్సవం భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వైమానిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకదాని పరిపూర్ణతను సూచిస్తుంది. ఉత్తర కోస్తా ఆంధ్రకు అనుసంధానం, ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధిలో మెరుగైన ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని పెరుగుతున్న ఈ ప్రాంత విమానయాన అవసరాలు తీర్చే విధంగా రూపొందించింది. ఏడాదికి 60. లక్షల మంది ప్రయాణీకులు (ఎంపీపీఏ) ప్రయాణించే సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ (తరువాయి 8వ పేజీలో)

## అనకాపల్లిలో ఘనంగా 'షైనింగ్ స్టార్స్- 2026'

# అవార్డుల ప్రదానోత్సవం

## విద్యార్థులను అభినందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు






**అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో అనకాపల్లిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్-2026' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అన్ని వర్గాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 10వ తరగతిలో 154 మంది, ఇంటర్మీడియట్‌లో 34 మంది విద్యార్థులు ఈ అవార్డులకు ఎంపిక కాగా, ప్రతి విద్యార్థికి రూ. 20,000 నగదు బహుమతితో పాటు ఒక మెడల్, ప్రశంసాపత్రాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా అందజేసి అభినందించారు. ఈ వేడుకలో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు భారీగా పురస్కారాలు సాధించడం పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం నుంచి మొత్తం 31 మంది 10వ తరగతి నుంచి 26 మంది, ఇంటర్మీడియట్ నుంచి 5 మంది ఎంపిక కాగా, (తరువాయి 8వ పేజీలో)

## 'షైనింగ్ స్టార్స్'తో

# ప్రతిభకు గుర్తింపు





- విజయాల పరంపరకు నాంది
- 134 మంది మెరిట్ విద్యార్థులకు రూ.26.80 లక్షల నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

విద్యార్థుల జీవితంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డు తొలి విజయమని, దీనిని విజయాల పరంపరకు నాందిగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ అరేనాలో సోమవారం నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్ కూడా విజయానికి కీలకమని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విశాఖ విద్యార్థులు దేశానికి రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి-2026లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 134 మంది (తరువాయి 8వ పేజీలో)

## ప్రధానమంత్రి మోదీ భోగాపురం పర్యటనకు

# కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- హెలిప్యాడ్, సభా ప్రాంగణం, కాన్వాయ్ మార్గాల పరిశీలన
- పోలీసు అధికారులకు ఐజీ గోపీనాథ్ జట్టి కీలక ఆదేశాలు

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజా రవాణా ఏర్పాట్లు, ప్రధానమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గాలను తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా బందోబస్తు (తరువాయి 8వ పేజీలో)





## సమీష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో

# ముందుకు తీసుకువెళ్దాం

## జిల్లా స్థాయి అధికారులతో అత్యంత సమర్థవంతంగా సమీక్ష

## జిల్లా సమీక్ష కమిటీ (డి ఆర్ సి) సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**అనకాపల్లి,జూలై 20 : ( ప్రభాత వార్త)**

జిల్లాలో మంజూరు చేసిన రోడ్లను రాబోయే పదిహేను రోజుల్లో ప్రారంభించాలని, లేని యెడల సంబంధిత కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా (తరువాయి 8వ పేజీలో)




## మాజీ స్పీకర్ తమ్మినేని భూ కబ్జాపై విచారణ జరిపి

# కఠిన చర్యలు తీసుకోవాలి

## టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్



**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు దేశం పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్ డిమాండ్ చేశారు. సోమవారం రామ్ నగర్ లో వున్న జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో (తరువాయి 8వ పేజీలో)

## ఇష్టం లేకపోతే చెప్పండి..

# రాజీనామా చేసి పోతాను

## మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

## అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. అభివృద్ధి పనులకు సహకరించాలని స్పష్టీకరణ

**అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త :**

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్గత సమీక్ష సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భావోద్వేగ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి పనుల అమలులో అధికారుల నుంచి తగిన సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, (తరువాయి 8వ పేజీలో)



## ఉత్తరాంధ్ర గేట్‌వేగా

# భోగాపురం విమానాశ్రయం

- ఆగస్టు 1న ప్రారంభం నాటికి కనెక్టివిటీ రోడ్లను పూర్తి చేసేందుకు చర్యలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు వేడుకలు నిర్వహిద్దాం

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

ఆగస్టు 1న ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దశ ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో విమానాశ్రయ ప్రారంభోత్సవం, రహదారి అనుసంధానం, ప్రజా రవాణా ఏర్పాట్లపై ఆయన వివరించారు. ఉత్తరాంధ్ర గేట్‌వేగా నిలవనున్న భోగాపురం విమానాశ్రయం ప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు ఉత్సవ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. విమానాశ్రయం ద్వారా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అంశాలను ప్రజలకు వివరించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక (తరువాయి 8వ పేజీలో)




## విశాఖలో ఆదాయపు పన్ను శాఖకు

# నూతన క్వార్టర్లు

## పన్ను వసూళ్లలో ఏపీకి గణనీయ వృద్ధి

## ఆదాయపు పన్ను శాఖ (ఏపీ అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**

విశాఖపట్నం ఎండాడ, సాగర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన "సాగర్ సమీరం" ఆదాయపు పన్ను శాఖ నివాస సముదాయాన్ని సోమవారం ఆదాయపు పన్ను శాఖ (ఏపీ అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ (తరువాయి 8వ పేజీలో)



## నెలాఖరి నాటికి ప్రధాన రహదారులు సిద్ధం చేయాలి

(7వ పేజీ తరువాయి)

బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల మధ్య డివైడర్ల పై నీడ నిచ్చే చెట్లను, పచ్చదనం పెంపొందించే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు కలిసే కూడళ్లలో ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పినగాడి కూడలి వద్ద రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని, పలు సూచనలు చేశారు. రహదారి విస్తరణ, కాలువల నిర్మాణం గురించి చర్చించారు. అనంతరం పినగాడి రామాలయం వద్ద జరుగుతున్న కలువ , రహదారి విస్తరణ పై మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ స్థానికులతో చర్చించారు. రామాలయాన్ని తొలగించకుండా సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో చింతకాయల విజయ్

(7వ పేజీ తరువాయి)

ఆయన ఆసక్తిగా పరిశీ లించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావించడం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై తన వంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా పార్లమెంట్‌లో సమర్థవంతంగా పనిచేస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాజ్యసభ 271వ సమావేశంలో ఆయన పాల్గొనడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## 'షైనింగ్ స్టార్స్'తో ప్రతిభకు గుర్తింపు

(7వ పేజీ తరువాయి)

విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.26.80 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందించింది. ఇందులో 88 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.17.60 లక్షలు, 46 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.9.20 లక్షలు పంపిణీ చేశారు. చెక్కులతో పాటు మెడల్, స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాన్ని కూడా అందజేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న ఈ అవార్డులు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచి చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు గర్వకారణమని, విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ముందుగా అతిథులు విద్యార్థులు ఏర్పాటు చేసిన 'అంబిషన్ వాల్', 'గ్రాటిట్యూడ్ వాల్', 'డ్రీమ్ వాల్'లను సందర్శించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, ఎన్‌సీసీ విద్యార్థులు అతిథులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

(7వ పేజీ తరువాయి)

ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించారు. వీసీఎస్‌సీఎస్ జాయింట్ సెక్రటరీల మార్గదర్శకత్వంలో అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రీ ఈ కార్యక్రమాలను నిర్వహించారు. సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఫిషింగ్, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు, వ్యక్తిగత సమాచార భద్రత, సురక్షిత డిజిటల్ వినియోగం వంటి అంశాలను విద్యార్థినులకు వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంచి స్పర్శ-చెడు స్పర్శ, వ్యక్తిగత భద్రత, అనుచిత ప్రవర్తను గుర్తించే విధానం, వ్యక్తిగత హద్దులను గౌరవించడం, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం, నమ్మకమైన పెద్దలు, పోలీసుల సహాయం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమాల సమన్వయంతో నిర్వహించేందుకు సహకరించిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ, అధ్యాపక బృందానికి వీసీఎస్‌సీఎస్ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమ సమన్వయంలో వీసీఎస్‌సీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కుమార్ జగ్గుమంత్రి కీలక పాత్ర పోషించారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థల సహకారంతో సైబర్ భద్రత, మహిళలు-చిన్నారుల రక్షణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని వీసీఎస్‌సీఎస్ వెల్లడించింది.

## ఇష్టం లేకపోతే చెప్పండి.. రాజీనామా చేసి పోతాను

(7వ పేజీ తరువాయి)

'ఇష్టం లేకపోతే చెప్పండి... ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతాను'' అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ప్రజల సమస్యలు పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంచుకోవాలని ఆయన కోరినట్లు సమాచారం. అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని సమావేశంలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలు సమావేశంలో చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం.

## విశాఖలో ఆదాయపు పన్ను శాఖకు నూతన క్వార్టర్లు

(7వ పేజీ తరువాయి)

చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని ప్రారంభించారు. ఈ నివాస సముదాయంలో 5 టైప్-5, 8 టైప్-4 క్వార్టర్లను ఉద్యోగుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా, హైదరాబాద్ చీఫ్ కమిషనర్ సునీత బిల్లా, విశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బొట్ల శ్రీనివాస్, కమిషనర్ సతీష్ ఇరుకుల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్--తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎప్పుడూ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోందని వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 28.70 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండగా, రిటర్న్ల సంఖ్య 26.98 లక్షలకు చేరిందని తెలిపారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లలోనూ రాష్ట్రం గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జూలై 17 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,043.54 కోట్ల స్థూల పన్ను వసూళ్లు, రూ.6,607.53 కోట్ల నికర పన్ను వసూళ్లు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే 17 శాతం వృద్ధి సాధించినట్లు వివరించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు పన్ను సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఆదాయపు పన్ను శాఖ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.


VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ADDALA PERSY JOYS D/o ADDALA NAGESWARA RAO W/o AVULA HARISH, R/o 63-6-15/2, Siddharda Nagar, Rajahmundry (Urban), PO: Rajahmundry, DIST: East Godavari, Andhra Pradesh - 533101, have changed my name and shall hereafter be known as AVULA DIVYA.

(Ro.No.15914)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## అనకాపల్లిలో ఘనంగా 'షైనింగ్ స్టార్స్- 2026' అవార్డుల ప్రదానోత్సవం

(7వ పేజీ తరువాయి)

వీరిలో 22 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం ప్రభుత్వ బడుల సత్తాను చాటుతోందని ఆయన కొనియాడారు. సభను ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడు తూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగ తిలో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 54 మంది ఉండటం గర్వకారణ మన్నారు. అలాగే ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్ష లో నియోజకవర్గం నుంచి 40 మంది ప్రభు త్వ బడుల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, నర్సీపట్నం అంబేద్కర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన విద్యార్థిని ప్రతిష్ఠాత్మక ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయ మని ఆయన ప్రశంసించారు. విద్యార్థులంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించి



భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం పోర్టును సందర్శించిన శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులు

(7వ పేజీ తరువాయి)

అథారిటీని సందర్శించారు. ఈ సందర్భంగా పోర్ట్ చైర్‌పర్సన్ జె.ఎస్. బింద్రా, ఐఆర్‌టీఎస్ శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికి, పోర్టు ఆధునిక మౌలిక సదుపాయాలు, కార్యాచరణ సామర్థ్యం, ప్రాంతీయ మరియు జాతీయ ఆర్థికాభివృద్ధిలో పోర్టు పోషిస్తున్న కీలక పాత్రపై సమగ్ర సమాచారం అందించారు.

ఇదే సమయంలో పోర్టు మౌలిక వసతులు, కార్గో నిర్వహణ సామర్థ్యం, ఆధునీకరణ మరియు యాంత్రీకరణ చర్యలు, కవర్డ్ స్టోరేజ్ సదుపాయాలు, లాజిస్టిక్స్ మౌలిక వసతులు, సౌర విద్యుత్ ఉత్పత్తి, మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించడం, పెట్టుబడులు మరియు పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, అలాగే దిగుమతులు--ఎగుమతులను మరింత ప్రోత్సహించే అవకాశాలపై శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులకు వివరించారు. ఈ సందర్శన ద్వారా సముద్ర భద్రతకు సంబంధించిన అంశాలు, తీర భద్రత సవాళ్లు, ప్రస్తుత భద్రతా పరిస్థితుల్లో ఉద్భవిస్తున్న ముప్పులపై ట్రైనీ అధికారులకు విలువైన అవగాహన కల్పించారు. భవిష్యత్తులో తమ విధుల్లో ఎదురయ్యే సముద్ర, తీర భద్రత అంశాలను సమర్థంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు వెల్లడించారు. పోర్టు నిర్వహణ, ఆధునిక మౌలిక వసతులు, సముద్ర రవాణా మరియు లాజిస్టిక్స్‌పై సమగ్ర సమాచారం అందించినందుకు పోర్ట్ యాజమాన్యానికి ఐపీఎస్ శిక్షణార్థులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోర్ట్ అందించిన ఆతిథ్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్‌పర్సన్ శ్రీమతి రోష్ని అపరంజి కోరాటి, ఐఏఎస్, వివిధ విభాగాల అధిపతులు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్, పోర్టు సీనియర్ అధికారులు పాల్గొని శిక్షణార్థులతో ముచ్చటించారు.

## ప్రధానమంత్రి మోదీ భోగాపురం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఐజీ గోపీనాథ్ జట్టి, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, ప్రతి అంశంలో సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బందోబస్తు విధులు, భద్రతా ప్రమాణాలు, ప్రజల రాకపోకలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ రూట్ మ్యాప్‌ను ప్రెజెంటేషన్ ద్వారా వివరించి, ప్రధానమంత్రి ప్రయాణ మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఐజీ గోపీనాథ్ జట్టి హెలిప్యాడ్, సభా వేదిక నిర్మాణ పనులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్‌ను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభా ప్రాంగణాన్ని సెక్టార్లుగా విభజించి ప్రతి ప్రాంతంలో ప్రత్యేక భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిఘాను మరింత పటిష్ఠం చేసి ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్పీ కే. మహేశ్వర రెడ్డి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి

(7వ పేజీ తరువాయి)

బ్యానర్‌పై భారీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రా యూనివర్సిటీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం .నళిని మాట్లాడుతూ సగం జనాభా ఉన్న మహిళలకు నిర్ణయాలు తీసుకునే వేదికల్లో సముచిత స్థానం లేకపోతే ప్రజాస్వామ్యం సంపూర్ణంగా ఉండదని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అనేది ఎవరో ఇచ్చే వరం కాదని, భారత రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను ఆచరణలో పెట్టే చర్య అని తెలిపారు.మహిళా రిజర్వేషన్ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించినప్పటికీ, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్తయిన తర్వాతే అమలు చేస్తామని షరతు విధించడం వల్ల మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం నిరవధికంగా వాయిదా పడిందని విమర్శించారు. మహిళల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, డీలిమిటేషన్ షరతును తొలగించి ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్.ఎన్. మాధవి, జిల్లా కార్యదర్శి వై. సత్యవతి, జిల్లా నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు బి.పద్మ, డి.కొండమ్మ మాట్లాడు తూ దేశ జనాభాలో మహిళలు దాదాపు 50 శాతం మంది ఉన్నప్పటికీ, దేశానికి చట్టాలు చేసే పార్లమెంట్, శాసనసభల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండటం ప్రజాస్వామ్యానికి శోచనీయమైన విషయమని పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల కేవలం మహిళలకే కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే బలం చేకూరుతుందని తెలిపారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో చట్టసభల్లో ఉంటే మహిళల భద్రత, విద్య, ఆరోగ్యం, ఉపాధి, సమాన వేతనం, గృహహింస నిరోధం, పిల్లల సంక్షేమం, సామాజిక న్యాయం వంటి అంశాలు మరింత ప్రాధాన్యంతో చర్చకు వస్తాయని పేర్కొన్నారు. కుటుంబాలు, పిల్లలు, బలహీన వర్గాల అవసరాలు పాలనా విధానాల్లో మరింత సమర్థంగా ప్రతిబింబిస్తాయని అన్నారు.స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత వేలాది మంది మహిళలు సమర్థవంతమైన ప్రజాప్రతినిధులుగా తమ నాయకత్వాన్ని నిరూపించుకున్నారని గుర్తు చేశారు. భారతి, కుమారి, వరలక్ష్మి,మణి,జి .లక్ష్మి,ఎస్ . విజయలక్ష్మి, జి .మణి, బి .ఈశ్వరమ్మ, మౌనిక, శ్రీదేవి, వి .ప్రభావతి, ఐద్వా విశాఖ జిల్లా నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమీష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దాం

(7వ పేజీ తరువాయి)

సమీక్షా కమిటీ (డి ఆర్ సి) సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఇరిగేషన్, త్రాగు నీరు, రోడ్లు భవనాలు, జలజీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్ట్ ఎడమ కాలువ పనులు, ఏపీఐఐసీ, పంచాయతీ రాజ్, డిజాస్టర్ మేనేజ్మెంట్, వ్యవసాయ శాఖ, మున్సిపాల్ శాఖల పై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, , బండారు సత్యన్నారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, వి ఎమ్ ఆర్ డి ఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ లతో కలిసి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.....జిల్లాలో మంజూరు చేసిన రోడ్లను రాబోయే పదిహేను రోజుల్లో ప్రారంభించాలని, లేని యెడల సంబంధిత కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, వినియోగంలోకి తీసురావాలన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాను వ్యవసాయ రంగం తోపాటు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి బాటలో నిలిపేవిధంగా నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవహ నిర్వహించిన 6వ జిల్లా సమీక్షా సమావేశం లో పలు శాఖలకు సంబంధించిన పెండింగ్ సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. ఆగస్టు 14న గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటన , కార్యక్రమాలు ఉన్నందున, దానికి సంబంధించిన అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను పక్కాగా ప్లాన్ చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. చివరగా సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర శాఖల అధికారులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేబాధ్యత అధికారులపై ఉంది. వివిధ శాఖల పరిధిలో ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో నీటిపారుదల శాఖ పరిధిలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు మరియు ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని, విధుల్లో అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీష్టి కృషితో అభివృద్ధి పథంలో అనకాపల్లి జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచేందుకు తాము శాయశక్తులా కృషి చేస్తామన్నారు. రైతాంగానికి మేలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పారిశ్రామికరంగ అభివృద్ధికి కూడా సమిష్టి కృషి చేస్తామన్నారు. పేదప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ముఖ్యంగా త్రాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు, సీపీవో జి.రామారావు,అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయేషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర విలేకరులతో మీడియా సమావేశం నిర్వహించి ఆగస్టు 14వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనకాపల్లిలో పోలవరం కాలువ వద్ద జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాంబిల్లి మండలం పంచదార్లలో జరుగుతున్న మైనింగ్ పై ఒక కమిటీ వేసి ఆ ప్రాంతాన్ని నో మైనింగ్ గా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అనంతుడు పరబ్రహ్మ స్వరూపుడు: చాగంటి

పద్మనాభం, జులై 20, ప్రభాతవార్త :

ప్రేమైక మూర్తి అనంత పద్మనాభస్వామి పరబ్రహ్మ స్వరూపుడని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం పద్మనాభ స్వామి విశిష్టత – వైభవం గురించి ఆయన ప్రసంగించారు. అనంత యోగనిద్రలో ఉండే పద్మనాభస్వామి మూడు చుట్లు సత్వం, రజస్సు, తమస్సులను ప్రతిబింబిస్తాయని చెప్పారు. పంచ ఇంద్రియాలను ప్రసాదించే పరమశివుడిని మనస్సులో ధ్యానించని జన్మ వృథా అన్నారు. అనంత పద్మనాభస్వామి పరమ భక్తుడైన ట్రావెన్ కోర్ సంస్థానాధీశుడు మార్తాండ వర్మ తమ సర్వస్వం స్వామివారికి అర్పించి పద్మనాభదాసగా పేరు మార్చుకున్నారని వివరించారు. ఏడాది వయసులోనే బిడ్డలకు అభిషేకం జలాలతో ప్రోక్షణ చేసిన తర్వాత వారి పేరు చివర పద్మనాభదాసగా నామకరణం చేస్తారని పేర్కొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో సాష్టాంగ నమస్కారం చేసే అవకాశం కేవలం ట్రావెన్ కోర్ సంస్థాన వారసులకే ఉంటుందన్నారు. చాగంటి కోటేశ్వరరావు దంపతులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శారద దంపతులు శాలువాతో సత్కరించారు. గంటా శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు పద్మనాభం విచ్చేసిన చాగంటి కోటేశ్వరరావు ప్రవచన సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున జనం తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాథుర్, దేవాదాయ శాఖ ఏసీ అన్నపూర్ణ, సత్యనారాయణ మూర్తి, చిక్కాల విజయ్ బాబు, గోపాలకృష్ణంరాజు, కసిరెడ్డి దామోదరరావు, కోరాడ రమణ, పంచకర్ల సందీప్, కురుమిన రామస్వామి నాయుడు, కాళ్ల సత్యనారాయణ, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## పీఎం పాలెంలో ఎలైట్ క్రికెట్ లీగ్

### జెర్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

(7వ పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉదయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో జరిగే ఈ టోర్నమెంట్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకుల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని తెలిపారు. ఆదివారం టీవీ, సినీ ప్రముఖులు, వైద్యులు, అధికారుల జట్లు తలపడతాయన్నారు. ఈ లీగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దేశ సరిహద్దుల్లో సేవలందిస్తున్న జవాన్లు, అమరవీరుల కుటుంబాలకు అందజేస్తామని, ఈ పోటీలను అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, సింహాచలం ప్రత్యేక ఆహ్వానితులు దక్షిణామూర్తి, బీజేపీ ధార్మిక పరిషత్ అధ్యక్షులు ఫణీంద్రా, జోనల్ కమిషనర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కఠిన చర్యలు తీసుకోవాలి

(7వ పేజీ తరువాయి)

విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ మాట్లాడారు. అత్యున్నత రాజ్యాంగ పదవిలో పనిచేసిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పేరుతో వెలుగులోకి వచ్చిన ఆరోపణలు బాధాకరమని అన్నారు. శ్రీకాకుళం జిల్లా చాపురం గ్రామంలో అంధవరపు గోవిందరాజుకు చెందిన భూములను నకిలీ పత్రాలతో మరో వ్యక్తి పేరుకు మార్చి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. బాధితులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణ చేపట్టగా, సంబంధిత పత్రాలు నకిలీవని తేలినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్సీపీ నేతలు భూ ఆక్రమణలు, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆయన విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ మాట్లాడుతూ, భూ పత్రాలను ఫోర్జరీ చేసి ఆస్తులు ఆక్రమించడం అత్యంత తీవ్రమైన విషయం అని అన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు సమానమేనని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉత్తరాంధ్ర గేట్‌వేగా భోగాపురం విమానాశ్రయం

(7వ పేజీ తరువాయి)

ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా 28 ప్రధాన రహదారులు, సుమారు 238 కిలోమీటర్ల రోడ్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఈ క్రమంలో తెలిపారు. ప్రతి రహదారిలో ప్రయాణికులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందేలా విస్తృతంగా సైనేజీలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ రహదారులను డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ రహదారులతో పాటు ఇప్పటికే ఉన్న రోడ్లను అనుసంధానం చేయాలని, మాస్టర్ ప్లాన్ రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడు ప్రాధాన్య రహదారుల్లో నాలుగు పూర్తయ్యాయని, అడవివరం – శొంత్యాం రహదారికి అటవీ అనుమతులు లభించాయని తెలిపారు. మిగిలిన రెండు రహదారుల పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. జుత్తాడ రహదారి పనులు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. మారికవలస జంక్షన్ విస్తరణ, వేపగుంట--జుత్తాడ రహదారి అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

కోస్టల్ కారిడార్ అభివృద్ధికి అవసరమైన అనుమతులు పూర్తిస్థాయిలో లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జోడుగుళ్లపాలెం నుంచి రుషికొండ మీదుగా భోగాపురం విమానాశ్రయం వరకు అనుసంధానంపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ రహదారులను ప్రయాణికులు వినియోగించుకునేలా కీలక ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పీక్ అవర్స్‌లో విశాఖ నగరం నుంచి విమానాశ్రయానికి చేరుకునేందుకు పట్టే సమయంపై ఇప్పటికే అధ్యయనం చేశామని తెలిపారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని వాహనదారులు పాటిస్తే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. విమానాశ్రయానికి ప్రత్యేక ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 100 బస్సుల్లో 20 బస్సులను ప్రత్యేకంగా కేటాయించగా, ఇప్పటికే తొమ్మిది బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. గాజువాక నుంచి జాతీయ రహదారి మీదుగా విమానాశ్రయానికి తొలి సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, బీచ్‌రోడ్ మార్గంలోనూ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విమానాల రాకపోకల సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. విశాఖ నగర పరిధిలో తొమ్మిది ప్రాంతాల్లో ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రత్యేక లాంజ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ల వద్ద ప్రత్యేక చర్యలు

అనంతరం వివిధ కూడళ్లు, ఫ్రీ లెఫ్ట్, సిగ్నల్ పాయింట్స్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పలు అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు కూడా ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అనుసరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వీటన్నింటిపై ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్ కు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వి. సతీష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభం కానున్న అంతర్జాతీయ విమానాశ్రయం

(7వ పేజీ తరువాయి)

విమానాశ్రయం భవిష్యత్తులో దశల వారీగా 4 కోట్ల ఎంపీపీఏలకు పైగా వీలు కల్పిస్తుంది. విమానాశ్రయంలో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్ వే, ఆధునిక ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్, ప్రత్యేక కార్గో సౌకర్యాలు, ఆధునిక విమానయాన ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించగల సామర్థ్యం వీటికి ఉంటుంది. వాణిజ్య కార్యకలాపాలకు సంసిద్ధతను ప్రదర్శిస్తూ, ఈ విమానాశ్రయం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నుంచి భద్రతా మదింపు పరిశీలన ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐసీపీ)గా నోటిఫికేషన్, కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 8 కింద కస్టమ్స్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి దీన్ని నిర్వహించడానికి అనుమతి (సీటీఓ) తో పాటు, సంబంధిత నియంత్రణ అధికారుల నుంచి ఇతర తప్పనిసరి కార్యాచరణ ఆమోదాలతో సహా అన్ని ప్రధాన చట్టబద్ధమైన, నియంత్రణ అనుమతులను పొందింది. ఈ ఆమోదాల వల్ల ప్రారంభోత్సవం జరిగిన వెంటనే షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. విశాఖ సమీపంలో భోగాపురం దగ్గరున్న విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్గఢ్లోని పొరుగు జిల్లాలకు ప్రాథమిక విమానయాన మార్గంగా ఉంటుంది. ప్రధాన దేశీయ, అంతర్జాతీయ గమ్యాలను చేరుకోవడంలో చెప్పుకోదగిన మెరుగుదల తీసుకువస్తుంది. పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్, తయారీ, పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్తర కోస్తా ఆంధ్రలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్)ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం, దాని సమీప జిల్లాలతో విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను వేగవంతం చేశాయి. ఏడు అప్రోచ్ రోడ్లు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచాయి. హైవే కనెక్టివిటీ విమానాశ్రయానికి ప్రయాణికులు వచ్చిపోయేందుకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అత్యంత సౌకర్యంగా ఉంటుంది. ప్రయాణీకులకు కనెక్టివిటీ కల్పించడమే కాకుండా, ఈ విమానాశ్రయం దీర్ఘకాలంలో ఆర్థిక అభివృద్ధికి ప్రేరకంగా పనిచేస్తుందని ఆశిస్తున్నారు. కార్గో ప్రాథమిక సౌకర్యాలు, పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలో ఉండడం, లాజిస్టిక్స్ సామర్థ్యం మెరుగుగా ఉండడంతో, సమాచార సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సముద్ర ఆహార ఎగుమతులు, ఆధునిక తయారీ వంటి ఎదుగుతున్న రంగాలకు మద్దతుగా ఉంటుంది.

సమర్థవంతమైన, సుస్థిరమైన, భవిష్యత్తుకు సన్నద్ధంగా ఉండే కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే విధంగా, పునరుత్పాదక శక్తి, వర్షపు నీటి సేకరణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణ బాధ్యతాయుత మౌలిక సదుపాయాలను పొందుపరుస్తూ, సుస్థిరతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఈ విమానాశ్రయం అభివృద్ధి చేయడం జరిగింది. తుది సన్నాహాలు చివరి దశకు చేరుకోవడంతో, విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని, కార్యకలాపాల నిర్వహణ ప్రారంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు, విమానాశ్రయ భాగస్వాములు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో కృషి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ విమానయాన ప్రస్థానంలో చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది ప్రయాణీకులకు, వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు నూతన అవకాశాలను సృష్టించడంతోపాటు, విశాఖపట్నంను "తూర్పు ముఖద్వారం"గా, తూర్పు భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మరింత బలోపేతం చేస్తుంది.

## ఘనంగా 'షైనింగ్ స్టార్స్-2026' పురస్కారాల ప్రదానోత్సవం

**ఎస్ఎస్‌సి, ఇంటర్లో టాపర్లను సత్కరించిన పాఠశాల విద్యాశాఖ : జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ**

పాడేరు,జూలై20, ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 2026 ఎస్ఎస్‌సి అండ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు "షైనింగ్ స్టార్స్-2026" సత్కార కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాడేరుమండలం, కుమ్మరి పుట్టులోని ఎస్.ఆర్. శంకరన్ ఆడిటోరియంలో ఈరోజు ఉదయం ఈ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, డీఈవో, ఆర్డీఓ, తదితరులు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించ డానికి నిరంతర శ్రమ, అంకితభావం, సరైన ప్రణాళికే ప్రధాన సాధనాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినం దిస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వక్తలు పాల్గొని విద్యార్థులకు, తల్లిదండ్రులకు మార్గదర్శకత్వం చేశారు. ఈ సందర్భంగా మొదటి వక్త (పూర్వ విద్యార్థి) తన విద్యార్థి జీవిత అనుభవాలను పంచుకుంటూ, "మనలో గర్వం ప్రవేశిస్తే ప్రగతి అక్కడితో ఆగిపోతుంది. ఏ విజయమైనా నిరంతర శ్రమ ద్వారానే సాధ్యమవుతుంది" అని హితవు పలికారు. ప్రారంభంలో వచ్చే ఒడిదొడుకులకు భయపడవద్దని, నిలకడైన శ్రమతో అసలైన ప్రతిభను బయటకు తీయవచ్చని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. అలాగే, జీవితంలో అను కున్న లక్ష్యాలు మారినప్పుడు నిరాశ చెందకుండా ఎల్లప్పుడూ ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధంగా ఉంచు కోవాలని, ఐఐటి కాకపోయినా ఎన్ఐటి ద్వారా, లేదా అబ్రాడ్ వెళ్ళే అవకాశం లేకపోయినా ఏఐ వర్క్‌షాప్స్, ఫుల్ స్టాక్ డెవలపర్ వంటి ఆధునిక కోర్సుల ద్వారా రాణించవచ్చని సూచించారు. పిల్లలు నిరుత్సాహపడి నప్పుడు తల్లిదండ్రులు వారిలోని బలాన్ని గుర్తుచేస్తూ ప్రోత్సహించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను గౌరవించడానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో "షైనింగ్ అనే అద్భుతమైన కార్యక్రమాన్ని తీసుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిం చేందుకు గోల్డ్ మెడల్, సర్టిఫికేట్‌తో పాటు రూ.20,000 నగదు బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పురస్కారం విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతుందని, మిగిలిన పిల్లల్లో కూడా ఒక సరికొత్త స్ఫూర్తిని నింపుతుందని ఆమె పేర్కొన్నారు. విద్యాసంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా అసాధారణ ప్రతిభ కనబరిచి, అత్యుత్తమ మార్కులతో టాప్ ర్యాంకులు సాధించిన పలువురు విద్యార్థులను ఈ సందర్భం గా ప్రత్యేకంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు విద్యార్థులు అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు, ఎంపీపీ రత్నకుమారి, మాజీ ఎంపీపీలు బొర్ర విజయ రాణి, ఎస్వి రమణమూర్తి, ఆర్డీఓ భుజంగరావు, ప్రారంభ ఉపన్యాసం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి భీమ శంకర్రావు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ స్వామి నాయుడు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండేళ్లు గడిచింది జీవో నెం.3 ప్రత్యామ్నాయం ఊసే లేదు

**1/70 చట్టం మాటే లేదు -పాడేరు ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు**

పాడేరు,జూలై20,ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ సెడ్యూల్ ప్రాంతం ఏజెన్సీలో జీవో నెం.3 సుప్రీంకోర్టు కొట్టివేస్తే గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి గిరిజనులకు గుండెకాయ లాంటి జీవో నెంబర్ 3 వారికి 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని అప్పుడు సటీ జీవో చేసి మా పార్టీ తరుపున సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ కూడా వేయడం జరిగింది కావా లంటే ఆధారాలు కూడా ఉన్నాయి, మొన్న గిరిజనులు అందరు ఏకమై హక్కులు చట్టాలు కోసం పోరాటం చేస్తే కూటమి నాయకులు కనీసం మద్దతు తెలపడం లేదు మీరా మాట్లాడుతున్నారు? మీకు చేతనైతే మీ నాయకుడు చంద్రబాబు నాయుడు గిరిజన ప్రజల మీద చిత్తశుద్ధి ఉంటే జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేస్తాం లేదంటే ప్రత్యన్మాయ జీవో తీసుకొస్తాం అని బహిరంగ సభలో గిరిజనుల సాక్షిగా మాట ఇచ్చారు, కానీ అధికారంలో వచ్చి రెండేళ్లు గడిచిన కనీసం జీవో నెంబర్ ప్రస్తావన కూడా ఎక్కడ కనిపించడం లేదని అన్నారు. గిరిజనుల పక్షపాతి జగన్మోహన్ రెడ్డి గారు ఆ నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2015 సంవత్సరంలో చింతపల్లి వేదికగా బహిరంగ సభలో గిరిజన ప్రజలకు మాట ఇచ్చి అధికారంలో వచ్చిన వెంటనే బాక్సైట్ జీవో నెంబర్ 97 రద్దుచేసింది జగన్ మోహన్ రెడ్డి కదా? మీరా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం మాట్లాడుతున్నారు,బి గిరిజన ప్రాంతాల్లో ఉన్న కూటమి నాయకులు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యంత బలమైన చట్టం 1/70 చట్టం అలాంటి చట్టాన్ని భగ్నం చెయ్యడానికి సభాపతి హోదాలో ఉన్న అయ్యన్న పాత్రుడు 1/70 చట్టం సడలిస్తే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతుంది అని మాట్లాడినప్పుడు స్థానికంగా ఇక్కడున్న కూటమి నాయకులు ఎందుకు నోరు మెదపలేదు, అంటే దీని వెనక రహస్యం ఏమిటి? గిరిజనులు అందరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కడుతున్నారని కుట్రతో కూటమి ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు కాలరాయ దానికి ప్రయత్నాలు చేస్తున్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ 2018 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు చింతపల్లి, అనంతగిరి ఏరియాల్లో టెండర్లకు పిలిచి అనుమతులిచ్చి ఇప్పుడు కొనసాగింపు ప్రయత్నాలు చేస్తూ, మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు, మీరు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలకు బాగా తెలుసు ఎవ్వరు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం కంటికి కనిపించకుండా కుట్ర కొండల్లో బ్లాక్ మైనింగ్ సమాచారం సేకరించి తవ్వకాలను కనుకట్టు చేస్తున్నారు, అదే జరిగితే మా పార్టీ స్టాండ్ తో ఉద్యమం తప్పదని కూటమి ప్రభుత్వంపై శాసన సభ్యులు సవాల్ చేశారు.

## మేరా యువభారత్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహణ

పాడేరు,జూలై20,ప్రభాతవార్త:



భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మేరా యువభారత్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ అధ్యక్షతన నిర్వహించినట్లు జిల్లా యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఉపసంచాలకులు జె. మహేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జిల్లాలో యువత అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, మై భారత్ మెరు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల విస్తరణ, యువజన సంఘాల బలోపేతం, నశా ముక్త్ భారత్ అభియాన్ అమలు, పర్యావరణ పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై యువతలో అవగాహన కల్పించడం, క్రీడా పోటీల నిర్వహణ, క్రీడా సామగ్రి పంపిణీ, యువ ఆపదమిత్ర కార్యక్రమం అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.అలాగే రాబోయే రోజుల్లో నిర్వహించనున్న వివిధ యువజన సేవల కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళికపై సమగ్ర సమీక్ష నిర్వహించిన జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలు విస్తృతంగా చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఉపసంచాలకులు జె.మహేశ్వరరావు తెలిపారు.

## పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి

పాడేరు,జూలై20,ప్రభాతవార్త:




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజల సంతృప్తిని పెంపొందించే లక్ష్యంతో పీజీఆర్ఎస్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ను ప్రవేశపెట్టినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను ప్రముఖంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార సేవలు పొందిన అనంతరం ప్రజలు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నమోదు చేయాలని సూచించారు.ప్రజల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఫిర్యాదుల పరిష్కార సేవల నాణ్యతను ప్రభుత్వం సమీక్షించి, సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు.జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే ప్రతి పౌరుడు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ విలువైన సూచనలు, అభిప్రాయాలను నమోదు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లూరి జిల్లా పీజీఆర్ఎస్ నోడల్ అధికారి విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నోటీస్ బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదు కౌంటర్లు, ముద్రిత మరియు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర ప్రజా సమాచార వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద క్యూఆర్ కోడ్‌ను ప్రజల కంటికి స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. ఈ క్యూఆర్ కోడ్‌ను స్పష్టమైన, పెద్ద సైజులో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రదేశాలలో ఉంచాలి. పీజిఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే పౌరులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, తమ అభిప్రాయాలను/ఫీడ్‌బ్యాక్‌ను సమర్పించేలా వారిని ప్రోత్సహించాలి. ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ డిస్ప్లేలను నిరంతరం పర్యవేక్షించాలి. ఒకవేళ అవి దెబ్బతిన్నా లేదా తొలగించబడినా తక్షణమే వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలి.పౌరుల భాగస్వామ్యాన్ని గరిష్ఠంగా పెంచడానికి నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, గ్రీవెన్స్ కౌంటర్లు, అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ క్యూఆర్ కోడ్ విధానంపై విస్తృత ప్రచారం కల్పించాలి. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా పౌరులు నేరుగా ప్రభుత్వ అధికారిక పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ పోర్టల్ కు అనుసంధానించబడతారు. ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేసి, అన్ని జిల్లా మండల స్థాయి పీజిఆర్ఎస్ కార్యాలయాలలో క్యూఆర్ కోడ్ ప్రదర్శన ప్రక్రియ పూర్తయినట్లు వీలైనంత త్వరగా ధృవీకరించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ (సర్) - 2026

**అధికారులకు జిల్లా కలెక్టర్జిల్లా ఎన్నికల అధికారి. టి.నిశాంతి -కీలక ఆదేశాలు జారీ**

పాడేరు/అరకు లోయ, జూలై20,ప్రభాతవార్త



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూలై 1వ తేదీ అర్హత తేదీగా ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ (సర్) కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా, లోపాలు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి అధికారులు నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి.నిశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సవరించిన షెడ్యూల్, పెండింగ్ పనుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎల్‌ఓల ఇంటింటి సర్వే జూన్ 15, 2026 నుండి జూలై 24, తేదీ వరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ /పునర్వ్యవస్థీకరణ, జూలై 24వ తేదీ లోగా ప్రాథమిక (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా ప్రచురణ, జూలై 31, 2026. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ: జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30, వరకు అభ్యంతరాల పరిష్కారం, సెప్టెంబర్ 28 తేదీ లోగా తుది ఓటర్ల జాబితా ప్రచురణ, అక్టోబర్ 03వ తేదీలో పెండింగ్ పనులపై కలెక్టర్ సీరియస్; తక్షణ చర్యలకు ఆదేశం జిల్లాలో ఇప్పటికీ పలు నియోజకవర్గాల్లో డేటా మ్యాపింగ్, ధృవీకరణ పనులు పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లింకేజ్ లేని ఎన్యూమరేషన్ ఫారాలు : జిల్లాలో దాదాపు 4,99,752 ఫారాలకు (అరకు లోయలో 2,48,665, పాడేరులో 2,51,087) పాత జాబితాతో మ్యాపింగ్ కాలేదు, వీటిని తక్షణమే సరిచేయాలని చూచించారు. జిల్లాలోని 624 పోలింగ్ కేంద్రాల భాగాలలో ఇంకా 543 భాగాలకు (అరకు లోయలో 302, పాడేరులో 241) సంబంధించిన సమా వేశ వివరాల నివేదికలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వీటిని వెంటనే పూర్తి చేసి ఏఈఆర్ఓ కార్యాలయాలకు సమర్పించాలి. డేటా లోపాలు ఓటర్ల జాబితాలో నమోదైన 11,933 సాంకేతిక, లాజికల్ లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బీఎల్‌ఓలు వెంటనే సరిదిద్దాలన్నారు. వృద్ధ ఓటర్ల ధృవీకరణ, 85 ఏళ్లు పైబడిన ఓటర్లలో పెండింగ్‌లో ఉన్న 544 కేసుల తండ్రి/తల్లి/వారసుల మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయా లన్నారు. అధికారులకు ముఖ్య సూచనలు, ఫొటోల నాణ్యత, ఓటర్ల జాబితాలో ఉన్న పాత, మసకబారిన, నలుపు-తెలుపు ఫొటోల స్థానంలో కొత్త రంగుల ఫొటోలను అప్‌డేట్ చేయడం తప్పనిసరి, చిరునామా ప్రామాణీకరణ కుటుంబాల గ్రూపింగ్, ఓటర్ల ఇళ్ల నంబర్లను క్రమ పద్ధతిలో అమర్చాలి. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు ప్రాంతాలు లేదా పోలింగ్ కేంద్రాల పరిధిలోకి విడిపోకుండా ఒకే చోట ఉండేలా చూసుకోవాలన్నారు. వీఐపీ ఓటర్ల నమోదు, ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్నవారు, క్రీడా, సాంస్కృతిక రంగాల ప్రముఖుల వివరాలను తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో ధృవీకరించి చేర్చాలన్నారు. ఈ ఆదేశాలను ఈఆర్ఓలు ఏఈఆర్ఓలు తక్షణమే బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు చేరవేసి, క్షేత్రస్థాయి పనులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన పనులన్నింటినీ రెండు రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా, గడువు దాటినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంతి హెచ్చరించారు.

## కొయ్యూరు - కాకరపాడు తారు రోడ్డు పనులు ప్రారంభం

**గతుకుల రోడ్డు కష్టాలు తీరినట్టే... ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్**

కొయ్యూరు, జూలై 20, ప్రభాతవార్త



మండలంలోని కొయ్యూరు - కాకరపాడు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రూ.2.10 కోట్ల నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీపీ బడుగు రమేష్ బాబు, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ పనులను ప్రారంభించారు. కాకరపాడు నుండి మండల కేంద్రమైన కొయ్యూరు వరకు గల తారు రోడ్డు గతుకుల మయమవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఈ రోడ్డు నిర్మాణంతో వాహన చోదకులకు, ప్రయాణికులకు కష్టాలు తీరినట్టేనని వారు అభిప్రాయపడ్డారు. ఆర్ అండ్ బి జెయి జయరాజ్, ఇతర సిబ్బంది, అలాగే టిడిపి నేతలు దుచ్చరి చిట్టిబాబు, లోతాభీమరాజు, కురుజు శ్రీను బాబు, బాచి, శ్యామల వరలక్ష్మి, సురబోయిన చిన్ని, మాకాడ బాలరాజు, టింకు, రాజేష్, మేడి బోయిన చక్రరావు పాల్గొన్నారు.

**డబుల్ రోడ్డు ముద్దు... సింగిల్ రోడ్డు వద్దే వద్దు -సీపీఐ**

నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రానికి కాకరపాడు నుండి డబుల్ రోడ్డు నిర్మించాల్సిన అధికారులు, సింగిల్ రోడ్డు మంజూరు చేసి చేతులు దులుపుకుంటున్నారని మండల సిపిఐ కార్యదర్శి ఉల్లి సూరిబాబు, నేతలు ఇరువాడ దేవుడు, మాదల సత్తిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకరపాడు నుండి కొయ్యూరు వరకు గల రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి, మధ్యలోని రెండు వంతెనలను ఆధునికరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న చిన్న వంతెనలు కొద్దిపాటి వర్షానికి మునిగిపోయి రాకపోకలు బంద్ అవుతున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. డబుల్ రోడ్డు మంజూరు చేయకుండా, మండల కేంద్రంలో దుకాణాలను ఎందుకు తొలగించారని వారు ప్రశ్నించారు. సిపిఐ ఆధ్వర్యంలో సింగిల్ రోడ్డు నిర్మాణపను లను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

## కూటమి పాలనలో గిరిజన హక్కులు, చట్టాలకు భంగం వాటిల్లదు

**బాక్సైట్ త్రవ్వకాలకు చంద్రబాబు నాయుడు వ్యతిరేకం -జీఓ నెం.3ని కూటమి ప్రభుత్వం సాధిస్తుంది -తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి - సియ్యారి దొన్ను దొర**

అరకు రూరల్, జూలై 20, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం పాలనలో ఆదివాసీల హక్కులు చట్టాలకు ఎటువంటి భంగం వాటిల్ల దని, జీఓ నెం.3ని తమ ప్రభుత్వం సాధిస్తుందని, బాక్సైట్ త్రవ్వకాలకు చంద్రబాబు నాయుడు వ్యతిరేకమని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగు దేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సియ్యారి దొన్ను దొర స్పష్టం చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల మనోభావాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుం దని, హక్కులు చట్టాలను పరిరక్షిస్తుందని చెప్పారు. కావాలనే వైసిపి కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తుందన్నారు. జీఓ నెం.3ని తీసుకువచ్చింది తెలుగుదేశం పార్టీ అని, అమలు చేసింది కూడా టిడిపి యేనని తెలిపారు. అయితే జీఓ నెంబర్ 3 వైసిపి పాలనలో ఉన్నప్పుడే రద్దయిందని, ఆ సమయంలో వైసీపీ నాయకులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. జీవో నెంబర్ 3 గిరిజనులకు గుండెకాయ వంటిదని అని అన్నారు. జీవో నెంబర్ 3 పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే బాక్సైట్‌ను వెలికి తీయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వైసిపి మాట్లాడుతుందని ఇది ఎంత మాత్రం కరెక్ట్ కాదని అన్నారు. బాక్సైట్‌కు తెర లేపింది నాడు కాంగ్రెస్ పార్టీ అని, నాడు స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నారని చెప్పారు. అదే సమయంలో కొంతమంది యువతకు శిక్షణ కూడా ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆ తర్వాత ఉద్యమం రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారని అన్నారు. గిరిజనుల మనోభావాలను టిడిపి గౌరవిస్తుందని, గిరిజన పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. 1/70 చట్టంపై గిరిజనులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని కూటమి ప్రభుత్వం గిరిజనుల హక్కులు, చట్టాలను పరిరక్షిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ బోరిబోరి లక్ష్మి, టిడిపి నాయకులు శెట్టి బాబురావు, కుమార్, వెంకట్రావు, ద్రౌపతి, అజయ్, రాజు, కిల్లో శ్యాము తదితరులు పాల్గొన్నారు.

## చిన్నజడమూరులో భూ పాస్ పుస్తకాల పంపిణీ

గూడెం కొత్తవీధి, జులై 20,ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూ-హక్కు-భూ-రక్ష' పథకంలో భాగంగా చిన్నజడుమూరు గ్రామంలో రీ -సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో నూతనంగా రూపొందించిన రీ-సర్వే భూ-పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ రైతులు సకాలంలో విచ్చేసి తమ నూతన భూ పాస్ పుస్తకాలను అందుకోవాలని స్థానిక తహసీల్దార్ హెచ్. అన్నజీరావు ఒక ప్రకటనలో కోరారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చుట్టుబందలో పెరిగిన జ్వరాల తీవ్రత..!

**వైద్యశిబిర ఏర్పాటుకై మాజీ పిఎసిఎస్ చైర్మన్ డిమాండ్**

కొయ్యూరు జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని కొండ గోకిరి గ్రామ సచివాలయ పరిధి, కినపర్తి పంచాయతీ, చుట్టుబందలో జ్వరాలు తీవ్రత అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత ఈ సీజన్లో గ్రామంలోని పలువురు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర జ్వరాల బారిన పడినట్టు తెలుస్తోంది. దీనితో గ్రామంలో ప్రత్యేక సానిటేషన్ కార్యక్రమం చేపట్టడంతో పాటు, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు, స్థానిక టిడిపి నేత దుచ్చరి చిట్టిబాబు ఒక ప్రకటనలో కోరారు.




## ఆదివాసీ ఉద్యమకారాలపై కక్ష సాధింపు తగదు

**పోలీస్ విచారణకు హాజరైన ఉద్యమకారులు**

పాడేరు,జూలై20,ప్రభాతవార్త:



జీవో నంబరు-3 రిజర్వేషన్ పునరుద్ధరణ, 1/70 భూబదలాయింపు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలనే డిమాండ్లతో శుక్రవారం పాడేరులో నిర్వహించిన గిరిజనుల ఆందోళన సందర్భంగా అభ్యంతకర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు నాయకులు సోమవారం విచారణ నిమిత్తం పాడేరు పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరిగిన నిరసనలో కొందరు వక్తలు కలెక్టరేట్‌ను బద్ధలు కొడతామని వ్యాఖ్యానించినట్లు పోలీసుల దృష్టికి వచ్చిన నేపథ్యంలో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో నోటీసులు అందుకున్న కొందరు ఆందోళనాకారులు సోమవారం పాడేరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసుల ఎదుట హాజరు కావ డం జరిగింది. వారి నుంచి వివరణలు నమోదు చేసి, సభలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఇతర ఆధారాల ను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. విచారణ పూర్తైన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విచారణకు హాజరైన వారిలో పి.అప్పలనర్స, కూడా రాధాకృష్ణ, కర్జ వైకుమార్, కొర్ర కార్తిక్, వంతల దాస్, కొంట సుధీర్ కుమార్, లోకేష్, కొర్ర రాజశేఖర్ ఉన్నారు.

## దారకొండలో పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి 41 వినతులు

**పాల్గొన్న మండల స్థాయి అధికారులు**

గూడెం కొత్తవీధి,జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని దారకొండ గ్రామ సచివాలయం వద్ద సోమవారం ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజిఆర్ఎస్) కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ప్రజల నుండి వివిధ సమస్య లపై 41 దరఖాస్తులు వచ్చినట్లు మం డల అభివృద్ధి అధికారి రమణబాబు తెలిపారు. మండల స్థాయి అధికారు లు అందరూ పాల్గొన్న ఈ కార్యక్రమం లో అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత గల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

## డ్వాక్రా మహిళలకు ట్రైకర్ రుణాల చెక్‌లు పంపిణీ

**ఏప్రిల్ - జూలై కాలానికి రూ.8.68 కోట్ల రుణాల పంపిణీ**

గూడెం కొత్తవీధి, జూలై 20, ప్రభాతవార్త

మండలంలోని డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధే ధ్యేయంగా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ పేర్కొన్నారు. జీ.కే వీధి మండల కేంద్రంలోని స్థానిక 'వెలుగు' కార్యాలయంలో 2026 ఆర్థిక సంవత్సరానికి గాను (ఏప్రిల్ నుండి జూలై వరకు) వివిధ పథకాల కింద మంజూరైన రుణాలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా స్థిరపడినప్పుడే కుటుంబాలు ఆనందంగా ఉంటాయని,ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

**భారీగా రుణాల గ్రౌండింగ్ ..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మండలంలో రికార్డు స్థాయిలో రుణాలను అందజేసినట్లు వెలుగు అధికారులు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**ట్రైకర్ రుణాలు..**

మండలంలోని 99 మంది గిరిజన మహిళలకు రూ.99 లక్షల విలువైన రుణాలను అందజేశారు.

**శ్రీనిధి రుణాలు ..**

86 పొదుపు సంఘాలకు చెందిన 164 మంది మహిళా సభ్యులకు రూ.1 కోటి 5 లక్షల నిధులను గ్రౌండింగ్ చేశారు.

**బ్యాంక్ లింకేజీ..**

అత్యధికంగా 56 సంఘాల్లోని 574 మంది సభ్యులకు రూ.6 కోట్ల 64 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజీ రుణాలను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, జీ.కే వీధి మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ఎంపీటీసీలు నాగమణి, రీమల రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ గంట నలిని, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్, జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, కూటమి నాయకులు బోండ్ల చిరంజీవి, కళ్యాణి, వెలుగు సిబ్బంది, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలతో కిరికిరి.. వైసీపీ ద్వంద్వ వైఖరి..!

**గిరిజన సంఘాల ఉద్యమ క్రెడిట్ వైసీపీ చోరీ.. జిసిసి మాజీ చైర్మన్, టీడీపీనేత ఎంవివి ధ్వజం**

కొయ్యూరు, జూలై 20, ప్రభాతవార్త



1/70, జీవో నెంబర్ 3 వంటి గిరిజన చట్టాల పరిరక్షణపై వైసీపీ నేతలు ద్వంద్వ వైఖరి నటిస్తూ, అసత్య ప్రచారాలు చేస్తూ, ఈ హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేస్తున్న వివిధ గిరిజన సంఘాల క్రెడిట్ ను వైసీపీ నేతలు చోరీ చేసే యత్నం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ -1/70 గిరిజనుల హక్కులు, గిరిజన యువత ఉద్యోగాల అంశమని,రాజకీయ విమర్శలకు, చౌకబారు ఆరోపణలకు సంబంధించినది కాదన్నారు.ఇది వేలాది గిరిజన కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత సున్నితమైన అంశమన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించడం, చరిత్రను వక్రీకరించడం ఏ రాజకీయ పార్టీకి తగదన్నారు. నేడు వైసీపీ నేతలంతా టీడీపీపై నిరాధార ఆరోపణలు చేస్తూ, ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారికి చరిత్ర తెలియకపోతే తెలుసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రక్షణ కల్పించాలనే దృఢ సంకల్పంతో 1986 నవంబర్ 5న స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రభుత్వం జీవో నెంబర్ 275ను తీసుకొచ్చిందన్నారు.గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల్లో ఇది ఒకటన్నారు. అనంతరం అమలులో తలెత్తిన చట్టపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని, 2000 సంవత్సరంలో అప్పటి సీఎం శ చంద్రబాబు ప్రభుత్వం జీవో నెంబర్ 3ను అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో స్థానిక గిరిజనుల ఉద్యోగ హక్కులను మరింత బలోపేతం చేయడమే ఈ జీవో ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అయితే ఈ జీవోపై న్యాయపరమైన వివాదాలు కొనసాగి, చివరకు 2020 ఏప్రిల్ 22న భారత సుప్రీంకోర్టు షెడ్యూల్డ్ ఏరియాల్లో 100 శాతం రిజర్వేషన్ రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ ఈ జీవో అమలును రద్దు చేసిందన్నారు. 2020లో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తర్వాత గత వైసీపీ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉందని, ఆ సమయంలో గిరిజన యువత ఉద్యోగ హక్కులను రక్షించేందుకు రాజ్యాంగబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి ఎలాంటి స్పష్టమైన ఫలితాన్ని సాధించింది? కేంద్ర ప్రభుత్వంతో ఎన్ని దఫాలు చర్చలు జరిపింది? గిరిజనులకు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి ఎలాంటి చట్టపరమైన చర్యలు చేపట్టింది? ప్రస్తుత వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేని వారు, నేడు అధికారాన్ని కోల్పోయిన తర్వాత గిరిజనుల పేరుతో టీడీపీ పై విమర్శలు చేయడం రాజకీయ అవకాశవాదమే నన్నారు.ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులు, రాజ్యాంగ నిపుణులు, గిరిజన మేధావులు, గిరిజన పెద్దలు, సంబంధిత వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసిందన్నారు. గిరిజన పెద్దలు, గిరిజన మేధావుల పోరాటానికి తాము మద్దతు ప్రకటిస్తున్నామని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, అయితే వైసిపి నేతల క్రెడిట్ చోరీకి మాత్రం వ్యతిరేకం అన్నారు. కార్యక్రమంలో టిడిపి గిరిజన నేతలు దుచ్చరి చిట్టిబాబు, లోతాభిమరాజు, కాకూరు చంద్రరావు, శ్యామల వరలక్ష్మి, కురుజు శ్రీనుబాబు, మాకాడ బూర్గులయ్య, మాకాడ బాలరాజు, సురబోయిన చిన్ని, శ్రీరాములు, పీట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ఏటికొప్పాక లక్క బొమ్మల వాటి ప్రాముఖ్యత విద్యార్థినులకు తెలిసే విధంగా ప్రత్యేక కార్యక్రమం.. పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్**

ఎలమంచిలి, జూలై 20, ప్రభాతవార్త:



పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాజ్యాంగ ఇస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నయ్యకి ప్రత్యేక గాంచిన ఏటి కొప్పాక బొమ్మలను విద్యార్థులకు పంపిణీ చేసి వాటి ప్రత్యేకత, సాంస్కృతిక ప్రాధాన్యత వినియోగం గురించి వివరించారు. ఏటికొప్పాక లక్క బొమ్మలు తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు లక్క బొమ్మల కళాకారులు ఇచ్చే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ విద్యార్థులతో ప్రపంచంలోనే ఏటికొప్పాక లక్క బొమ్మలు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత ఎకరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలలోని ఏర్పాటు చేసిన ఆర్ ఓ త్రాగునీటి ప్లాంటును ప్రారంభించారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నాణ్యతను, పరిశుభ్రతను వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఆహారం స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజాన శేషు, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు బోద్దపు శ్రీనివాసరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అన్నం బాబ్జి, జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ, లాలం సోమినాయుడు, మండల విద్యాశాఖ అధికారులు సూర్య ప్రకాష్, అరుణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఫైన్ ఏమో సామాన్యుడికి.. ట్రీ కటింగ్ సర్కారుకి!

**యలమంచిలి మున్సిపాలిటీ డబుల్ స్టాండర్డ్స్.. గాలికి ఎమ్మెల్యే 'పునర్వనం' ఆశయం**

ఎలమంచిలి, జూలై 20, ప్రభాతవార్త



వేదిక లెక్కితే పర్యావరణ పరిరక్షణ ,మైకు పట్టుకుంటే పచ్చదనం పెంపు ఇదీ మున్సిపల్ అధికారుల తీరు. కానీ గ్రౌండ్ లెవెల్లో యాక్షన్ మాత్రం ఇందుకు పూర్తి రివర్స్. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ వీధిలో, అలివేలుమంగ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద కాలువ తవ్వకం పనుల సాకుతో దశాబ్దాలుగా నీడనిస్తున్న రెండు మూడు భారీ వృక్షాలను అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికేయడం ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్ గా మారింది. వేసవిలో పాదచారులకు, విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలిగించిన ఆ మహా వృక్షాలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. అభివృద్ధి పనుల పేరిట విచక్షణారహితంగా పచ్చదనాన్ని బలితీసుకోవడం ఎంత వరకు సమంజసం అని జనం ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీలో చర్యలు సామాన్యులకేనా, సర్కారు పనులకు వర్తించవా అన్నది ఇప్పుడు సగటు పౌరుడి సూటి ప్రశ్న. ఎందుకంటే.. ఎవరైనా సామాన్యుడు తన సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి అడ్డుగా ఉన్న ఒక్క చెట్టు కొమ్మ నరకాలన్నా మున్సిపాలిటీకి అప్లికేషన్ పెట్టుకోవాలి. నిబంధనల పేరుతో ఐదు వేల నుంచి పది వేల రూపాయల వరకు ఫైన్లు కట్టించుకునే మున్సిపల్ సిబ్బంది. అదే వాళ్ల పనుల కోసం మాత్రం ఎలాంటి పట్టింపూ లేకుండా ఏళ్ల నాటి వృక్షాలను పట్టపగలే నరికేశారు. వీటికి వాల్టా చట్టం కింద అటవీ లేదా రెవెన్యూ శాఖల నుంచి పర్మిషన్ ఎవరు ఇచ్చారో తెలియని పరిస్థితి. సామాన్యుడిపై ప్రతాపం చూపించే యంత్రాంగం, తమదాకా వచ్చేసరికి చట్టాలను పక్కన పెట్టేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు, ఇలాంటి విపత్కర పరిస్థితులను నివారించడానికే స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఇటీవల 'పునర్వనం' అనే బృహత్తర కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చారు. అభివృద్ధి పనుల వల్ల చెట్లను తొలగించాల్సి వస్తే, వాటిని నరకకుండా ట్రాన్స్ లొకేషన్ పద్ధతిలో వేర్లతో సహా జాగ్రత్తగా పెకిలించి సురక్షితంగా వేరే చోట నాటడమే ఈ పునర్వనం ఉద్దేశం. స్వయంగా ఎమ్మెల్యే ఇంత మంచి కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలుస్తుంటే, మున్సిపల్ అధికారులు మాత్రం దాన్ని ఇక్కడ ఎందుకు గాలికొదిలేశారన్నది అసలు ప్రశ్న. ఎమ్మెల్యే విజన్ ఒకటైతే.. అధికారుల యాక్షన్ మరొకటి అన్నట్లుగా ఇక్కడి పరిస్థితి తయారైంది. ఎమ్మెల్యే ఆశయానికి తూట్లు పొడుస్తూ, ఆ చెట్లను సురక్షితంగా వేరే చోట నాటడానికి బదులుగా ఇలా నరికేయడానికి కింది స్థాయి అధికారులకు ఎలా ధైర్యం వచ్చింది? నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాల్సిన యంత్రాంగమే పర్యావరణ విధ్వంసానికి పాల్పడటం 'రక్షకుడే భక్షకుడిగా మారిన' చందంగా తయారైంది. కాలువలు, డ్రైనేజీలు నిర్మించడం మౌలిక సదుపాయాల అభివృద్ధికి సూచికే కావచ్చు, కానీ ప్రకృతిని నాశనం చేస్తూ పోతే అది రాబోయే రోజుల్లో ప్రమాదకరం. స్థానికంగా ఇంత జరుగుతున్నా సంబంధిత ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం విచారకరం. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, జిల్లా ఉన్నతాధికారులు ఈ ఘటనపై తక్షణం స్పందించి, ఎవరి అనుమతితో ఈ చెట్లను నరికారో, సామాన్యుల వద్ద వసూలు చేసినట్లే వాల్టా చట్టం ఉల్లంఘించినందుకు ఈ చర్యకు పాల్పడిన వారిపై ఫైన్లు వేసి, యాక్షన్ తీసుకోవాలి. అప్పుడే చట్టం ముందు అందరూ సమానమే అన్న భావన ప్రజలలో కలుగుతుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కసింకోట ఆర్ఈ సిఎస్ పాలిటెక్నిక్ కాలేజీలో కౌన్సిలింగ్‌కు హాజరైన వినియోగదారుల పిల్లలు

కసింకోట, జూలై 20, ప్రభాతవార్త



కశింకోట ఆర్.ఈ.సి.ఎస్. కసింకోట ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కాలేజీలో అడ్మిషన్ కొరకు జరిగిన కౌన్సిలింగ్‌లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలలో అన్ని అడ్మిషన్లు నింపబడ్డాయి అని, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో కొన్ని అడ్మిషన్లు ఖాళీ ఉన్నాయని, 120 సీట్లకు 102 సీట్లు పూరింపబడ్డాయి అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. ఉమా శంకర్ తెలియ చేశారు. ఈ కౌన్సిలింగ్ కు స్పెషల్ ఆఫీసర్‌గా అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐవిఎస్ ఎస్.శ్రీనివాసరావు, తనిఖీ అధికారులుగా లెక్చరర్లు సురేష్ , రంగారాజ్ హాజరయ్యారు. కౌన్సిలింగ్‌లో అసోసియేట్ ప్రిన్సిపాల్ కె. శివ, విభాగాధిపతులు గణేష్, రమణ కుమార్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచదార్ల కొండను మైనింగ్ దందా నుండి కాపాడుకోవాలి

**కొండ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి -వైసిపి ఆధ్వర్యంలో నేడు చలో పంచదార్ల**

అనకాపల్లి, జూలై 20,ప్రభాతవార్త



గడిచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వంలో కొండలను పిండి చేసి కనిజ సంపదను దోచుకుంటూ మైనింగ్ దందా చేస్తున్నారని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆరోపించారు. సోమవారం స్థానిక రింగ్ రోడ్డులో ఉన్న వైసిపి కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకే ప్రసిద్ధి చెందిన పంచ దార్ల పుణ్యక్షేత్రం ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి కొండను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అనుచరులు మైనింగ్ మాఫియా ధ్వంసం చేసి కోట్లాది రూపాయల ఖనిజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ కొండకు మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ఎంపీ సీఎం రమేష్ ఇద్దరూ పెద్ద అనకొండ లా తయారై కొండలను పిండి చేసి అక్రమ మైనింగ్ దందా చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. కూటమి ప్రభుత్వం మైనింగ్ దందాకు వ్యతిరేకంగా నేడు వైసిపి ఆధ్వర్యంలో చలో పంచ దార్ల అనే నిరసన కార్యక్రమం ద్వారా స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయం నుండి ఉమ్మడి విశాఖ జిల్లా నుండి వైసీపీ మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని భారీ ర్యాలీతో పంచ దార్ల ప్రాంతానికి చేరుకొని నిరసన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్, జాజుల రమేష్, గొర్లి సూరిబాబు, కె ఎం నాయుడు, బొడ్డేడ శివ, దంతులూరి శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## చోడవరం ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

చోడవరం, జూలై 20, ప్రభాతవార్త



చోడవరం టౌన్‌లో గల ఇంటర్మీడియట్ ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కెఎస్ ఎన్ రాజు సందర్శించి, విద్యార్థినులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థినులకు దుప్పట్లు, తలగడలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థినుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు టిడిపి పట్టణ అధ్యక్షులు చిన్న, హాస్పిటల్ కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, డైరెక్టర్ పప్పు శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లిబాబు, యువ నాయకుడు నౌడు సుధాకర్, టిడిపి సీనియర్ నాయకుడు గొర్ల సుధాకర్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కసింకోట, జూలై 20, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపాలెం నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ ఎదురుగా గల జాతీయ రహదారి పై సుమారు 45 సంవత్సరాలు వయసుగల గుర్తు తెలియని మృతదేహం సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో లభ్యమైనట్లు కసంకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. మృతుడు ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడనీ, ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా అతని కుటుంబ సభ్యులు/బంధువుల గురించి సమాచారం తెలిసినట్లయితే వెంటనే 944079 6088, 7780620619 నంబర్లకు సమాచారం అందించాలని సిఐ స్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు.

## శ్రీవామన అవతారంలో జగన్నాథుడు

కశింకోట, జూలై 29, ప్రభాతవార్త



మండల కేంద్రమైన కసింకోటలో శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో గల శ్రీ జగన్నాథ స్వామి వారు సోమవారం శ్రీవామన అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. రేజేటి రామాచార్యులు, రేజేటి కన్నబాబు, రేజేటి మారుతి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపారు.

## అన్ని రంగంలోని ఆదర్శవంతమైన నగరంగా అనకాపల్లిని తీర్చిదిద్దాలి

**సమగ్ర అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే కొణతాల**

అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త



మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, జోనల్ కమిషనర్ కె చక్రవర్తి ఇతర ఉన్నతాధికారులతో అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనకాపల్లి సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా అనకాపల్లి పరిధిలో కొప్పాక, వాటర్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సుమారు 5 కోట్ల నిధులతో పంప్ హౌస్ శంకుస్థాపన కార్యక్రమాల గురించి చర్చించారు. దీని ద్వారా అనకాపల్లి పట్టణానికి రోజుకు 500 గ్యాలన్ల సామర్థ్యంతో తాగునీటి సరఫరా, జరుగుతుందని తెలియజేశారు. వల్లూరు రాజుపాలెం గ్రామాల్లో తాగు నీరు, రోడ్ల సమస్యల పరిష్కారం, ప్రజా పనులకు ప్రాధాన్యత, రహదారుల అభివృద్ధి, ఏపీఐఐసీ జోన్‌కు నీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను సమీక్షించారు. ముఖ్యమైన ప్రతిపాదనలుగా డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు నాలుగు అంశాలపై సమగ్ర చర్చించారు. రింగ్ రోడ్ సైకిల్ ట్రాక్ అభివృద్ధి, జిల్లా కేంద్రంగా అనకాపల్లి అభివృద్ధి, నగర సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, వైజాగ్-అనకాపల్లి రింగ్ రోడ్ పార్క్ అభివృద్ధి, సుందరీకరణ, ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి తద్వారా రెవెన్యూ జనరేషన్ పెంపు, తక్కువ పెట్టుబడితో అధిక స్థాయిలో సుందరీకరణ చేపట్టే ప్రణాళికలపై అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అనకాపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను వేగంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కొణతాల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఎస్ఈ (ప్రాజెక్ట్) ఏడుకొండలు, జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ (వాటర్ సప్లై) శేఖర్, ఈఈ గోపాలకృష్ణ, జోనల్ కమిషనర్ (జీసీఎంసీ) చక్రవర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వామన అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త



గవరపాలెం అగ్రిమరిచెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవ భాగంగా గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజ్యు మమ్మ హాలు వద్ద కొలువైన సుభద్రా బరభద్ర జగన్నాథ స్వామి వారు సోమవారం భక్తులకు వామనా వతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా బంకుపల్లి శ్రీరాములు సీతాలక్ష్మి దంపతులు, బొడ్డేడ యేగేష్ ఆలయ మండపంలో భక్తి సుధా బృందం వారిచే పారాయణం, శ్రీ వాసుదేవ అన్నమయ్య సంకీర్తనలు, నీలాంటి వెంకట గణపతి ఆధ్వర్యంలో జానపద కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ఆలయ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కె చంద్రతేజ, ఆలయ కమిటీ ధర్మకర్తలు. బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి -ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత :జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్**

అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త



పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ డిఆర్ఓ వై సత్యనారాయణరావులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రి కల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ ఆర్టీసీ, డ్వామ, తాగునీరు శాఖలకు సంబం ధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికా రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 158 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్‌కు 191 వినతులు, మొత్తం 349 అందాయి. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఉన్నారు.

## నరసింహ అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

చోడవరం, జూలై 20, ప్రభాతవార్త



జగన్నాథ స్వామి వారి రథోత్సవంలో భాగంగా స్వామివారు పది రోజులపాటు దశావతారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. దానిలో భాగంగా సోమవారం స్వామివారు నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నరసింహ జగన్నాధుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నేడు విద్యుత్ సౌకర్యానికి అంతరాయం

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్ డి ఎస్ ఎస్ పనులు నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడనున్నదని ఇ ఈ ఎస్ రామకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా వేంపాడు, డియల్ పురం, నెల్లిపూడి, గునుపూడి ప్రాంతాలకు వర్తిస్తుందని పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థులకు అభినందనలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



జిల్లాస్థాయిలో షైనింగ్ స్టార్స్ అవార్డు లను అందుకున్న నక్కపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో అభినందించారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ సూపర్ యాప్ ప్రారంభించిన వైకాపా రాష్ట్ర నేత 'వీసం'

నక్కపల్లి, ప్రభాతవార్త



వైస్సార్సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలు కోసం ప్రవేశ పెట్టిన జగన్ 2.0 సూపర్ యాప్ ను రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ చేతుల మీదుగా సోమవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవింద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, అల్లాడ కొండ బాబు, ముద్ద శ్రీను, రాజయ్యపేట సూరిబాబు తదితరులు ఉన్నారు.




## ప్రతిభా పురస్కారం అందుకున్న గింజల మేఘసందేశ్

(నక్కపల్లి, ప్రభాతవార్త)



నక్కపల్లి మండలం డి ఎల్ పురం గ్రామానికి చెందిన గింజాల మేఘసందేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డి.కే.బాలాజీ చేతుల మీదుగా ఆయనకు మెరిట్ సర్టిఫికేట్, గోల్డ్ మెడల్, రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర ప్రభుత్వం మేఘసందేశ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసిన విషయం తెలిసినదే.! అవార్డు తీసుకున్న మేఘసందేశ్ తన విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, తనను అన్ని విధాల ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రతిభ అవార్డుతో సత్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పెన్‌డౌన్‌లో దస్తావేజు లేఖులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు దస్తావేజుల తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ



జీవో నెంబర్ 396ను వ్యతిరే కిస్తూ ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపుమేరకు నక్కపల్లి దస్తావేజులేఖరులు సోమవారం పెన్ డౌన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మద్దతు పలికిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, మండల పరిషత్ అదనపు వెలగ ఈశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడేటి శంకర్ దస్తావేజులేఖరులకు సంఘీ భావం మొదటి రోజు సమ్మె కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారితో కలిసి స్థానిక సబ్ రిజిస్టర్‌కి వినతిపత్రం అందజేశారు. నక్కపల్లి దస్తావేజులేఖరుల సంఘం అధ్యక్షులు దాతారం మురళీకృష్ణ, గౌరవ అధ్యక్షులు కొంగర చిన్న కృష్ణమూర్తి, సంఘ సభ్యులు బత్తుల శ్రీను, ఎన్వి రమణ, జి .నూకరాజు, వెంకట్, తేజ, ముద్దా బాబ్జి, త్రినాథ్, లోవ రత్నం, రాంబాబు, బాబ్జి, వెలగా ఉపేంద్ర, లోకేష్ ,రమేష్, గోవిందు, కన్నబాబు తదితరులు ఉన్నారు.

## మట్టి త్రవ్వకాలు ఆపండి.. రహదారులు పాడవుతున్నాయి.. తహశీల్దార్‌కు వినతి

నక్కపల్లి, ప్రభాతవార్త



ఇటుక బట్టీలకు రాగలచెరువు నుంచి జెసిబి లతో త్రవ్వి అధిక లోడు గలిగిన లారీలతోమట్టి తోలడం వలన నూతనంగా నిర్మించిన మండలంలోని దేవవరం శివారు చిన్న రాంబద్రపురం రోడ్డు పూర్తిస్థాయిలో దెబ్బతింటుందని ఆ గ్రామానికి చెందిన పలువురు తాసిల్దార్‌తో పాటు ఎంపీడీవో చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గ్రామానికి చెందిన ఎస్వీ రమణ, ఎస్. వెంకట రమణ, ఎస్.రాము ,అప్పారావు, చంటిబాబు దొరబాబు, వెంకటలక్ష్మి తదితరులు వారిని కలిసి తక్షణమే మట్టి తవ్వకాలు ఆపాలని వినతి పత్రంలో కోరారు. గ్రామానికి చెందిన ఎస్.అప్పారావు అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కే .అప్పలరాజు సహాయంతో ఈ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని, రాత్రులు సమయంలో ఈ మట్టి తవ్వకాలు వలన గ్రామంలో ఇబ్బందులు ఎదురవడమే కాకుండా రహదారి పాడవుతుందని, తక్షణమే ఈ మట్టి త్రవ్వకాలు ఆపాలని ఆ వినతి పత్రంలో వారిని కోరారు. స్పందించిన అధికారులు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## పంట పొలాల్లోకి రహదారి సౌకర్యం కల్పించండి.. రైతులు వినతి

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



పరిశ్రమల కారణంగా మండలంలోని కాగిత గ్రామాన్ని ఆనుకొని నిర్మించిన ప్రత్యేక రహదారి విషయంలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు అనువైన రహదారి మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లలితకు గ్రామానికి చెందిన రైతులు గుమ్మెళ్ళ గోవిందరావు, జమీలు, పోతంశెట్టి వరప్రసాద్, వీరబాబులు కోరారు. పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## 'హరిత విశాఖ-50 పార్కుల మిషన్'కు శ్రీకారం

**రూ.21.97 కోట్లతో తొలి దశలో 47 ఆధునిక పార్కులు.. -ప్రజలకు మరిన్ని హరిత విహార కేంద్రాలు**

విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త



విశాఖ నగరాన్ని మరింత హరితమయం చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు జీవీఎంసీ 'హరిత విశాఖ-50 పార్కుల మిషన్'కు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు నగరంలో మొత్తం 50 ఆధునిక పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. మొదటి దశలో ఇప్పటికే 47 ఓపెన్ స్పేస్‌లను గుర్తించి రూ.21.97 కోట్ల వ్యయంతో పార్కుల అభివృద్ధి చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందులో భీమిలి జోన్‌లో 7, మధురవాడ జోన్‌లో 20, గాజువాక జోన్‌లో 20 పార్కులు అభివృద్ధి చేయనున్నారు. మిగిలిన మూడు పార్కులకు కూడా త్వరలో స్థలాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ పార్కుల్లో ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ఆట పరికరాలు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక విశ్రాంతి వేదికలు, పచ్చిక బయళ్లు, ల్యాండ్‌స్కేపింగ్, అలంకార మొక్కలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, బెంచీలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ హరిత పార్కుల ద్వారా నగరంలో పచ్చదనం పెరగడంతో పాటు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణకు దోహదం చేయడంతో పాటు ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కుటుంబాలు, చిన్నారులు, వృద్ధులకు ఆహ్లాదకరమైన విహార కేంద్రాలుగా ఇవి ఉపయోగపడతాయని అన్నారు. "గ్రీన్--హెల్తీ--లైవబుల్ విశాఖ" లక్ష్యంతో చేపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు.

## సింహాచలం గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

**పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై జీవీఎంసీ ప్రత్యేక దృష్టి**

విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :



ఈ నెల 28న జరగనున్న సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణను విజయవంతంగా నిర్వహించేందుకు జీవీఎంసీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ నిర్వహణతో పాటు ప్లాస్టిక్ రహిత గిరి ప్రదక్షిణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నివాసిత సంక్షేమ సంఘాలు, హోటల్ యాజమాన్యాలు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. గిరి ప్రదక్షిణ రోజున మార్గమంతా భక్తులతో కిక్కిరిసిపోతుందని, అందువల్ల ఆ మార్గంలో వాహనాల రాకపోకలు ఉండవని ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణను పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రసాదం, అన్నదానం చేసే నిర్వాహకులు పర్యావరణహిత వస్తువులనే వినియోగించాలని, ప్రతి కేంద్రంలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను మోహరించనున్నట్లు వెల్లడించారు. హోటళ్లు, లాడ్జీలు, వాణిజ్య సంస్థలు తమ వద్దకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఆంక్షలపై ముందస్తు సమాచారం ఇవ్వాలని, పరిశుభ్రత చర్యల్లో జీవీఎంసీకి సహకరించాలని పిలుపునిచ్చారు. గిరి ప్రదక్షిణ విజయవంతానికి ప్రభుత్వ శాఖలు, ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా సహకరించాలని అదనపు కమిషనర్ పి. నల్లనయ్య విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన

**ఆనందపురం, జూలై 21, ప్రభాతవార్త:**



ఇటీవల ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీస్ లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారులపై ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై నార్త్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చి. ఉమాకాంత్, ట్రాఫిక్ ఎస్ఐ పి. పాపారావు సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా దుక్కవానిపాలెం టోల్ ప్లాజా వద్ద 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అదే సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చి. ఉమాకాంత్ మాట్లాడుతూ, రహదారి భద్రత ప్రతి వాహనదారుడి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులో కూడా నిరంతర తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## నార్త్ జోన్ పీజీఆర్ఎస్ కు 9 ఫిర్యాదులు

**మాధవధార, జూలై 20, ప్రభాతవార్త:**



మాధవధార ఉడా కాలనిలో గల జీవీఎంసీ నార్త్ జోన్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ ఎస్‌కు 9 వినతులు వచ్చాయి.ఈ వినతులను జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము పరిశీలించి లబ్ది దారులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని వినతులు స్వీకరించారు.వీటిలో యూసిడి-4, టౌన్ ప్లానింగ్-2, రెవిన్యూ-2, ఇంజనీరింగ్-1 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్ ఈఈ పద్మావతి, ఏపీడీ పుణ్యవతి,ఆర్ ఓ బాబూరావు, పబ్లిక్ హెల్త్ అధికారులు ఉన్నారు.

## మొలకెత్తిన విత్తనాల బంతులు చూస్తే ఆనందం వెల్లివిరిసింది

### విద్యార్థుల కృషితో విత్తనాల బంతులు తయారీ

### వి ఎం ఆర్ డి ఎ, ఎఫ్ఆర్ఓ పి. శిరీష

**విశాఖపట్నం, జూలై 20 ప్రభాత వార్త :**



మొలకెత్తిన విత్తనాల బంతులను చూస్తే ఆనందం వెల్లివిరిసింది అని విఎంఆర్‌డిఎ, ఎఫ్ఆర్ఒ, పి.శిరీష పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో మొలకెత్తి న విత్తనాల బంతులు గురించి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడా రు. విద్యార్థుల కృషి తో విత్తనాల బంతులు తయారవ్వడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ ఒక వంద విత్తనాల బంతులు తయారు చేస్తే పర్యావర ణానికి ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ విత్తనాల బంతులు తయారు చేయడం పది వేల సంవత్సరాల క్రితం అప్పటి మానవులు చేసిన కృషి అని వివరించారు. ఏనుగు లద్దె నుండి మొక్కలు రావడం చూసి ఆ విధానంతో విత్తనాల బంతులు తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఊర్మిళ, బయాలజీ లెక్చరర్ లక్ష్మీ దుర్గ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు మాట్లాడారు.

## వంటిల్లు కూడలికి నూతన సొబగులు :త్వరలో ఫౌంటెన్ ప్రారంభం

**గాజువాక, జూలై 20, ప్రభాతవార్త:**



గాజువాక నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా స్థానిక వంటిల్లు కూడలి సరికొత్త రూపు సంతరించుకుంది. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ, సూచనలతో జీవీఎంసీ అధికారులు ఇక్కడ అత్యాధునిక ఫౌంటెన్ (నీటి బుగ్గ)ను ఏర్పాటు చేశారు. ప్రారంభానికి ముందే ఈ ఫౌంటెన్ స్థానికులను ఎంతగానో కట్టిపడేస్తోంది. ఈ ఆధునీకరణ పనుల్లో భాగంగా సోమవారం సాయంత్రం జీవీఎంసీ ఎస్ఈ రాయల్ బాబు, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ వినోద్‌లు పనులను పర్యవేక్షించి, ఫౌంటెన్ ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ట్రయల్ రన్ సమయంలో రంగురంగుల విద్యుత్ దీప కాంతుల నడుమ జిగేల్ మంటూ చిమ్మిన నీటి ధారలను చూసి స్థానికులు, వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. అన్ని హంగులతో సిద్ధమైన ఈ నూతన ఫౌంటెన్‌ను త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

## గాజువాకలో ముగ్గురు విద్యార్థుల అదృశ్యం

**గాజువాక, జూలై 20, ప్రభాతవార్త :**



గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాజువాక సి.ఐ.వాసు నాయుడు కథనం ప్రకారం. గాజువాక ప్రాంతానికి చెందిన హర్షిత్ (16), రోహన్ (14), సాహిల్ (12) అనే ముగ్గురు బాలురు గత ఆదివారం ఉదయం ఇళ్ల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పెద్దవాడైన హర్షిత్ స్థానిక గాయత్రి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుం డగా, రోహన్ తొమ్మిదో తరగతి, సాహిల్ ఐదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ పాత గాజువాక కృష్ణమందిరం వెనుక ఉన్న శ్రీనివాస పాఠశాల విద్యార్థులు. కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రి వీరిని వదిలి వెళ్లగా, తల్లి సోలాపూర్‌లో ఉంటున్నారు. ఇటీవల వీరి మామ వచ్చి వీరికి ఒక ఫోన్ ఇచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం నుంచి పిల్లలు కనిపిం చకపోవడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం ఆలస్యంగా అందినప్పటికీ పోలీసులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేశారు. బాలుర ఆచూకీ కోసం ప్రత్యేక విచారణ బృందాలను రంగంలోకి దించినట్లు, త్వరలోనే వారిని సురక్షితంగా పట్టుకుని బంధువులకు అప్పగిస్తామని గాజువాక సి ఐ వాసు నాయుడు తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బాధ్యతల స్వీకరణ

**విశాఖపట్నం, జూలై 20 ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ విజాగ్ డైమండ్స్ 5వ ఇన్‌స్టాలేషన్ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రోటరీ సంవత్సరానికి (2026-27) నూతన అధ్యక్షుడిగా రొటేరియన్ కె. మారుతీ, కార్యదర్శిగా ఎం. శివకుమార్ మరియు ట్రెజర్. గౌతమ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రొటేరియన్ గుత్తికొండ శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ డా. ఎం. సంజయ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ శోభన్ ప్రకాష్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకలో అసిస్టెంట్ గవర్నర్ నీరజ, ఇమ్మీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ కామేశ్వరరావు, కెప్టెన్ ఆర్.ఎస్. కాళీ ప్రసాద్, రాంబాబు, క్లబ్ సభ్యులు, పలువురు రొటేరియన్లు విశిష్ట అతిథులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గానికి పలువురు రొటేరియన్లు, అతిథులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దబ్బంద టిడ్కో లబ్ధిదారుల రుణాలు మాఫీ చేయాలి

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాత వార్త:**



- జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

దబ్బంద టిడ్కో గృహాల లబ్ధిదారులపై ఉన్న బ్యాంకు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జగదాంబ జంక్షన్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, దబ్బంద టిడ్కో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భాను ప్రదీప్ మాట్లాడుతూ, టిడ్కో గృహాల కోసం లబ్ధిదారుల నుంచి రూ.50 వేల వరకు డిపాజిట్ వసూలు చేసి, అనంతరం బ్యాంకు రుణాలపై వడ్డీతో పాటు వడ్డీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఒక్కో లబ్ధిదారుడు సుమారు రూ.90 వేల వరకు చెల్లించినప్పటికీ, ఇప్పుడు ఈఎంఐలు చెల్లించకపోతే ఇళ్లను జప్తు చేసి వేలం వేస్తామని బ్యాంకులు హెచ్చరిస్తున్నాయని అన్నారు. గృహాల కేటాయింపు సమయంలో పాఠశాలలు, పార్కులు, ఆరోగ్య కేంద్రం, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇప్పటికీ వాటిలో ఏ ఒక్కటీ పూర్తిగా అందుబాటులోకి రాలేదని విమర్శించారు. మౌలిక వసతుల లేమితో ఒకవైపు ఇళ్లలో నివసించలేక, మరోవైపు అద్దె ఇళ్లలో ఉంటూ బ్యాంకు ఈఎంఐలు చెల్లించాల్సిన పరిస్థితితో పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దబ్బంద నుంచి నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని తక్షణమే కల్పించాలని కూడా వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి. ఈశ్వర్, రమణమ్మ, జయశ్రీ, పి. శ్రీనివాసరావు, పద్మావతి, ఎం. మన్మధరావు, సీహెచ్. కాసుబాబు, ఏ. దేవుడమ్మ, కె. కొమర, సందీప్ కుమార్, బి. పుష్పలత, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 301 ఫిర్యాదులు

### ఫిర్యాదులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

### అర్జీలు స్వీకరించిన డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, డిప్యూటీ కలెక్టరు

**విశాఖపట్నం, జూలై 20 ప్రభాత వార్త :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుండి అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం .విశ్వేశ్వర నాయుడు అన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి మొత్తం 301 ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన పిటిషన్లను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడు, డిప్యూటీ కలెక్టర్లు టి.గోవిందు, ఏడీసీ సత్యవేణి స్వీకరించి సంబంధిత శాఖల వారీగా నమోదు చేసి పరిష్కారానికి పంపిం చారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి విస్వేశ్వర నాయుడు మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను 24 గంటలలోగా ఆన్లైన్ లో పరిశీలించాలని, త్వరిత గతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నా రు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో క్యూఆర్ కోడ్‌ను డిస్ప్లే చేయాలన్నారు. ఫిర్యా దులలో అత్యధికంగా ఇతర శాఖలకు సంబం ధించిన 143 ఫిర్యాదులు నమోద య్యాయి. జీవీఎంసీకి సంబంధించి 75, రెవెన్యూ శాఖకు 49, పోలీస్ శాఖకు 34 పిటిషన్లు అందాయి. అన్ని విభాగాల అధికారులు హాజరై ఫిర్యాదు లను నమోదు చేసుకున్నారు.

## ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఎస్సి, ఎస్టీ, బిసి లకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

### పిజీఆర్ఎస్ లో బీజేపీ జనతా వారధి నేతల వినతి

**విశాఖపట్నం, జూలై 20 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జన తా వారిదిలో భాగంగా విశాఖ జిల్లా అధ్యక్షులు ఎంఎంఎన్. పరుశురామరాజు సోమవారం కలెక్టర్ కార్యా లయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పాల్గొని పలు ప్రజా సమస్యలకు సంబందించిన వినతులను సమర్పించారు. వాటితో పాటు ఈ వారం రాష్ట్ర సమస్యగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పా టు చేస్తున్న ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలకు భాగస్వామ్య, ఉద్యో గ, ఉపాధి అవకాశాలు కల్పిం చాలని వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ కార్య క్రమంలో జనతా వారధి కన్వీనర్ పొలిమేర శ్రీనివాస్, కో కన్వీనర్ వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దానేష్ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు ఎం.రవికుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు విజయ చంద్రుడు, కిసాన్ మోర్చా అధ్యక్షులు కృష్ణారావు, స్టేట్ మీడియా కో కన్వీనర్ డిఎస్ వర్మ, జిల్లా మీడియా కన్వీనర్ టీ.కోటేశ్వరరావులతో పాటు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## మత్స్యకారుల ప్రాణాలకు విలువ లేదా? : వాసుపల్లి జానకిరామ్

### బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త:**




బోటు ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకా రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిం చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బోటు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ.49 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించి వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసుతో పాటు మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత ఇప్పటివరకు బాధిత కుటుంబాలను పరామర్శించలేదని విమర్శించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని, బోటు యజమాని కారి చిన్నకు ఇవ్వాల్సిన సహాయంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మత్స్యకారుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మెరైన్ పోలీస్ స్టేషన్‌కు స్పీడ్ రెస్క్యూ బోట్లు, ప్రతి ఫిషింగ్ బోటుకు లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయాలు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అలాగే ప్రతి మత్స్యకారుడికి రూ.1 కోటి ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్ల ప్రైవేటీకరణ ప్రయత్నాల ను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## జీ.ఓ. 396 రద్దు చేయాలని దస్తావేజు లేఖరుల నిరవధిక పెన్‌డౌన్

**ఆనందపురం, జూలై 20, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ. నెం. 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆనందపురం దస్తావేజు లేఖరులు సోమవారం నుంచి నిరవధిక పెన్‌డౌన్ ఆందోళన ప్రారంభించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దస్తావేజు లేఖరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆనందపురం దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు ఏనుగుల సత్యారావు మాట్లాడుతూ, జీ.ఓ. 396 అమలుతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తూ వస్తున్న దస్తావేజు లేఖరుల వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, వారి ఉపాధికి భంగం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. జీ.ఓ. 396ను వెంటనే ఉపసంహరించుకుని దస్తావేజు లేఖరుల ఉపాధికి పూర్తి భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, ఈ నెల 30వ తేదీ వరకు నిరవధిక పెన్‌డౌన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని దస్తావేజు లేఖరులు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మరుపిల్ల ప్రసాదరావు, వి.వి. వేణుగోపాల్, కే.ఎస్.ఎన్. మూర్తి, మరుపిల్ల సూర్యనారాయణ పాత్రుడు, అగ్నిహోత్రం పార్థసారథి, పి. గణేష్, ఎస్.వి. రవికుమార్, ఏ. గణేష్, పి. రామకృష్ణ, కే. చిన్నారావు, పి. సంతోష్, బి. జగదీష్ తదితర దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.

## మధురవాడ పి.హెచ్.సి.కి అత్యాధునిక హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్ మంజూరు

### మధురవాడ, ఆనందపురం టీబి యూనిట్ల రోగులకు అందుబాటులో సేవలు

**పి.ఎం.పాలెం, జూలై 20ప్రభాత వార్త :**



మధురవాడ టీబీ యూనిట్‌కు ప్రభుత్వం రూ. 20 లక్షల విలువైన అత్యాధునిక 'హ్యాండ్ హెల్డ్ ఎక్స్-రే మిషన్'ను మంజూరు చేసింది వ్యాధి వ్యాప్తి ముప్పు ఎక్కువగా ఉండే హైరిస్క్ వర్గాల ప్రజలకు ఈ పరికరం ద్వారా ఉచితంగా ఎక్స్-రే పరీక్షలు నిర్వహించను న్నారు ఎక్స్-రే పరిశీలనలో ఏవైనా లోపాలు లేదా లక్షణాలు కనిపిస్తే, తదుపరి కఫం (స్పుటమ్) పరీక్షలు చేయనున్నట్లు వైద్య అధికారులు వెల్ల డించారు. 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులు, మధుమేహం (షుగర్) వ్యాధిగ్రస్తులు, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారు. ఐదేళ్ల క్రితం టీబీ వచ్చి నయమైన వారు శరీర బరువు సూచిక (బిఎంఐ) 18.5 కంటే తక్కు వగా ఉన్నవారు, భవన నిర్మాణ కార్మికులు వంటి హైరిస్క్ రోగులకు ఉచితంగా ఈ ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తామని వైద్య అధికారులు వెల్లడిం చారు. ఈ అత్యాధునిక ఎక్సరే డివైజ్ సేవలు మధురవాడ పి.హెచ్.సి, ఆనందపురం పి.హెచ్.సిలతో పాటు వీటి పరిధిలోని 10 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్ సి) పరిధిలోని ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో మధుర వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దీపికాదేవి, పర్యవేక్షణా ధికారి పరమేశ్వరరావు, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మంతో పాటు సిబ్బంది రమణ, సురేష్, కృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా 'షైనింగ్ స్టార్'గా రమ్య ఎంపిక

**ఆనందపురం, జూలై 20, ప్రభాతవార్త :**



విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'లెర్నింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్' కార్య క్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రదానం చేసే 'షైనింగ్ స్టార్స్ అవార్డు'కు విశాఖపట్నం జిల్లా నుంచి ఆనందపురం పీఎంఎస్ శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అయితి రమ్య ఎంపికై జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్స్ థియేటర్లో నిర్వహించిన అవార్డుల ప్రధానో త్సవంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వెలగ పూడి రామకృష్ణబాబు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ డా. చంద్రశేఖర్ చేతుల మీదుగా రమ్య ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ, ఈ అవార్డు సాధించడంలో తన పాఠశాల ఉపాధ్యాయుల కృషి, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం ఎంతో కీలకమైందని పేర్కొంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిగా ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని తెలిపింది. విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు జోగేంద్రనాథ్, గంగరాజు, ఉపాధ్యాయుడు భాస్కరరావు తదితరులు పాల్గొని రమ్యను అభినందించారు.

## జగన్నాథ స్వామి వారికి పట్టువస్త్రాల సమర్పణ

**సింహాచలం జూలై 20, ప్రభాతవార్త :**



శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో జల్లేపల్లి వెంకట్రావు దంపతులు స్వామి వారి పట్టువస్త్రాలు, మంగళకరమైన పుష్పాలు, ఫలాలను భక్తిశ్రద్ధలతో జగన్నాథ స్వామి వారికి సమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచా ర్యులు, ఆధ్వర్యంలో, వేద పండి తుల మంత్రోచ్చారణలు, నాదస్వర మంగళ ధ్వనుల నడుమ ఈ పట్టువస్త్రాలు సింహాచలం నుండి అత్యంత వైభవంగా బయలుదేరింది. సహాయ కార్యనిర్వహ ణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరావుల పర్యవేక్షణలో, టర్నర్ సత్రానికి చేరుకుంది. అక్కడ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ డి. అన్నపూర్ణ చేతుల మీదుగా జగన్నాథ స్వామి వారికి ఈ పట్టువస్త్రాలను, పల పుష్పాలను అత్యంత భక్తి ప్రపత్తులతో సమర్పించారు.

## మృత రైల్వే ఉద్యోగి కుటుంబానికి రూ.1 కోటి బీమా చెక్కు అందజేత

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త :**




దక్షిణ కోస్తా రైల్వే విశాఖపట్నం డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా సోమవారం మృత రైల్వే ఉద్యోగి కుటుంబానికి రూ.1 కోటి బీమా చెక్కును అందజేశారు. ఎలక్ట్రికల్ జనరల్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్ (ఏసీ)గా విధులు నిర్వహించిన అక్కపత్రుని శివకుమార్ 2025 నవంబర్ 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన భార్య శ్రీమతి అక్కపత్రుని అనితకు రూ.1,00,00,000 విలువైన బీమా చెక్కును డీఆర్ఎం అందించారు. భారతీయ రైల్వేలు మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం, శివకుమార్ తన జీత ఖాతాను విశాఖపట్నంలోని దొండపర్తి ఎస్‌బీఐ శాఖలో రైల్వే సాలరీ ప్యాకేజ్ పథకం కింద నిర్వహిస్తున్నందున ఈ బీమా ప్రయోజనం లభించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జుసుఫ్ కబీర్ అన్సారీ, ఎస్‌బీఐ తూర్పు ప్రాంతీయ మేనేజర్ బి. రాజశేఖరం, ఎస్‌బీఐ దొండపర్తి శాఖ చీఫ్ మేనేజర్ జి.ఏ.వి. సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే సాలరీ ప్యాకేజ్ పథకం అనుకోని పరిస్థితుల్లో రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు సకాలంలో ఆర్థిక భద్రత, చేయూత అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు

## దిగ్విజయంగా కొనసాగుతున్న కాకి గోవిందరెడ్డి భద్రాచలం పాదయాత్ర

**గాజువాక, జూలై 20, ప్రభాతవార్త :**



జీవీఎంసీ 69వ వార్డు మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి భద్రాచల శ్రీరాముని దర్శ నార్థం చేపట్టిన పవిత్ర పాదయాత్ర సోమ వారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. నేడు ఆయన పాదయాత్ర గోపాలపురం నుంచి ప్రారంభమై జంగారెడ్డిగూడెం వరకు సాగింది. యాత్ర పొడవునా గోవిందరెడ్డికి స్థానిక ప్రజలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో కార్పొరేటర్ చేపట్టిన ఈ పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని స్థానికులు ఆకాంక్షించారు.

## వైకాపా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లపు రాముకు ఘన సత్కారం

**గాజువాక,జూలై 20,ప్రభాతవార్త :**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సీనియర్ నాయకుడు ఇల్లపు రామును సోమవారం 87వ వార్డు పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. రాము భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇల్లపు రాము మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పార్టీ రీజినల్ ఇన్‌ఛార్జ్ బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జ్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డులో వైఎస్ఆర్సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.వేణు బాబు, ఎన్.రమణ, ఎం.దామోదర్, డి.దానప్పలు, జి.ఆనంద్, పి.ఆనంద్, పి.శంకర్రావు, ఎ.సన్యాసిరావు, డి.సత్తిబాబు, జి.నూకరాజు, ఇ.శ్రీరాములు, పి.రమణ, పి.రాము, ఎ.వెంకట్రావు, జి.శ్రీను, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నృసింహ అవతారంలో ఉన్న శ్రీ జగన్నాథునికి భక్తుల తాకిడి!

**విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త:**



టర్నర్ సత్రం ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథ యాత్ర మహోత్సవాలు 5వ రోజు సందర్భంగా సోమవారం నాడు శ్రీ జగన్నాథ స్వామివారు "నృసింహ" అవతారంలో భక్తులకు దర్శనమి చ్చారు. స్వామి వారికి సింహాచలం దేవస్థానం తరపున ఈఓ జే వెంకట రావు గారి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి టి అన్నపూర్ణ గారు, ఆలయ ఈఓ టి. రాజ గోపాల్ రెడ్డి, ధర్మ కర్తల మండలి చైర్మన్ ఎస్ రాజ్ కుమార్ మరియు సభ్యులు మర్యాద పూర్వకంగా వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మధ్యాహ్నం 1000 మంది భక్తులకు అన్న సంతర్పణ చేయడం జరిగింది. సాయంత్రం వేళ స్వామి వారి సన్నిధిలో న్యాయవాదులచే భక్తి సంగీత విభావరి, చిన్న పిల్లలచే కూచిపూడి నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు.



ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథయాత్రను బూడిద గుమ్మడికాయతో దిష్టితీసి, జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

## జగన్నాథుని ఆశీస్సులతో ధర్మవరం మరింత అభివృద్ధి చెందాలి

**• రథయాత్రను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్**

**ధర్మవరం టౌన్, జులై 20 ప్రభాతవార్త:** ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ రథయాత్రలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బూడిద గుమ్మడి కాయతో దిష్టి తీసి, జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ స్వామివారిపై తన భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఇస్కాన్ సంస్థ అనేక సంవత్సరాలుగా ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులు ధర్మవరం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, జగన్నాథ స్వామి కటాక్షంతో ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ధర్మవరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరారు. ఈ మహోత్సవంలో ఇస్కాన్ ప్రతినిధులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంగళగిరి రచయిత్రులకు అంతర్జాతీయ గుర్తింపు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్‌హామ్ భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఆధ్వర్యంలోని "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్" కార్యక్రమంలో భారతీయ యువ రచయిత్రులు ప్రణవి బిట్రా (16 సంవత్సరాలు), ఇషాన్వి బిట్రా విశిష్ట గౌరవాలు అందుకున్నారు. ఇరువురు సోదరీమణులు మంగళగిరి కి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు, మల్లికల కుమార్తెలు. ప్రణవి బిట్రాకు (16 సంవత్సరాలు) సృజనాత్మక రచనలో ప్రతిభ, ఊహాశక్తి, సాహిత్య నిబద్ధతకు గుర్తింపుగా "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ - 2026" ప్రదానం చేశారు. అదే కార్యక్రమంలో ఇషాన్వి బిట్రాకు (12 సంవత్సరాలు) సృజనాత్మక రచనా కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యానికి పాల్గొనిన ధ్రువపత్రం అందజేశారు. డా. కృష్ణ కుమార్, చిత్ర కుమార్ స్థాపించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఈ యువ రచయిత్రుల సాహిత్య ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత సృజనాత్మక రచనలు చేసి ప్రపంచ సాహిత్యానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించింది. ప్రణవి బిట్రా, ఇషాన్వి బిట్రా సాధించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతీయ యువ రచయితల ప్రతిభకు ప్రపంచస్థాయిలో లభిస్తున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తూ, సాహిత్య రంగంలో ముందుకు రావాలనుకునే యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.




**తిరుపతి హెల్త్, జులై 20 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు వద్ద గల వ్యాసాశ్రమంలో జులై 25న శాంతియుత నిరసన దీక్ష చేపట్టుతున్నట్టు శివానంద స్వామి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామీజీ మాట్లాడుతూ మహర్షి సద్గురు మలయాళ స్వామి ఆరాధన ఉత్సవం సందర్భంగా వందలాది మంది భక్తులతో, పూర్వ విద్యార్థులతో, స్వామీజీలతో, భక్తాదులతో నిరసన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. కేరళలో పుట్టిన మలయప్ప స్వామి ఆంధ్రను ఉద్ధరించడానికి ఇక్కడికి వచ్చి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. ఆశ్రమం మేనేజరు, పీఠాధిపతులు, నిరసన దీక్షను అడ్డుకోవాలని చూస్తే చట్టపరంగా, శాంతియుతంగా ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో బాలికలతో పాటు బాలురులకు సంస్కృతం, వేద పాఠశాల ఉండేవి అని, అవన్నీ ఇప్పుడు కనుమరుగయ్యాయని, వేసాశ్రమానికి మునుపటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, వాటన్నిటిని తిరిగి ఏర్పాటు చేయాలనే ఆకాంక్షతోనే నిరసన దీక్షకు దిగుతున్నట్లు చెప్పారు. రోజు రోజుకు వేసాశ్రమం ఖ్యాతి దిగజారుతున్నదని అన్నారు. ఈ విషయమై దేవదాయ శాఖ ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి విన్నవించినా ఫలితం లేదని చెప్పారు. భావితరాలకు ధర్మాన్ని అందించాలంటే వ్యాసాశ్రమను మనం రక్షించుకోవాలని భక్తాదులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక, కేరళ నుండి భక్తులు ఈ నిరసన దీక్షలో అధిక సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో స్వామీజీలు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

**• రోజూ మానిటర్ చేయాలి.. ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలి • అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదు**

**• నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం • రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్**

**అనంతపురం, జులై 20 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ధీటుగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో సోమవారం జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, త్రాగునీరు సరఫరాపై వ్యవసాయ, ఉద్యాన, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్.ఎల్.సి, మైనర్ ఇరిగేషన్, కెవికె శాస్త్రవేత్తలు, ఆర్డబ్ల్యుఎస్, డిపిఓ, ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్‌లతో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను రోజు మానిటర్ చేయాలని, ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. అమరావతిలో ఉన్నతాధికారులతో మానిటర్ చేసేందుకు జిల్లా నుంచి ఒక లైజనింగ్ అధికారిని నియమించి అగ్రికల్చర్, మైనర్



ఇరిగేషన్, డ్వామా, తదితర శాఖల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, పురోగతిపై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. ఎదురయ్యే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

**హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలి:** ఎల్‌నినో నేపథ్యంలో హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలని ఆదేశించారు. అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదని, ప్రతి ఒక్కరూ 24/7 విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్.ఎల్.సి నుంచి నీరు వచ్చిన వెంటనే 25- 30 రోజుల్లోపు తాగునీటి ట్యాంకులను నింపాలని, ఇందుకు బ్లూ ప్రింట్ సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా ట్యాంకుల వద్ద మోటార్లను ఉపయోగించుకునేందుకు వీలుగా అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. హెచ్.ఎల్.సి మెయిన్ కెనాల్ పై ఆయా శాఖల అధికారులకు డ్యూటీలు వేయాలని, ఇతర శాఖల అధికారులను కూడా డ్యూటీలు వేయాలని, ఎవరు విధుల్లో కనబడకపోయినా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ సమస్య వస్తుందో ముందుగానే పసికట్టి కనుక్కోవాలని, జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిత్యం మానిటర్ చేయాలని ఆదేశించారు. పిఏబిఆర్ లో స్టాప్ లాగ్ గేట్ కు సంబంధించి టెండర్ పిలవడం జరగగా, ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

**గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి :** గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని డిపిఓ, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక్కో బోర్వెల్ ను దత్తత ఇవ్వాలని, అవి పని చేస్తున్నాయా లేదా అనేది పర్యవేక్షణ చూస్తూ అవి పని చేసేలా చూడాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగానే అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, రెడ్డపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.మల్లీశ్వరి, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, డిపిఓ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చెన్నరాయుడు, హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్2 ఎస్ఈ సిఆర్.రాజగోపాల్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత చంద్రన్నదే

**• కూటమి పాలనపై, వైసిపి పాలనపై చర్చకు సిద్ధమా..? • మంత్రి సవిత సవాల్**

**శ్రీ సత్యసాయి జిల్లా, జులై 20, ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేననీ రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం చెరువును ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, ఇతర కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గాను, పారిశ్రామిక హబ్ గాను సీఎం తీర్చిదిద్దుతున్నారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో సినిమా సెట్టింగ్‌ల వేసి, కొబ్బరికాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, అయిదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రపంచమంతా ఎల్‌నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని అన్నారు. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం



చంద్రబాబుదేనన్నారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తిరుపతిలో రాయల్ ఇన్ ఫీల్డ్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. పులివెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు.

అంతకుముందు బుక్కపట్నం చెరువులో బోటులో మంత్రి సవిత ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, కూటమి నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా పిటిఐ ఉద్యోగుల పోరాటాలకు ఎపి జెఎసి మద్దతు

**విజయవాడ, జూలై 20 (ప్రభాతవార్త):** సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ఇతర విభాగాల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసంచేపట్టిన ప్రత్యక్ష పోరాటాలకు ఏ.పిజె.ఎ.సి అమరావతి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు ప్రకటించారు.

ఆదివారం విజయవాడలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమగ్ర శిక్ష ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరరావు మీడియాకు వివరించారు.

14ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగాల క్రమబద్ధీకరణ జరగలేదని, కనీస ఉద్యోగ భద్రత, కనీస వేతన టైమ్ స్కేల్ కూడా అమలు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 13 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపిఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ సమయంలో గ్రాట్యుటీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమగ్ర శిక్షలోని ఇతర విభాగాల ఉద్యోగ సంఘాలతో పాటు పీటీఐ సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఇందుకోసం త్వరలోనే నిరసన కార్యక్రమాల షెడ్యూల్, కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు సైతం పిటిఐల పోరాటానికి తమ మద్దతు తెలిపారు.

ఏపిజెఎసి మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, పిటిఐ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్లు వెంకటరమణ, కామేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు

**• అపజయాన్ని విజయానికి పునాదిగా మలుచుకోవాలి • మంత్రి పొంగూరు నారాయణ**

**• ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానం చేసిన మంత్రి, కలెక్టర్ హిమాన్షు**

**నెల్లూరు(కలెక్టరేట్), జులై 20, ప్రభాత వార్త:** జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించాలంటే కష్టపడటమే ఏకైక మార్గమని, అపజయాన్ని చూసి నిరాశ చెందకుండా దానిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని మంత్రి పొంగూరు నారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఉదయం విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2026 కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నప్పుడు ఆటలపై మక్కువతో చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో తాను పదో తరగతిలో ఒకసారి విఫలమైనట్లు మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే ఆ అపజయాన్ని సవాల్‌గా తీసుకుని రోజుకు 15-16 గంటలు కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించానని చెప్పారు. అనంతరం వీఆర్ కళాశాలలో డిగ్రీ, ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి రెండింటిలోనూ కాలేజ్ టాపర్‌గా నిలిచానన్నారు. నెలకు రూ.120 జీతంతో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించే సంస్థలను నిర్మించే స్థాయికి చేరిందన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం ప్రతిభ ఉంటే సరిపోదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే అంకిత భావం, కమిట్‌మెంట్, క్రమశిక్షణ అత్యంత అవసరమన్నారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు పడే కష్టం ఎంతో గొప్పదని కొనియాడారు. తాను కూడా 23 సంవత్సరాల క్రితం ఇంటర్మీడియట్ టాపర్‌గా ఇలాంటి వేదికపైనే నిలబడ్డానని, నేడు అదే వేదికపై విద్యార్థులను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాతే అసలైన జీవిత ప్రయాణం ప్రారంభమవుతుందని, ఇకపై ప్రతి నిర్ణయాన్ని బాధ్యతగా తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చదువుకునే సమయంలో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా డిస్ట్రాక్షన్లకు దూరంగా ఉండాలని,



ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చదివే క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే గొప్ప విజయాలు సాధిస్తారని చెప్పారు. ప్రతిభకు కొదవ లేదని, క్రమశిక్షణతో కూడిన కృషి ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి తమ లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో నక్షత్రాల్లా వెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్చి-2026 పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 224 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులందరూ ఇదే సూత్రాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనంతపురంలో వైసిపి నేత అంకే నరేంద్ర ఆత్మహత్యాయత్నం

**అనంతపురం రూరల్, జులై 20 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం, అనంతపురం రూరల్ మండలం, ఆలుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంకే నరేంద్ర స్థానిక టిడిపి నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ, రూరల్ పోలీసుల వేధింపులు కారణంగా వాటిని తట్టుకోలేక సోమవారం ఉదయం తన తోటలో సెల్ఫీ వీడియో తీసుకొని తన బాధలు చెప్పుకుంటూ పురుగుల మందు సేవించి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగిందని అంకె నరేంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు తెలియజేశారు. ఆలమూరులో జగనన్న కాలనీలోని బోర్‌లకు మరమ్మతులు చేయించాలని కాంట్రాక్టర్ రమణారెడ్డి తెలియజేయడంతో ఆయన పిలుపు మేరకు చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించి తిరిగి యథాస్థానంలో అంకే నరేంద్ర మార్చడం జరిగిందని, కానీ ఈదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొనుగుంట్ల సూర్యనారా యణ గ్రామంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో దొంగ ఓట్లును ఎక్కిస్తుండ దంతో వాటిని నరేంద్ర అడ్డుకున్నందుకు అంకె నరేంద్రపై అక్రమంగా దొంగతనం కేసు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెట్టడంతో రూరల్ పోలీసులు ఆయన ఫిర్యాదు మేరకు అంకె నరేంద్రపై కేసు నమోదు చేసి ఎటువంటి విచారణ చేయకుండానే అంకే నరేంద్రరే జగనన్న కాలనీలో గల బోర్ల మోటర్‌ను దొంగలించినట్లు నిర్ధారించి బోర్లకు అమర్చిన మోటార్లను పైపులను వాటికి సంబంధించిన సామాగ్రిని తీయించి, స్టేషన్‌కు తరలించి, ఆ సామాగ్రితో పాటు అంకే నరేంద్రకు ముసుగు వేసి పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేయడంతో అంకె నరేంద్ర తన కుటుంబ పరువు పోయిందని, భావించి తన చావుకు గోనుగుంట్ల సూర్యనారాయణ, అదేవిధంగా దొంగతనం కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులే కారణమంటూ అంకె నరేంద్ర తీవ్ర అవమానంగా భావించి, మానసిక వేధింపులను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడముతో ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్ఆర్సిపి నాయకులు వెంటనే ఆయనను హుటాహుటిన సవేరా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు వైద్య సేవలు అందించి ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు, బంధువులకు, వైఎస్ఆర్సిపి నాయకులకు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు బంధువులు వెంటనే మెరుగైన వైద్యం కోసం నరేంద్రను బెంగళూరుకు తరలించారు. నరేంద్ర ఆత్మహత్య ప్రయత్నానికి గల కారకుడు గోనుగుంట్ల సూర్యనారాయణతో పాటు, అక్రమంగా కేసు నమోదు చేసి వేధించిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు.



## అనుమతి లేని ఇసుక తవ్వకాలపై కొరడా

# 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

**అధికారుల సంయుక్త తనిఖీలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో సోమవారం నిర్వహించిన సంయుక్త తనిఖీలో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాలకు వినియోగిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సమక్షంలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, వారి సాంకేతిక సిబ్బంది, రాజమహేంద్రవరం అర్బన్ తహ సీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారుల తో కలిసి కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద సంయుక్తతనిఖీ నిర్వహించారు. తనిఖీలో సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ పరిధిలో మొత్తం 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. విచారణలో మూడు డ్రెడ్జింగ్ బోట్ల యజమానిగా నందూరి రాజు (మాదిగపల్లి, వైకుంఠపురం, గుంటూరు), మరో మూడు బోట్ల యజమానిగా ముత్యాల వెంకట రమణ (రామాలయం వీధి, విజ్జేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా), మరో మూడు బోట్ల యజమానిగా కూచిపూడి బాలస్వామి (గరుడాచలపాలెం, తకెళ్లపాడు, గుంటూరు జిల్లా) ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు డ్రెడ్జింగ్ బోట్లకు సంబంధించిన యజమానులు తనిఖీ సమయంలో గుర్తించబడకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నిర్ధారించారు.

నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక త్రవ్వకాల కోసం వినియోగించినందున మొత్తం 13 బోట్లను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా తదుపరి క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అలాగే వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఈ సంయుక్త తనిఖీలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్. శివరాముడు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి, టెక్నికల్ అసిస్టెంట్ పి.ఎన్.వి.ఎల్. శైలజ, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ యు. రంజిత్ కుమార్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు

**• విద్యార్థుల చదువు రాష్ట్రానికి ఆర్థిక వనరు • కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి**



విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రదానం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి మురళీమోహన్

**చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు అని, ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం పెరిగి అత్యధిక మంది షైనింగ్ స్టార్స్ వెలుగులోకి రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీ మోహన్‌లు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో సోమవారం జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గత విద్యాసంవత్సరం టెన్త్, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్స కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు ఏ ఇతర ప్రైవేటు విద్యాసంస్థలకు తీసిపోవని, ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన అవకావాలు వున్నాయన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసంను పెంపొందించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ అధికారులు తరచు పాఠశాలలను సందర్శిస్తూ బోధన, మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై గణనీయమైన వ్యయం చేస్తోందని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు సాధించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు విద్యార్థులు పునాదులని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో దేశం, రాష్ట్రానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ కార్యక్రమం కేవలం అవార్డుల ప్రదానోత్సం మాత్రమే కాదని, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే మహత్తరమైన కార్యక్రమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏ మాత్రం తీసిపోవన్నారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 168 మంది విద్యార్థులు, ఇంటర్మీడియేట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేసి, ఒకొక్క విద్యార్థికి రూ.20 వేలు నగదు ప్రోత్సహకం, ప్రశంసాపత్రంను అందజేశారు.

## నాణ్యత విషయంలో రాజీ ఉండదు : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, జూలై 20, (ప్రభాతవార్త)

మండలంలో బొబ్బిలిపేట నుండి వెదుళ్లవలస గ్రామాల వరకు రూ.1.80 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన బీటీ రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణంలో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యత, బీటీ పొర మందం, పనుల ప్రమాణాలు, నిర్మాణ విధానాన్ని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజాధనం వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. బొబ్బిలిపేట వెదుళ్లవలస రహదారి పూర్తయితే గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడటంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజలకు కూడా ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

## 21వ వార్డులో రోడ్లు మంజూరు చేయండి



ఇచ్ఛాపురం, జూలై 20 ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధి 21 వ వార్డులో రోడ్లు మంజూరు చేయాలని వార్డు వైస్సార్సీపీ ఇన్‌చార్జ్ సాలిన గాంధీ యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కి వినతిపత్రం అందజేశారు. శాంతినికేతన్ వీధిలో రోడ్లు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు.

## జేఎంజే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు



కంచిలి, జూలై 20 ప్రభాతవార్త :

కంచిలిలోని మఠం కంచిలి వద్ద గల జేఎంజే ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో సోమవారం విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం (ఇన్వెస్టిచర్ సెరిమనీ) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఫాతిమా మేరీ కె. ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లు ప్రదానం చేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ, సేవాభావం, నిజాయితీతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ షౌరి పోలంకి మాట్లాడుతూ, నాయకత్వం అనేది ఒక పదవి కాదు అది ఒక గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. నాయకులు ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## బోగాబెణి రైతు సేవా కేంద్రం పరిధిలో యూరియా పంపిణీ



కంచిలి, జూలై 20 ప్రభాతవార్త :

బోగాబెణి రైతు సేవా కేంద్రం పరిధిలో యూరియా పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి తిరుమలరావు పర్యవేక్షణలో ఓటిపి రాని వారికి ఎల్1 డివైస్ బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏపీఐఎంఎస్ యాప్ మరియు ఐ ఎఫ్ ఎం ఎస్ ద్వారా సరఫరా చేయడం జరిగినది. కౌలు రైతులకు, తక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు క్లబ్ చేసి యూరియా పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు అందరిని ఒకరికి క్లబ్ చేసి యూరియా పంపిణీ చేశారు. రైతులందరూ ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని వివరించడం జరిగినది. యూరియాను సక్రమంగా వినియోగించుకోవాలని ఒకేసారి కాకుండా మూడు దఫాలుగా వేసుకోవాలని డి ఏ పి బదులుగా 20 20 0 13, 28 28 0, వంటి కాంప్లెక్స్ ఎరువులు వినియోగించుకోవాలని తెలియజేయడం జరిగినది. మొక్కకు కావలసిన పోషకాలను కాంప్లెక్స్ ఎరువుల రూపంలో గానీ నూటి ఎరువుల రూపంలో కానీ అందించవచ్చు అని తెలియజేయడం జరిగినది. సేంద్రీయ పదార్థం ఎక్కువగా ఉన్నటువంటి భూమిలో పోషకాల లభ్యత మరియు పోషకాలను మొక్క వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలియజేశారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



కవిటి, జూలై 20 ప్రభాతవార్త :

విద్యార్థుల ప్రభుత్వం అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్టును ఉపయోగించుకుని విద్యాభివృద్ధి సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట ప్రధానోపాధ్యాయులు ఆనింగి నాగేశ్వరరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ బ్యాగులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్పర్సన్ ప్రతినిధి రెయ్యి లోకనాథం ప్రధానోపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం, కృష్ణ, అప్పలరాజు, నాగమణి, సంతోషి కుమారి, యోహాన్, మొర్రి గోపి పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డు



సీతంపేట, జూలై 20 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి చేతులు మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డును భారతి ఇంటర్నేషనల్ స్కూల్‌కి చెందిన ఇంటి సాయిచరణ్ ఈ ఏడాది పదవ తరగతి, ఫలితాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, జిల్లాకు మంచి పేరు ఇచ్చినందుకు అవార్డును అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ, ప్రోత్సహించేలా విద్యా శాఖ ఆధ్వర్యంలో "షైనింగ్ స్టార్స్ 2026" పేరిట గౌరవ సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి తల్లిదండ్రులు సమక్షంలో అవార్డును అందజేశారు. అవార్డు లభించడం పట్ల పాఠశాల యాజమాన్యం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

## బాధితుల ఆర్తనాదాలు పట్టని ప్రతిపక్షాలు

**రణస్థలం నిర్వాసితుల గోడు వినపడట్లేదా? ..ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల మొద్దు నిద్ర..**

**బాధితులకు అండగా నిలవడంలో ఘోర వైఫల్యం**



రణస్థలం, జూలై 20 ప్రభాతవార్త :

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం 16వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు, తాజాగా యుటిలిటీ కారిడార్ స్థల సేకరణ ఆదేశాలు స్థానిక చిన్న వ్యాపారులను, నివాసితులను రోడ్డున పడేసేలా చేస్తున్నాయి. ఏడాదిన్నరగా నరకం చూస్తూ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో జిల్లా అధికారులు ఇచ్చిన తాజా ఆదేశాలు వారి పొట్ట కొట్టేలా ఉన్నాయంటూ బాధితులు గుండె లబోదిబోమంటున్నారు. ఇంతటి దారుణ పరిస్థితి నెలకొని వందలాది కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుంటే ప్రజాపక్షాన నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైసీపీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు మాత్రం 'మాకేం పట్టనట్టు' వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. బాధ్యత మరిచిన ప్రతి పక్షం సాధారణంగా ప్రజలకు కష్టం వస్తే ముందుండి పోరాడాల్సిన ప్రతిపక్షాలు, రణస్థలం బాధితుల విషయంలో పూర్తిగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. నివాసితులు, ఫుట్‌పాత్ వ్యాపారులు తమ ఉపాధిని కోల్పోతుంటే కనీసం అధికారులను ప్రశ్నించే గొంతుకే కరువైంది.

**కార్యాలయాలకే పరిమితం:**

ప్రజల పక్షాన నిలబడి ఆందోళనలు చేపట్టడం పక్కన పెట్టి, ప్రతిపక్ష నాయకులు ఏసీ గదులకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తిరిగే నాయకులు, ఇప్పుడు ప్రజలు రోడ్డున పడుతుంటే కనీసం పరామర్శించడానికి కూడా రాకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట. మా పొట్ట కొడుతుంటే అధికారులు ఒకవైపు, పట్టించుకోని నాయకులు ఇంకోవైపు మమ్మల్ని నలిపేస్తున్నారు. మా కష్టాలు చూసేందుకు ఏ ఒక్క ప్రతిపక్ష నాయకుడూ ముందుకు రాకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్థానిక చిరు వ్యాపారుల ఆవేదన**

ఇప్పటికైనా నిద్ర లేవాలి..! అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు బలి అవుతుంటే ప్రతిపక్షాలు తమ ఖనిర్లక్ష్య ధోరణిఖి వీడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం అధికార పక్షాన్ని విమర్శించడానికే కాకుండా, ఇలాంటి క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ప్రతిపక్షాలు తమ బాధ్యతారాహిత్యాన్ని వీడి, రణస్థలం ఫ్లైఓవర్, యుటిలిటీ కారిడార్ బాధితులకు అండగా నిలవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## డాక్యుమెంట్ రైటర్‌ల పెన్ డౌన్



ఇచ్ఛాపురం, జూలై 20 ప్రభాతవార్త :

రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటు పరం చేస్తూ ఇచ్చిన 396 జి వోకి వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ నిర్వహించారు. తమ పొట్ట కొట్టొదని కోరుతూ ఈ నెల 30 వరకు పెన్ డౌన్ నిర్వహిస్తున్నారు. మెడిమి కామేశ్వరరావు, చెన్నూరు కూర్మయ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జె.ఆర్.పురం ఎస్సై



రణస్థలం, జూలై 20 ప్రభాతవార్త :

రణస్థలం మండలం పరిధిలో జె ఆర్ పురం పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన ఎస్ఐకి ఎమ్మెల్యే ఈశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు కీలక సూచనలు చేశారు.

## జీవో నెం.3కు శాశ్వత పరిష్కారం కూటమి ప్రభుత్వమే తీసుకొస్తుంది

**టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి**



సీతంపేట, జూలై 20 ప్రభాతవార్త :

జీవో నెం.3కు శాశ్వత పరిష్కారం కూటమి ప్రభుత్వమే తీసుకొస్తుంది. టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవో నెం.275ను తీసుకువచ్చిందని, అనంతరం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే జీవో నెం.3 అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు అనంతరం జీవో నెం.3కు చట్టబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయడం తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.3కు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందన్నారు. ఐఏఎస్ అధికారి సదా భార్గవి నాయకత్వంలో ఐటీడీఏ ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మేధావులతో విస్తృతంగా చర్చించి వారి అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సవర తోట మొక్క లింగం. బి.జయలక్ష్మి. ఆరిక లక్ష్మయ్య. మొర మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 396 జీవోను తక్షణమే రద్దు చేయాలి

**దస్తావేజు లేఖర్ల సంఘం డిమాండ్**



రణస్థలం, జూలై 20 ప్రభాతవార్త :

డాక్యుమెంట్ రైటర్ల పొట్టకొట్టే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన 396 జీవోను తక్షణమే రద్దు చేయాలని డాక్యుమెంట్ రైటర్స్ సంఘం రణస్థలం మండల కార్యదర్శి జల్లేపల్లి సూర్య ప్రకాశరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపులో భాగంగా రణస్థలం మండలంలోని దస్తావేజు లేఖర్లు సోమవారం నుండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద 'పెన్ డౌన్' నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము నమ్ముకున్న ఈ వృత్తిని, ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల' వల్ల కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ సేవా కేంద్రాల పేరుతో తమ ఉపాధిని దెబ్బ తీయడం సరి కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సేవా కేంద్రాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దస్తావేజు లేఖర్ల వ్యవస్థను యథావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు రాజపాత్రుని మౌలేశ్వరరావు, ఆచారి, సూరవాజ్జుల శివ కుమార్, అరసాడ విజయ సారధి, పులగుర్త మల్లిబాబు తదితర పాల్గొన్నారు.

## పాఠశాలకు సౌండ్ స్పీకర్ వితరణ



సంతబొమ్మాళి, జూలై 20 ప్రభాతవార్త

మండలంలోని వడ్డీవాడ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల గత సంవత్సరం 5వ తరగతి చదివిన రెడ్డి చాందిని మరియు కళ్యాణం హారిక యొక్క తల్లిదండ్రులు రెడ్డి భవానికుమారి మరియు కళ్యాణం వెంకటరావు లత మా పాఠశాలకు సుమారు రూ.18000 విలువైన సౌండ్ స్పీకర్ అలాగే ఏడు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు పాపారావు, సింహాచలం, చందు, గణపతిరావు, ఝాన్సీ భాయి ధన్యవాదాలు తెలియజేశారు.

## కౌలురైతులకు కూడా ఎరువులు అందిస్తాం

**మండల వ్యవసాయధికారి అప్పారావు**



సంతబొమ్మాళి, జూలై 20, ప్రభాతవార్త

ప్రస్తుతం ఉన్న విధివిధానాల ప్రకారం కౌలురైతులకు కూడా వారు సాగు చేస్తున్న వివిధ పంటలు విస్తీర్ణాల బట్టి నేరుగా ఎరువులు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావుఅన్నారు. మండలంలోని పాలతలగం, మలగాం గ్రామాల్లో ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ అప్లికేషన్ ద్వారా కౌలు రైతులకు కూడా నేరుగా ఎరువులు పంపిణీ చేసే వెసులుబాటు ఉందని ఆర్.ఎస్.కె ఇన్‌చార్జులు, పి.ఏ.సి.ఎస్ సిబ్బంది భూమి యజమాని మరియు కౌలు రైతు ఇరువురుని సమన్వయ పరచి ఏ.పి.ఏ.ఐ.ఎం.ఎస్ అప్లికేషన్ ద్వారా అర్హులైన కౌలు రైతులకు ఎరువులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏ.ఈ.ఓ గొండు శ్రీధర్, పి.ఏ.సి.ఎస్ సి.ఈ.ఓ మాధురి, వి.ఏ. ఏలు మంచాల లలిత, మాదిన సమన్వయి, లోళ్ళ సుప్రియ, చింతాడ ధర్మారావు, దొంకాన రామరాజు, గిన్ని భీమారెడ్డి, లాభాల గణేష్, కింతలి కల్యాణ్ కుమార్, పి ఏ సి ఎస్ సిబ్బంది నరేష్, రాము, కింజరాపు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో హేరా(వీరా)పంచమి ఉత్సవం



కంచిలి, జూలై 20 ప్రభాతవార్త :

కంచిలి మండలం కొల్లూరు గ్రామంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథాయాత్ర ఉత్సవాలలో ఐదవ రోజు హేరాపంచమి(వీరా పంచమి) లక్ష్మీ నారాయణుల సంవాదం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. హే అనగా వెదకడం, పంచమి అనగా ఐదవ రోజు అని అర్థం. జగన్నాథ స్వామి తన భార్య అయిన లక్ష్మీదేవితో మరుసటి రోజు తిరిగి వస్తానని చెప్పి తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రా దేవితో కలిసి ఇంద్రద్యుమ్న (గుడించా మందిరం) దేవాలయానికి చేరుకున్న స్వామివారు ఐదు రోజులైనా తిరిగి రాని కారణంగా స్వామి వారిని చూచుటకు లక్ష్మీదేవి అలంకరించిన పల్లకీలో, సేవకులతో, సంగీత వాయిద్యాలతో కీర్తనలతో, గుడించా ఆలయానికి బయలుదేరి వెళ్తారు. లక్ష్మీదేవి కోపంగా వస్తుందని గ్రహించిన స్వామి వారు ఆలయ తలుపులు మూసివేయించగా తన స్వామిని తిరిగి రమ్మని లక్ష్మీదేవి ఎంతగానో ప్రార్థించింది. లక్ష్మీ నారాయణుల మధ్య జరిగిన ఈ ఆసక్తికరమైన ఈ సంభాషను ప్రధాన అర్చకులు పద్మనాభ పాడి, ఇతర అర్చకులు పద్యాల రూపంలో మనోహరంగా ఆలపించారు. ఎంత బ్రతిమిలాడినా శ్రీవారు తలుపులు తెరవకపోవడంతో త్వరగా తిరిగి రమ్మని కోరుతూ లక్ష్మీదేవీ స్వామివారి రథమైన నంది ఘోష రథాన్ని వెనుకకు తిప్పించి, రథశీలను తీసుకొని వేరే రహస్య మార్గం గుండా తిరిగి తన ప్రధాన మందిరానికి చేరుకుంటుంది. దీనినే "శీలవిరుపు" అని అంటారు. ఈ అద్భుత ఘట్టాన్ని చూసేందుకు భక్తులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. లక్ష్మీదేవి గుడించా ఆలయానికి పల్లకిలో వెళ్లేప్పుడు భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభ పాడి, అర్చకులు, గ్రామ పెద్దలు. యువకులు, మహిళలు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## షైనింగ్‌స్టార్ అవార్డు అందుకున్న నిహారిక నాయకో



సంతబొమ్మాళి, జూలై 20, ప్రభాతవార్త :

మండలంలోని దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిహారిక నాయకో సోమవారం షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మకమైన షైనింగ్ స్టార్ అవార్డును రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా జిల్లా అధికారుల సమక్షంలో 20వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రము అందుకున్నారు. ఈ మేరకు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న, ఉపాధ్యాయులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ నిహారిక పాఠశాల కీర్తిని జిల్లా వ్యాప్తంగా ఇనుమడింప చేశారని, ఇది తర్వాత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, శారదాంబ, అన్నాజీ, మురళీధరరాజు, రాము, సూర్యప్రకాష్, పి.శ్రీధర్, విజయలక్ష్మి, కె.శ్రీనివాసరావు, లక్ష్మన్నునాయుడు, రోషిని, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, కె.శ్రీధర్, మార్కండేయులు విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## జెఆర్‌పురం ఎస్‌ఐని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ సెల్ అధ్యక్షులు



రణస్థలం, జూలై 20 ప్రభాతవార్త

మండల కేంద్రం జెఆర్‌పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ సత్యనారాయణను సోమవారం రణస్థలం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దువ్వాన సంతోష్, లావేరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కేత రామకృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జెఆర్‌పురం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఈయనకు వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

## పరిమితికి మించి యూరియా విక్రయాలపై తనిఖీ నిర్వహించిన అధికారులు



ఆముదాలవలస, జూలై 20 (ప్రభాతవార్త)

ఆన్లైన్ యాప్ ద్వారా రైతులకు విక్రయిస్తున్న యూరియా (ఎరువులు) మార్చి ఏప్రిల్, మే నెలలో పరిమితిని మించి విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించిన ఆముదాలవలసలోని శివ బాలాజీ రైతు డిపోలో పలాస సహాయ వ్యవసాయ సంచాలకులు కే.శారద, పలాస వ్యవసాయ అధికారి కిల్లి పోలారావులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మూడు మాసాలు అధికంగా అమ్మిన వారిలో ఆముదాలవలసకు చెందిన శివ బాలాజీ డిపో ఉన్నది. కలెక్టర్ నియమించిన ప్రత్యేక టీము తనిఖీలు నిర్వహించి గడచిన మూడు నెలల్లో 26.7 మెట్రిక్ టన్నులు యూరియా అమ్మకాలు జరిగినట్లు గుర్తించారు. సరాసరిన ఈ మూడు నెలల్లో 400 బ్యాగులకు మించి విక్రయం చేయరాదు. యూరియా రైతులకు ఇచ్చారా లేదా అనే అంశాన్ని ఆన్లైన్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రస్తుతం ఉన్న స్టాక్ నిల్వలు రోజువారి సేల్ తదితర రికార్డులను పరిశీలించారు. కొరపాం గ్రామంలో చెరుకు పండించే రైతులకు కొంత మేరకు రైతులకు ఇచ్చినట్లు గుర్తించారు. మండలంలో సుమారు 200 ఎకరాలు చెరకు రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి సరాసరిన వెయ్యి బ్యాగుల యూరియా అందించవలసి ఉంది. మండలంలోని 14,523 ఎకరాలలో వరి పండించిన రైతులు ఉన్నారు. యాప్ ద్వారా విక్రయాలు జిల్లా మొత్తంగా సుమారు 18 షాపులు అధిక మొత్తంలో విక్రయించినట్లు ఆన్లైన్లో చూపుతున్నారు. ఆ మేరకు రైతులకు ఎరువులు అందావా లేదా అనే విషయంపై అధికారులు తనిఖీ చేశారు. పరిమితులను మించి విక్రయాలు చేయరాదని అలాగే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్ప వని సహాయ వ్యవసాయ సంచాలకులు కే శారద అన్నారు. రైతుల నుండి అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే షాపులు సీజ్ చేసే పరిస్థితులు ఉంటాయని వివరించారు. రైతులు కూడా అధికారులకు సహకరించి ఆన్లైన్ ద్వారా ఎరువులు పొందాలని ప్రస్తుతం ఎరువులు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని దిగులు చెందవలసిన పని లేదని తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి మెట్ట మోహన్‌రావు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరుల పొట్ట కొట్టవద్దు



కోటబొమ్మాళి, జూలై 20 ప్రభాతవార్త :

రిజిస్ట్రేషన్ స్టాంప్లశాఖను ప్రైవేటీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో.ఎం.యస్.నెం.396ను వెంటనే ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పలువురు దస్తావేజు లేఖరుల నాయకులు మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధి విధానాలను మేము వ్యతిరేకిస్తున్నామని, రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఫ్రంట్ ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించలని చూడడం వల్ల దస్తావేజులు లేఖరులు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోవాల్సి ఉంటుందని, ఈ నూతన విధానాలతో తమ పొట్ట కొట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దస్తావేజు లేఖరులు పట్నాయకుని బాస్కరరావు మాస్టర్, శిరసాన శ్రీనివాస్, రొక్కం జయంత్ కుమార్, ఉర్లాం లక్ష్మణ్, సిబ్బంది జామి కామేశ్వరరావు, నౌపడ మురళి ఉన్నారు.

## గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలి

కోటబొమ్మాళి, జూలై 20 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో స్థానిక ఎంపీపీ స్కూల్‌లోని పాడుబడిన ఒక చిన్న గదిలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నామని, దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని గ్రంథాలయాధికారి రామక్రిష్ణ కోరారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ 1987 నుంచి కోటబొమ్మాళిలో శాఖా గ్రంథాలయం ఉండటం, ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు, దిన, వార పత్రికలు అందుబాటులో ఉన్నాయని దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు నిత్యం వస్తుంటారని, వారు చదువుకొనేందుకు ప్రస్తుతం ఉన్న భవనం శిదిలావస్థకు చేరుకోవడం, కూర్చోటానికి స్థలం లేకపోవడంతో పాఠకులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షకాలం కావడంతో వర్షాలు అడపాదడపా పడుతుండడంతో వర్షానికి భవనం కారిపోవడం వల్ల పుస్తకాలు తడిచిపోతున్నాయని, వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పుకోవాల్సి వస్తుందన్నారు. దీనిపై ఇటీవల రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లానని, ఆయన స్పందించి త్వరలో భవన నిర్మాణానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారన్నారు. అయితే కొత్త భవనం నిర్మాణం జరిగేంతవరకు గ్రామ పెద్దలు తాత్కలికంగా ఒక మంచి గదిని కేటాయించాలని ఆయన కోరారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**సిరిపురం బ్రాంచ్ (09571)**
సిరిపురం, వయా పొందూరు, విజయనగరం జిల్లా. ఫోన్ : 08941-252992
ఇ-మెయిల్ : ubin0809578@unionbankofindia.bank.in

**స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)
[సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్, 2002 (చట్టం నెం.54/2002) ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిరిపురం బ్రాంచ్ (09571)** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002, అందలి రూలు 3 తో కలిపి చదవవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **10.04.2026 తేదీన జారీచేసిన డిమాండ్ నోటీసు** మీకు అందిన తేది నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.25,20,189.11/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఇరవై వేల నూట ఎనభై తొమ్మిది రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే)** మొత్తమును తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత:** శ్రీ **పున్నా శ్రీనివాసరావు, S/o పున్న వైకుంటం, A.** ప్లాట్ నెం.6, వెస్టర్న్ సైడ్, నాగావళి బ్లాక్, ఫేజ్-1, ఉద్యోగ స్వగృహ లేఅవుట్, తోటపాలెం గ్రామం మరియు పంచాయితీ, ఎచ్చెర్ల మండలం, పొందూరు, శ్రీకాకుళం జిల్లా-532 005 & **B.** శ్రీ సాయి దుర్గ టీ & టిఫిన్ సెంటర్, బలగ మెట్టు, శ్రీకాకుళం-532001 & **C.** ప్లాట్ నెం.2117, 5వ లైన్, బావాజీ నగర్, శ్రీకాకుళం టౌన్ & మున్సిపాలిటీ-532 001 వారిని కోరుతూ డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారు సదరు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **15 జూలై 2026 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు & హామీదారులను హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తితో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించి ఎట్టి లావాదేవీలు జరిపిన అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెల్లించవలిసిన బకాయి **తేది.10.04.2026 నాటికి రూ.25,20,189.11/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఇరవై వేల నూట ఎనభై తొమ్మిది రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే)** ప్లస్ URI మరియు ఖర్చులతో కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు మరియు హామీదారు'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని కోరడమైనది.

**స్థిరాస్తి వివరములు:**

ప్రైమరీ సెక్యూరిటీ : శ్రీకాకుళం జిల్లా, పొందూరు, ఎచ్చెర్ల మండలం, తోటపాలెం గ్రామం మరియు పంచాయతీ పరిధి, సర్వే నెం.274-1,2,3,4 నందు ఉద్యోగ స్వగృహ లేఅవుట్‌లోని నాగవళి బ్లాక్ ఫేజ్-1, ప్లాట్ నెం.6 యొక్క పడమర వైపున విస్తీర్ణం 108.33 చ॥గ॥లులోని అసెస్‌మెంట్ నెం.831 తో నిర్మించబడిన రెసిడెన్షియల్ భవనం. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.6కు తూర్పు వైపున ఉన్న రేగులవలస రమణ మూర్తి గారికి చెందిన ఆస్తి, **దక్షిణం:** 30 అ॥ల లేఅవుట్ రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.5లో ఉన్న గుండుబోల కృష్ణ చైతన్య గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం:** ప్లాట్ నెం.3లో ఉన్న చెంచల హైమావతి గారికి చెందిన ఆస్తి.

తేది : 15.07.2026
ప్రదేశం : సిరిపురం

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు



విజయనగరం, జూలై 20,ప్రభాతవార్త:

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మండలంలోని చెల్లూరు రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం జరిగిన ఎరువులు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎరువులు పంపిణీలో అందరూ రైతులకు సమన్యాయం జరిగేందుకు ప్రభుత్వం యాప్ ను అమలు చేస్తుందని అన్నారు. యాప్ విధానాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా బాధపడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నదని అన్నారు. .ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతుల ఆధార్ నెంబర్ ప్రకారం ఎలా ఎరువు కేటాయింపు జరుగుతుంది.మొదటి దఫా ఎంత వస్తుంది.రెండవ దఫా ఎంత వస్తుంది అనేది అప్ లో మండల వ్యవసాయ అధికారి విజయనగరం వ్యవసాయ గ్రామ సహాయకులు ఆర్. సందీప్ ను అడిగి తెలుసుకున్నారు..తదుపరి అధిక రసాయనిక ఎరువులు వేసి వాటి వల్ల వచ్చే క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశ్యం తో శాస్త్రవేత్త ల సిఫారసు మేరకు రైతు లకు ఎంత ఎరువు వేస్తే ప్రమాదకర అవశేషాలు లేకుండా పంట ఉత్పత్తులు వస్తాయనే విషయం మేరకు యాప్ ను తయారు చేసి అమలు చేస్తున్నామన్నారు .కావున రైతాంగం పంటకు ముందే సరిపడ ఎరువులు మండలంలో 6 రైతు సేవ కేంద్రం లలో పెట్టడం జరిగిందని కావున ఆందోళన చెందకుండా వారికి కేటాయించిన మోతాదు రైతు సేవ కేంద్రం సహాయకుల ద్వారా పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విజయనగరం సహాయ వ్యవసాయ సంచాలకులు టి. సంగీత,మండల నాయకులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. సోమవారం కొండకరకం,రాకోడు గ్రామాలలో కూడా రైతు సేవ కేంద్రం లలో యూరియా సరఫరా ప్రారంభించి నట్లు అధికారులు తెలిపారు.

# కూటమి పాలనలో అవినీతి, అహింస రాజ్యమేలుతోంది

## జగన్-2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ లో మాజీ ఎంపీ బెల్లాన ఆక్షేపణ

గరివిడి, జూలై 20, ప్రభాత వార్త:



రాష్ట్రంలో కూటమి పాలనలో అవినీతి, అహింస రాజ్యమేలుతోందని విజయనగరం మాజీ పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ ఆక్షేపించారు. అంతా డైవర్షన్ పాలిటిక్స్ కూటమి సర్కారు నడుపుతోందని ఆయన మండిపడ్డారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో జగన్ 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం డాక్టర్ బొత్స అనూష ,చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ 2.0 యాప్ వేదికగా కూటమి అవినీతి నిగ్గు తేల్చాలని అన్నారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలు కష్టాలు, కన్నీళ్లు అన్నీ యాప్ ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. కూటమి హామీలు వట్టి బూటకమని ఆరోపించారు. వాలంటీర్ల వేతనాలు పెంచలేదు, సూపర్ సిక్స్ అంతా నాటకమే నన్నారు. 2.0 సూపర్ యాప్ వేదికగా కూటమి అవినీతి అకృత్యాలు వెలుగులోకి తేవాలన్నారు. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో సుశిక్షితులైన 11 వేలు మంది వైకాపా కార్యకర్తలు ఈ యాప్ ని డౌన్లోడ్ చేసుకోవాలని బెల్లాన పేర్కొన్నారు. తొలుత ప్రసంగించిన వైకాపా యువనాయకురాలు డాక్టర్ బొత్స అనూష వైకాపా సైన్యం అంతా యాప్ ని వినియోగించుకోవాలని కోరారు. వైకాపా గుర్తింపు కార్డుల ఫోటో లకు సంబంధించి ప్రతీఒక్కరూ వారంలోగా ఆ కార్యక్రమం పూర్తి చేయాలని పేర్కొన్నారు. కూటమి అవినీతి ని సోషల్ మీడియా వేదికగా ప్రజలకు తెలపాలని ఆమె పిలుపునిచ్చారు.

# రోడ్డు పైకి వెదురు బొంగు-ప్రమాదాలకు సంకేతం..



శృంగవరపుకోట,జూలై20,ప్రభాతవార్త..

ఎస్.కోట-అరుకు ప్రధాన రహదారిలో రోడ్డు పైకి వచ్చిన వెదురు బొంగు ప్రమాదాలకు సంకేతమిస్తుంది.కాపు సోంపురం సమీపంలో దట్టమైన వెదురు బొంగు రోడ్డు పైకి పాకడంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు అడ్డంగా నిలవడంతో ఏసమయంలో ప్రమాదాలు సంభవిస్తాయోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో ప్రయాణించినపుడు ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు మరింత భయాందోళన చెందుతున్నారు.ఆర్అండ్ బి అధికారులు స్పందించి వెంటనే వెదురు బొంగును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

# 581 మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు..

## పాఠశాల హెచ్ఎం యు ఉమామహేశ్వరి..

చీపురుపల్లి జూలై 20 ప్రభాతవార్త



జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు సోమవారం నాడు చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 581 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం యు ఉమామహేశ్వరి తెలిపారు. వైద్య పరీక్షల్లో భాగంగా విద్యార్థులలో హిమోగ్లోబిన్, ఎత్తు, బరువు, వంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధముగా విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు కూడా నిర్వహించారని ఈ సందర్భంగా ఆమె వివరించారు. వైద్య శాఖ నుండి ఎం ఎల్ హెచ్ పి లు చిన్నదేవి, మమత, సోమేశ్వరి తో పాటు ఏఎన్ఎంలు ఎస్.కె. బేగం, పి .రమణమ్మ, బిందు నాగమణి, ఆశ వర్కర్లు పి లక్ష్మి, వై పార్వతి, ఎం భూలక్ష్మి పాల్గొన్నారు.

# చదరంగముతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..

## జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ ఏడిఎన్ఎస్వి ప్రసాద్



చీపురుపల్లి జూలై 20 ప్రభాతవార్త

విద్యార్థి దశ నుండి చదరంగం పట్ల ఆసక్తి కనబరిచి న ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా సెస్ అసోసియేషన్ కార్యదర్శి ఏడిఎన్ఎస్ వి ప్రసాద్ అన్నారు. చీపురుపల్లి శ్రీనివాస జూనియర్ కళాశాలలో సోమవారం నాడు ఇంటర్నేషనల్ చెస్ డే ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చదరంగ పోటీలతో పాటుగా కళాశాలలో నిర్వహించిన ఎగ్జిబిషన్ నందు 95 దేశాలు పైగా చదరంగంపై విడుదల చేసిన స్టాంపులు, ఫస్ట్ డే కవర్లు, స్పెషల్ డే కవర్లు, ప్రదర్శించడం తో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ మరియు కళాశాల ప్రిన్సిపాల్ అయిన ఏ .డి .ఎన్. ఎస్. వి. ప్రసాద్ మాట్లాడుతూ చదరంగం అన్ని వయసులవారు నేర్చుకోవలసిన ఆట అని ప్రతి విద్యార్థి పిల్లలలో జ్ఞాపకశక్తి ఆలోచన విధానం, స్థిరంగా కూర్చోవడం ఓపిక సహనం వంటి అలవాట్లు ఏర్పడతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా 12 సంవత్సరాలలోపు గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు ఆసక్తి ఉంటే సంప్రదిస్తే ఉచితంగా నేర్పుతానని ప్రకటించారు.ఆసక్తి ఉన్నవారు కళాశాలలో గాని 9642546955 నెంబరు కు గాని సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మూర్తి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాళ్ల సురేష్

రామభద్రపురం.. జులై 20..ప్రభాత వార్త

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష వర్క్,ఆర్ట్,వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లాకు చెందిన కాళ్ల సురేష్ ను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. విజయవాడ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనం లో జరిగిన రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సైతం శివకుమార్ రెడ్డి అధ్యక్షతన సురేష్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పూర్వ ప్రధాన కార్యదర్శి భాగవతుల శంకరరావు సురేష్ పేరును ప్రతిపాదించగా రాష్ట్ర కార్యవర్గము,వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగినది. సురేష్ ప్రస్తుతం విజయ నగరం జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే కోర్ కమిటీ సభ్యునిగా విజయనగరం జిల్లాకు చెందిన మండల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈయన ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గంలో కన్వీనర్గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర కమిటీ అప్పగించిన బాధ్యతలను తూచ తప్పకుండా ఆచరిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నాయకత్వాలను కలుపుకొని రాష్ట్ర కార్యవర్గ సలహాలు సూచనలతో పిటిఐల సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేస్తామని ప్రధాన కార్యదర్శి సురేష్, కోర్ కమిటీ సభ్యులు వెంకటరమణ పేర్కొన్నారు. వీరి ఎన్నిక పట్ల రాష్ట్ర నమిటీ సభ్యులు జి.కామేష్,నాగరాజారావు, పద్మారెడ్డి,ప్రభాకర్, విజయనగరం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శేఖర్ప్రసాద్, కన్వీనర్ సత్తిబాబు, ఏపీజేఈసీ అమరావతి కో-కన్వీనర్ వనజాక్షి,కోశాదికారి శివబ్రహ్మం,ఆర్గనైజింగ్ కార్యదర్శి పరమేశ్వర రావు, తాడ్డి శ్రీను పిటిఐలు హర్షం వ్యక్తం చేశారు.

# జీవో నెంబర్ 396.. ఉపహరించి జీవితాలను ఆదుకోండి..

## దస్తావేజర్లు స్టాంపు వెండర్ల డిమాండ్..




బొబ్బిలి జూలై 20.. ప్రభాత వార్త

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని చేస్తూ ప్రభుత్వం విడుదల చేస్తున్నాం జీవో నెంబర్ 396 ను ఉపసంహరించుకోవాలని కోరుతూ బొబ్బిలి జాయింట్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలో గల దస్తావేజులేఖరులు వారి సహాయకులు స్టాంపవెండర్ డిటిపి ఆపరేటర్లు సోమవారం నాడు బొబ్బిలిసబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ షాంపుల శాఖను ప్రైవేట్ కరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న జీవో ఎంఎస్ నెంబర్ 396 వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం కారణంగా దస్తావేజు లేఖలు వారి సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధిని కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడవలసిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధతలేని ప్రైవేట్ సంస్థల పరం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణమైందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి మార్పులు జరగడం వలన అవకతవకులు జరిగి ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది కనుక ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానాన్ని ప్రతిపాదనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖల సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు తమ కార్యాలయ పరిధిలో గల దస్తావేజు లేఖలు వారి సహాయకులు సామూహిక నిర్ణయంతో ఈ నెల 20 నుండి 31 వరకు 11 రోజులపాటు సామూహిక పెండౌన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు దస్తావేజులేఖరులు స్టాంపులు డిటిపి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాళ్ల సురేష్

రామభద్రపురం.. జులై 20..ప్రభాత వార్త



ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష వర్క్,ఆర్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లాకు చెందిన కాళ్ల సురేష్ను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. విజయవాడ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సైతం శివకుమార్ రెడ్డి అధ్యక్షతన సురేష్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పూర్వ ప్రధాన కార్యదర్శి భాగవతుల శంకరరావు సురేష్ పేరును ప్రతిపాదించగా రాష్ట్ర కార్యవర్గము,వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగినది. సురేష్ ప్రస్తుతం విజయనగరం జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే కోర్ కమిటీ సభ్యునిగా విజయనగరం జిల్లాకు చెందిన మండల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈయన ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గంలో కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర కమిటీ అప్పగించిన బాధ్యతలను తూచ తప్పకుండా ఆచరిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నాయకత్వాలను కలుపుకొని రాష్ట్ర కార్యవర్గ సలహాలు సూచనలతో పిటిఐల సమస్యల పరిష్కారంలో తమ వంతు కృషి చేస్తామని ప్రధాన కార్యదర్శి సురేష్, కోర్ కమిటీ సభ్యులు వెంకటరమణ పేర్కొన్నారు. వీరి ఎన్నిక పట్ల రాష్ట్ర నమిటీ సభ్యులు జి.కామేష్, నాగరాజారావు, పద్మారెడ్డి,ప్రభాకర్ మరియు విజయనగరం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శేఖర్ ప్రసాద్, కన్వీనర్ సత్తిబాబు, ఏపీజేఈసీ అమరావతి కో-కన్వీనర్ వనజాక్షి,కోశాదికారి శివబ్రహ్మం,ఆర్గనైజింగ్ కార్యదర్శి పరమేశ్వర రావు, తాడ్డి శ్రీను పలువురు పిటిఐలు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా వైద్యాధికారిని కలసిన ఎన్.టి.ఆర్ వైద్య సేవా మేనేజర్ రాంబాబు



పార్వతీపురం, జూలై20, ప్రభాతవార్త

జిల్లా వైద్యాదికారినిగా (డి ఎం అండ్ హెచ్.ఓ )బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ విజయలక్ష్మి ని డాక్టర్ ఎన్. టి. ఆర్ వైద్య సేవా ఉమ్మడి జిల్లాల మేనేజర్ దూబ రాంబాబు సోమవారం ఆమె ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛన్ని అందజేశారు.ఈ సందర్బంగా దూబ రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ ఎన్. టి. ఆర్ వైద్య సేవా ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు గురించి డాక్టర్ విజయలక్ష్మి కి వివరించారు.

# కార్యకర్తల ఆరోగ్యమే పార్టీకి శ్రీరామరక్ష

కొమరాడ జులై 20 ప్రభాతవార్త



కార్యకర్తల ఆరోగ్యమే పార్టీకి శ్రీరామరక్ష అని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. సోమవారం కొమరాడ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ కేడర్ కోసం నిర్వహించిన రక్త పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల ఆరోగ్యం కోసం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ బాబు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమై ఉండే పార్టీ క్యాడర్ ఆరోగ్యంగా ఉండాలన్న ఆకాంక్షతోనే ఈ శిబిరాన్ని పార్టీ ఏర్పాటు చేసిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఉదయ శేఖర పాత్రులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్, కురుపాం నియోజకవర్గ పరిశీలకులు ఎం వెంకటేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీ శంకర్,తెదేపా నాయకులు పి వెంకట నాయుడు, సుదర్శన్ రావు, డి వెంకట నాయుడు మధుసూదన్ రావు, రాఘవేంద్రరావు, గొట్టాపు త్రినాథం, హెచ్ బలరాం, భానుజీరావు, హరి ప్రసాద్, బత్తిలి శ్రీనివాసరావు తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూడికతీత పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,జూలై20,ప్రభాతవార్త...



మండలంలోని వేములాపల్లి గ్రామం వద్ద తాటిపూడి జలాశయం జేపే ఛానల్ పూడికతీత పనులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు.జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నుంచి మంజూరైన రూ.6 లక్షల వ్యయంతో ఈపనులను చేపట్టారు.ఛానల్ ఛైర్మన్ లగుడు ఎర్రినాయుడు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు రూ.4.5 కోట్లతో జేపే ఛానల్ సిస్టమ్ను అభివృద్ధి చేసి సుమారు 2,600 ఎకరాలకు సాగునీరు అందించారని గుర్తుచేశారు.వ్యవసాయంతో పాటు తాటిపూడి పైలెట్ ప్రాజెక్ట్ (ఆర్డబ్ల్యూఎస్ స్కీమ్) ద్వారా ప్రజలకు తాగునీరు అందించేందుకు కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు.రైతే రాజు అనే నినాదంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని వచ్చే ఏడాది కల్లా ఛానల్ పూడికతీత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఆమె రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెక్కులు ఎప్పుడు పంపిణీ చేస్తారు..

## ఎమ్మెల్సీ ఇంటి వద్ద రైతులు ఆందోళన



శృంగవరపుకోట,జూలై20,ప్రభాతవార్త..

జిందాల్ పరిహారం చెక్కులు ఎప్పుడు పంపిణీ చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు బొడ్డవర ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసం వద్ద సోమవారం జిందాల్ రైతులు నిరసనలు వ్యక్తం చేశారు.మీద్వారా జిందాల్ సంస్థకు భూములిచ్చామని మీరు మాకు న్యాయం చేసి తగిన నష్ట పరిహారం అందించేందుకు ఎంతో కృషి చేశారని అయితే ఈనెల 13వ తేదీన చెక్కులు పంపిణీ చేస్తామని జిందాల్ వ్యవహారంలో ప్రభుత్వానికి రైతులకు వారదిగా వ్యవహరించిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారని ఇప్పుడు 20వ తేదీ వచ్చినా చెక్కులు పంపిణీ చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎప్పుడు చెక్కులు పంపిణీ చేస్తారని రైతులు ఎమ్మెల్సీ రఘురాజును ప్రశ్నించారు.అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు వెంటనే హోంమంత్రి అనితతో ఫోన్లో మాట్లాడారు.త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామని ఆమె హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ రఘురాజు రైతులకు వివరించారు.దీంతో రైతులు నిరసనలు విరమించారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
వార్త 25

# యోగ పోటీలలో జిల్లా స్థాయిలో వరలక్ష్మికి మూడవ స్థానం..



చీపురుపల్లి జూలై 20 ప్రభాతవార్త

జిల్లా యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీలలో చీపురుపల్లి కి చెందిన వరలక్ష్మి మూడవ స్థానాన్ని దక్కించుకొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల స్థానికంగా పలువురు ఆమెను అభినందించారు. విజయనగరంలోని రామకృష్ణ మిషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో 35 నుండి 40 కేటగిరీలలో ఈమె మూడవ స్థానాన్ని దక్కించుకొని బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రస్థాయిలో కూడా చీపురుపల్లికి గుర్తింపు తెచ్చే విధంగా కృషి చేయాలని పలువురు కోరారు.

# అపరాధ రుసుం ఎంతేసారు.. ఆ ప్లాస్టిక్ ఏం చేసారు ..!

## విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు కవర్లు దర్శనం -హెల్త్ ఆఫీసర్,సిబ్బంది పనితీరుపై విమర్శలు

సాలూరు జూలై 20 ప్రభాతవార్త



సాలూరు పట్టణంలో ఎక్కడపడితే అక్కడ నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు జోరుగా సాగు తున్నాయి. అలాగే ప్లాస్టిక్ గ్లాసులు ఇంకా కవర్లు నిషేదం కేవలం పురపాలిక అధికారులు చేపడుతున్న ప్రోగ్రామ్స్కి అలాగే కాగితాలకే పరిమితం అవుతున్న ట్టుగా విమర్శలు వినపడు తున్నాయి. అంతేకాకుండా శానిటేషన్ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ఇది మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పెదవి ఇరుస్తున్నారు.ఇది ఇలాఉంచితే సోమవారం సమాచారం మేరకు స్థానిక శివాజీబొమ్మ సెంటర్ లో ఎన్నోఏళ్లుగా పాతుకుపోయిన ప్లాస్టిక్ అమ్మకాలు చేపడుతున్న దుకాణంపై ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ ఇంకా సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ దాడిలో ప్లాస్టిక్ గ్లాసులు ఇంకా కవర్లు సుమారు 200 కేజీల నిషేధిత ప్లాస్టిక్ ను సీజ్ చేశారు.అలాగే ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే దుకాణ యజమానికి అపరాధ రుసుం ఎంత ఏసారో ఇంకా స్వాధీనం చేసుకన్న ప్లాస్టిక్ ఏం చేశారో మాత్రం గోప్యంగా ఉంచడంలో సీక్రెట్ ఏమిటని ఆరోపణ వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇది మొదటిసారి కాదనే ఆక్షేపణలు కూడా ఉన్నాయి. ఇలాచుట్టం చూపుగా తనికీలకు వెళ్లి తూతుమంత్రంగా ఫైన్ వేస్తే పనిజరగదని దుకాణ యజమానులపై గట్టిచర్యలు తీసుకోవాలని టౌన్ లో పబ్లిక్ టాక్ గట్టిగానే వినపడుతుంది.

# కురుపాం 5 గురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డు



కురుపాం, జూలై20 ప్రభాతవార్త

పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం సైనింగ్ స్టార్ అవార్డులు అందజేసింది. సోమవారం వీటిని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర,, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డులను కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో అందజేశారు. కురుపాం ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు నలుగురికి డి పీ వీడి జడ్పీ హైస్కూల్ విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు దక్కడం పాఠశాలలకు ఎంతో గర్వకారణం. ఏపీ మోడల్ పాఠశాలలో చదివి అవార్డు పొందిన విద్యార్థులు నెల్లి శ్రీనిధి, నిమ్మక మహేశ్వనీ దేవి, మండంగి ఐశ్వర్య, కొప్పిశెట్టి దేవిశ్రీ, లకు, జడ్.పి.హెచ్. ఎస్ చదివిన విద్యార్థి నూకేశ్వరరావులకు అవార్డులు అందజేశారు. వీటితోపాటు 20వేల రూపాయల చెక్ లను ఒకొక్కరికి అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ , సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సంతలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

కురుపాం, జులై 20 ప్రభాతవార్త.



కురుపాం మండలం నీలకంఠాపురం వారపు సంతలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు నీలకంఠాపురం సబ్ ఇన్స్పెక్టర్ పి రమేష్ నాయుడు అవగాహన కల్పించారు సోమవారం సంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తే మాదగ ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటి వలన జరిగే అనర్థాలను వివరించారు.అలాగే వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనానికి సంబంధించిన నకలలు తప్పనిసరిగా ఉండాలని ఆయన వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ సంచులును చెత్త కోసం వినియోగించుకోవాలి



దత్తిరాజేరు జులై 20. ప్రభాత వార్త

పర్యావరణ పరిరక్షణ మరియు పారిశుధ్యం కోసం ఇళ్లల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ఒక నిర్దిష్టమైన డబ్బా లేదా సంచిలో సేకరించి తడి పొడి చెత్తను వేరు చేయాలని ఈ సులువైన పద్ధతిని ప్రతి ఒక్కరు పాటించాలని పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ అన్నారు మరడాంలో బిన్ బాగ్ పద్ధతి గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు తడిచెత్తకు ఒక డబ్బా పొడిచెత్తకు ఒక కవరు వేరువేరుగాచేసి మీగ్రామానికి స్వచ్ఛ రథం బండి వస్తాదన్నారు ఆ బండి వచ్చేటప్పుడు మీరు నిల్వ చేసిన చెత్తను స్వచ్ఛ రథం బండి వాళ్లు కొనుగోలు చేసి మీ ఇంటికి అవసరమైన సరుకులను ఇస్తారన్నారు ప్లాస్టిక్ కవర్లు చిరిగిపోకుండా మరియు జారిపోకుండా గట్టిగా పట్టుకునేలా అమర్చడానికి మరియు తొలగించడానికి ఉపయోగించే సులువైన పద్ధతిని బిన్ బ్యాగ్ మెథడ్ లేదా ఇన్వెస్ట్ మెథడ్ అంటారు దీని వల్ల కవర్లు అంచుల నుండి లోపలికి పడిపోవు అన్నారు దీనిని ప్రతి ఒక్కరు పాటించాలి అన్నారు.

# కోడికళ్ళవలసలో జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

పాచిపెంట జూలై 20 ప్రభాతవార్త



కోటికి పెంట పంచాయతీ లో గల కోడి కాళ్ళ వలస గిరిజన గ్రామంలో వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను సోమవారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కోటికి పెంట పంచాయతీ గ్రామటిడిపి నాయకులు రాకోటి పాపారావు పారిశుద్ధ్యపనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే గ్రామంలో ఎవరి ఇంటి ముందు కాలువల్లో ఇంట్లో చెత్త వీధికాలువల్లో పారవేరాదని చెత్త బట్టల్లో ఎవరి ఇంటి ముందు వారు భద్రపరిచి పారిశుద్య కార్మికులు లేదా ఆ చెత్తను ఊరు బయట ఎవరికి ఇబ్బంది కలగకుండా పారువేయాలని కోరారు. కాలవల్లో చెత్త వేయడం వలన మురికినీరు దోమల గుడ్లు పెట్టి ఇళ్లల్లో చేరి రాత్రి సమయంలో మనకి కుట్టడం వలన పలు రోగాల భారీన పడతామనీ ఆయన అన్నారు. అలాగే విధంగా ప్రతి ఒక్కరూ ఎవరి ఇంటి ముందు వారు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాల్చిన వేడినీరు వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు తెలిపారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్య పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

21-07pg10.qxd:21-07pg10.qxd 1/1/02 6:43 AM Page 1



# టీమిండియాకు మిడిల్ ఓవర్ బౌలర్ కొరత

## భారత్ మ్యాచ్ విన్నర్ బెంచ్‌కే పరిమితం

## ఇంగ్లండ్ వన్డే ఓటమిపై పోస్ట్‌మార్టమ్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా ఓటమి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. వీటిలో అత్యంత చర్చనీయాంశంగా ఉన్నది కుల్దీప్ యాదవ్. తన స్పిన్‌తో ప్రపంచవ్యాప్తంగా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టినప్పటికీ, అతనికి మూడు మ్యాచ్‌లలో ఒక్క అవకాశం కూడా లభించలేదు. లార్డ్స్‌లో జరిగిన మూడవ వన్డేకు గాయం కారణంగా జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాల్సిన అవసరం లేదని భావించారు. వన్డే ఓటమిపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు పోస్ట్‌మార్టంలో కుల్దీప్ వ్యవహారం విమర్శపాలైంది. ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్ నుంచే, వికెట్లు తీస్తూ పరుగులు నియంత్రించడంలో నైపుణ్యం ఉన్న మిడిల్ ఓవర్ బౌలర్ కొరత టీమ్ ఇండియాకు ఏర్పడింది. ఈ పాత్రకు కుల్దీప్ యాదవ్ కంటే మెరుగైన ఆటగాడు లేడు. మొదటి వన్డేలో, 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు 258 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత, రెండవ వన్డేలో, 53 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ, వారు 234 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో, జస్ప్రీత్ బుమ్రాను తుది జట్టులోకి తీసుకోకపోవడం వల్ల 192 పరుగుల వద్ద మొదటి వికెట్ పడింది. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం అతని కెరీర్‌పై ప్రశ్నలను లేవనెత్తింది. జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోయినప్పటికీ లార్డ్స్ వన్డే తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. కుల్దీప్ యాదవ్ యొక్క అద్భుతమైన రికార్డును చూస్తే అతను మూడు ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో అతను తనను తాను నిరూపించుకున్నాడు. 121 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో, అతను 118 ఇన్నింగ్స్‌లలో 194 వికెట్లు పడగొట్టాడు. అతని చివరి వన్డే ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగింది, ఆ మ్యాచ్‌లో అతను 10 ఓవర్ల స్పెల్‌లో 42 పరుగులిచ్చి వికెట్లేమీ తీయలేదు. అయితే, జట్టు యాజమాన్యం కేవలం ఒక మ్యాచ్ ఆధారంగా కుల్దీప్‌ను అంచనా వేసి పొరపాటు చేసిందనే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.



## దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు కెప్టెన్‌గా రుతురాజ్

**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు నాయకత్వం రుతురాజ్ గైక్వాడ్ వహించనున్నాడు. ఈ దులీప్ ట్రోఫీ ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ 2026-2027 సీజన్‌కు కూడా జోనల్ ఫార్మాట్‌లోనే కొనసాగుతుంది. ముంబై చీఫ్ సెలెక్టర్ రాజేష్ పవార్ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశం అనంతరం సోమవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో, మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా, ముంబైకి చెందిన షామ్స్ ములానీని వెస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా నియమించారు. గత సీజన్‌లో జట్టుకు నాయకత్వం వహించిన పేసర్ శార్దూల్ ఠాకూర్ నుండి, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న మరియు ఇటీవల శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌లతో జరిగిన ట్రైసిరీస్‌లో ఇండియా ఎ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన గైక్వాడ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆగస్టు 23, 26 తేదీలలో జరిగే టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ 2లో వెస్ట్ జోన్, నార్త్ జోన్‌తో తలపడుతుంది. దులీప్ ట్రోఫీలో ఫైనల్‌తో సహా మొత్తం ఐదు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి సెప్టెంబర్ 6 నుండి 10 వరకు దివీని గ్రౌండ్ 1లో ఆడబడతాయి. కెప్టెన్ గైక్వాడ్ నేతృత్వంలో పృథ్వీ షా, ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, శివాలిక్ శర్మ, జయమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్ వంటి బ్యాటింగ్ ఎంపికలు జట్టుకు యువత, అనుభవం కలయికను అందిస్తున్నాయి. ఈ జట్టులో సౌరాష్ట్ర నుండి ఏకైక ఆటగాడైన హార్విక్ దేశాయ్, గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్ ఇద్దరూ వికెట్ కీపర్లుగా ఉంటూ, జట్టుకు వికెట్ల వెనుక బలమైన ప్రత్యామ్నాయాలను అందించనున్నారు.






# స్పెయిన్‌దే ఫుట్‌బాల్ ప్రపంచకప్

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. 106వ నిమిషంలో స్పెయిన్ ప్లేయర్ ఫెర్రాన్ టొర్రెస్ అద్వితీయమైన గోల్‌తో చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండో ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2010లో తొలి ప్రపంచకప్‌ను గెలుచుకున్న స్పెయిన్ 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ విశ్వవిజేతగా నిలిచింది. ఈ ఫైనల్లోస్పెయిన్ టికి టాకా వ్యూహం ముందు అర్జెంటీనా తేలిపోయింది. ఫైనల్లో పూర్తిగా స్పెయిన్ ఆధిపత్యం కనబర్చింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్న స్పెయిన్ అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై పదే పదే దాడి చేసింది. కానీ ఆ జట్టు గోల్ కీపర్ మార్టినెజ్ అడ్డుగోడలా నిలిచాడు. లేకుంటే అర్జెంటీనా ఘోర పరాజయాన్ని మూటగట్టుకునేది. స్పెయిన్ ఆటలో 68 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించింది. అంతేకాకుండా అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై 11 సార్లు దాడి చేసింది. తమ టికీ టాకా వ్యూహంతో చిన్న చిన్న పాస్‌లు ఇచ్చుకుంటూ ఆటను వేగంగా నడిచేలా చూసుకుంది. ప్రత్యర్థి ప్రణాళికలను ముందే పసిగడుతూ చెలరేగింది. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండో 90+3 నిమిషంలో రెడ్ కార్డుతో బయటకు వెళ్లి పోవడం ఆ జట్టు కొంపముంచింది. దాంతో అర్జెంటీనా 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆటను కొనసాగించాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. ఫైనల్లో గోల్ కొట్టి స్పెయిన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫెర్రాన్ టొర్రెస్‌కు సుపీరియర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

## ఫిఫా వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు

**న్యూఢిల్లీ:** ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్ట్‌లతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టను వరించింది.





## స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్‌కు టైటిల్

**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్ ఏటీపీ టైటిల్‌ను గెలుచుకున్నాడు. స్విస్ ఓపెన్‌లో, గ్రీస్‌కు చెందిన స్టెఫానోస్ సిట్సిపాస్ బెల్జియంకు చెందిన రాఫెల్ కొలిగ్నాన్‌పై మూడు సెట్ల విజయంతో దాదాపు ఏడాదిన్నర తర్వాత ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మాజీ ప్రపంచ ర్యాంకర్ 3, క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో 6-4, 6-7 (3), 6-3 తేడాతో గెలిచి, తన కెరీర్‌లో 13వ ట్రోఫీని, ఫిబ్రవరి 2025లో దుబాయ్ తర్వాత మొదటి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 27 ఏళ్ల అతను 2021లో తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ అయిన మూడో స్థానం నుండి ప్రపంచ ర్యాంకింగ్‌లో 85వ స్థానానికి పడిపోయాడు మరియు ఆ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2023లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. సిట్సిపాస్ 2019లో లండన్‌లో జరిగిన ఏటీపీ మాస్టర్స్‌ను, అలాగే 2021, 2022 మరియు 2024లో మూడుసార్లు మాంటె కార్లో మాస్టర్స్‌ను కూడా గెలుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 42వ స్థానంలో ఉన్న 24 ఏళ్ల కొలిగ్నాన్, సెమీఫైనల్స్‌లో అర్జెంటీనాకు చెందిన జువాన్ మాన్యుయెల్ సెరుండోలోను ఒక మ్యాచ్ పాయింట్‌తో ఓడించి, తన మొదటి ఏటీపీ ఫైనల్ ఆడుతున్నాడు.

## రాణించడమే నా బాధ్యత

### రిటైర్మెంట్ పై రోహిత్




**న్యూఢిల్లీ:** లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన చివరివన్డే మ్యాచ్‌లో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 138 పరుగులతో అద్భుతమైన సెంచరీ సాధించినప్పటికీ భారత్‌కు విజయాన్ని అందించలేకపోయాడు. 110 బంతుల్లో అయిదు భారీ సిక్సర్లు, ఏడు మెరుపు బౌండరీలతో హిట్ మ్యాన్ 138 పరుగులు బాదాడు. లాఫ్టెడ్, హుక్, లాంగ్, స్వీప్, కవర్ డ్రైవ్ ఇలా దాదాపు అన్ని షాట్లతో రెచ్చిపోయాడు. ఈ సెంచరీతో రోహిత్ శర్మ ఎన్నో అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకుని ఐకాన్‌గా నిలిచాడు. వన్డే సిరీస్ ఓటమి అనంతరం రోహిత్ శర్మ మాట్లాడాడు. తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించాడు. తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను తేలిగ్గా తీసుకున్నాడు. వాటిని కొట్టిపారేశాడు. దేశం కోసం రాణించడమే ఓ క్రికెటర్ గా తన బాధ్యత అని స్పష్టం చేశాడు. తన భవిష్యత్ గురించి వస్తోన్న వ్యాఖ్యలు విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వట్లేని, క్రీడా జీవితంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రచారాలు సహజమేనని, ఆట ద్వారా మాత్రమే వీటికి సమాధానం ఇస్తానని పేర్కొన్నాడు. కెరీర్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచే తన చుట్టూ ఇటువంటి వాతావరణం ప్రచారంలో ఉందని, అవి లేకపోతే ఎంటర్టైన్మెంటే ఉండబోదని నవ్వుతూ చెప్పాడు. విరాట్ కోహ్లీ గురించి మాట్లాడుతూ కెరీర్ ప్రారంభం నుండే కలిసి ప్రయాణిస్తోన్నామని, క్రీజ్ లో ఉన్నప్పుడు ఒకరి వ్యూహాలను ఒకరు పంచుకుంటూ బ్యాటింగ్ చేస్తుంటామని, అది విజయానికి దోహదపడుతుందని వివరించాడు. లార్డ్స్ వన్డే ఓటమిపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులోని యువ బౌలర్లకు వన్డే ఫార్మాట్‌లో తగినంత అనుభవం లేదని, వారు రాణించడానికి మరికొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ఈ ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తు సిరీస్‌లలో ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ పర్యటనలో లభించే కఠిన సవాళ్లు ఓ క్రికెటర్‌గా తనకు ఎంతో సంతృప్తిని ఇస్తాయని వ్యాఖ్యానించాడు.

# విదేశీ డిపాజిట్ల సమీకరణలో బ్యాంకుల రికార్డు

## ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్లపై 20.712 బిలియన్ డాలర్ల సేకరణ



**న్యూఢిల్లీ:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన విదేశీ నిధుల డిపాజిట్ పథకానికి విశేష స్పందన లభించింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన చర్యల ద్వారా జూన్ 8 నుంచి జూలై 17, 2026 వరకు బ్యాంకులు 17.4 బిలియన్ డాలర్ల తాజా ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లను సమీకరించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇదే కాలంలో ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ ద్వారా 1.97 బిలియన్ డాలర్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ద్వారా మరో 1.342 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ఈ మూడు మార్గాల్లో మొత్తం 20.712 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు దేశంలోకి వచ్చాయి. విదేశీ మూలధన పెట్టుబడులు, డిపాజిట్లను ప్రోత్సహించడం, దేశ చెల్లింపుల సమతుల్యతను బలోపేతం చేయడం, విదేశీ మారక నిల్వలను పెంచడం ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశం. ఈ ప్యాకేజీలో భాగంగా, కొత్తగా సమీకరించే ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీ నిధుల కోసం ఆర్‌బీఐ రాయితీ స్వాప్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ సదుపాయం ద్వారా బ్యాంకులు విదేశీ కరెన్సీలో వచ్చిన నిధులను అనుకూల మారకపు నిబంధనలతో రూపాయిలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లకు స్వాప్ విండో సెప్టెంబర్ 30, 2026 వరకు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీలకు డిసెంబర్ 31, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి బ్యాంకులు, విదేశీ పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ అందిస్తున్న రాయితీ స్వాప్ సౌకర్యం వల్ల బ్యాంకులకు కూడా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తోంది. విదేశీ మారక నిధుల ప్రవాహాన్ని పెంచడం, దేశ బాహ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ చర్యలు ఇప్పటికే ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి.

## వాణిజ్యం




### మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పు ప్రతిపాదన లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ,జులై20:** దేశంలో మూలధన లాభాలపై విధించే పన్ను రేట్లలో మార్పులు చేయాలన్న ప్రతిపాదనఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్ను విధానంలో మార్పులపై వస్తున్న ఊహాగానాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానంతో తెరపడింది. పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ మూలధన లాభాల పన్ను రేట్లతో పాటు ఇతర పన్ను విధానాలను ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్ ప్రక్రియలో భాగంగా, దేశంలోని స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమీక్షిస్తామని పేర్కొంది. ప్రస్తుతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లలో మార్పు చేసే ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఇక ఈక్విటీ లావాదేవీలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈక్విటీ లావాదేవీలపై లిగదిబి పన్ను ద్వారా రూ.1, 29,158 కోట్లు వసూలుకాగా అంతకు ముందు ఈ ఆదాయం రూ.72,249 కోట్లు మాత్రమే ఉంది. తాజా గణాంకాల ప్రకారం 79 శాతం వృద్ధి నమోదైంది. స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు పెరగడం, పన్ను వసూళ్ల అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలని ప్రభుత్వం పేర్కొంది.

# ఈ యేడు ఆర్థికవృద్ధి 6.5 -6.8శాతమే

### -డెలాయిట్ ఇండియా




**న్యూఢిల్లీ,జులై 20:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం నుంచి 6.8 శాతం మధ్య వృద్ధిని నమోదు చేసే అవకాశముందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. పండుగల సీజన్‌లో వినియోగ డిమాండ్ పెరగడం, రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సడలింపులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు క్రమంగా స్థిరపడటం వంటి అంశాల కారణంగా ఆర్థిక వృద్ధి రెండో అర్ధభాగంలో మరింత బలపడుతుందని సంస్థ తన తాజా ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం, ఈఏడాది ప్రారంభంలో భారత్ ఆర్థిక వ్యవస్థ గోల్డీలాక్స్ దశలోకి ప్రవేశించింది. ద్రవ్యోల్బణం, వృద్ధి, వడ్డీ రేట్లు వంటి కీలక స్థూల ఆర్థిక సూచీలు సమతుల్య స్థితిలో కనిపించాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేశాయి. కీలక సముద్ర రవాణా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడటం, వస్తు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు రావడం, పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావంతో భారత వాణిజ్య లోటుపెరిగిందని, విదేశీ పెట్టుబడులవిత్‌డ్రా కొనసాగిందని, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తక్కువ కాలంలోనే గణనీయంగా పడిపోయిందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత అనిశ్చితంగా మారిందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న భౌగోళిక పరిణామాలు, ఆర్‌బీఐ తీసుకున్న విధానపరమైన చర్యలు కొన్ని ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనిశ్చితులు, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుదల, ఆహార ధరల పెరుగుదల వంటి అంశాలు వృద్ధికి ప్రధాన ప్రతికూల ప్రమాదాలుగా మిగిలి ఉన్నాయని తెలిపారు ఎఫ్‌టీఏల ద్వారా లభించే మార్కెట్ అవకాశాలను శాశ్వత పోటీ సామర్థ్యంగా మార్చుకోవడం అత్యంత అవసరమని రుమ్కి మజుందార్ సూచించారు. వాణిజ్య విధానాలకు తోడు పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, దేశీయ సరఫరా వ్యవస్థల బలోపేతం, నిబంధనల సరళీకరణ, ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిపై పెట్టుబడులు పెంచాలని ఆమె అభిప్రాయపడ్డారు. ముడి చమురు, ఎరువులు, కీలక ఖనిజాలు, వంటనూనెల ధరలు పెరగడం, రూపాయి బలహీనపడటం వల్ల దేశీయ ధరలపై ఒత్తిడి పెరుగుతోందని నివేదిక తెలిపింది.



### ఈక్విటీ సూచీలను దెబ్బతీసిన ప్రైవేటు బ్యాంకులు

## నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 20:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకుల ఫలితాల తర్వాత ఈ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం వంటి అంశాలు కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. రంగాల వారీగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఎనర్జీ షేర్లు లాభపడగా, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 442.93 పాయింట్లు పడిపోయి 77,708.52 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.80 పాయింట్లు కోల్పోయి 24,238.50 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.47లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ0.21 పెరిగింది. బీఎస్ఈలో2,226 షేర్లు లాభపడగా, 2,039 షేర్లు నష్టపోయాయి. 255 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.780 నుంచి 6.782 శాతానికి స్వల్పంగా పెరిగింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే గత ముగింపు 96.3050 నుంచి 96.4500 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.66 పెరిగి రూ.1,41,793కు చేరాయి. సెప్టెంబర్ 2026 బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 14 సెంట్లు తగ్గి 87.96 డాలర్ల వద్ద ట్రేడైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.08 క్షీణించింది. యాక్సిస్ బ్యాంక్ 5.37 పడిపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.96 నష్టపోయింది. యెస్ బ్యాంక్ 2.80 తగ్గింది. ఐడీబీఐ బ్యాంక్ 2.10 పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం 1.16 లాభపడింది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 0.19 పెరిగింది. కంపెనీ స్వతంత్ర నికర లాభం ఏడాది ప్రాతిపదికన 26.64 పెరిగి రూ.253.70 కోట్లకు చేరింది.




### సైబర్ భద్రతా లోపాలపై సిడిఎస్‌ఎల్‌కు

## సెబీ కోటి జరిమానా

**న్యూఢిల్లీ,జులై 20:** దేశీయ మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2022లో జరిగిన మాల్వేర్ సైబర్ దాడికి సంబంధించి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) రూ.1 కోటి జరిమానా విధించింది. సైబర్ భద్రతా నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ దాడి జరిగిందని, ఇది ముందుగానే ఊహించదగిన ఘటనేనని సెబీ తన ఉత్తర్వులో స్పష్టం చేసింది. విడుదల చేసిన 88 పేజీల ఉత్తర్వులో, సెబీ చట్టం కింద రూ.90 లక్షలు, డిపాజిటరీస్ చట్టం కింద రూ.10 లక్షలు జరిమానా విధించింది. సీడీఎస్ఎల్ మాజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేష్ నడ్కర్ణి, మాజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ మహాజన్పై విచారణను ముగించినప్పటికీ, వారికి ఎలాంటి ఆర్థిక జరిమానా విధించలేదు. సైబర్ దాడి అనేది దురదృష్టకరమైన, ఊహించలేని ఘటన అని సీడీఎస్ఎల్ చేసిన వాదనను సెబీ తిరస్కరించింది. భద్రతా నియంత్రణల్లో జరిగిన నిర్లక్ష్యం వల్లే మాల్వేర్ దాడి జరిగిందని, ఇది పూర్తిగా నివారించగలిగే పరిణామమని సెబీ పేర్కొంది. సెబీ గుర్తించిన ప్రధాన లోపాలుదర్యాప్తులో సీడీఎస్ఎల్ పలు కీలక సైబర్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది.

## 8 కీలక రంగాల వృద్ధి 5 శాతం

### సిమెంట్, ఉక్కు రంగాల జోరు



**న్యూఢిల్లీ,జులై 20:** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే ఎనిమిది కీలక మౌలిక రంగాలు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 5% వృద్ధిని నమోదు చేశాయి. మేలో నమోదైన 3.2% వృద్ధితోపోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన 2023 ప్రామాణికసంవత్సరంతో రూపొందించిన కొత్త శ్రేణి గణాంకా వెల్లడయ్యాయి. జూన్‌లో ముఖ్యంగా సిమెంట్ ఉత్పత్తి 9.8 శాతం పెరిగింది. మేలో ఇది 8.4 శాతం వృద్ధి నమోదు చేయగా, జూన్‌లో మరింత పెరగడం దేశంలో నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకున్నట్లు సూచిస్తోంది. ఉక్కు ఉత్పత్తి కూడా బలమైన ప్రదర్శన కనబరిచింది. మేలో 5.1% పెరిగిన ఉత్పత్తి, జూన్‌లో 4.6% వృద్ధిని నమోదు చేసింది. బొగ్గు ఉత్పత్తి మే నెలలో 9.5% క్షీణించిన తర్వాత జూన్‌లో 1.4% వృద్ధితో కోలుకుంది. ముడి చమురు ఉత్పత్తి మాత్రం ఒత్తిడిలోనే కొనసాగింది. జూన్‌లో ఇది 4.2%తగ్గింది. సహజ వాయువు (నేచురల్ గ్యాస్) ఉత్పత్తి కూడా వరుసగా క్షీణిస్తూ జూన్‌లో 7.4 శాతం పడిపోయింది. మేలో ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. ఎరువుల ఉత్పత్తి జూన్‌లో 3.3 శాతం తగ్గింది. మేలో ఇది 1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. ఇక ఎనిమిది కీలక రంగాల సూచీలో అత్యధిక వాటా కలిగిన పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు కూడా 4.7 శాతం క్షీణించాయి. మేలో ఈ తగ్గుదల 8.2 శాతంగా ఉండగా, జూన్‌లో కొంత మేర తగ్గుదల పరిమితమైంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ ఎనిమిది కీలక రంగాల వాటా సుమారు 40 శాతం ఉంటుంది. అందువల్ల వీటి పనితీరు పారిశ్రామిక రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.